అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

ఆదివారం 18-3-2018

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 79 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | 12 + 16 పేజీలు

నిద్ర కరువు

- మందులు, ఇతర వ్యాపకాలతో నిద్ర తెచ్చుకుంటున్న 45 శాతం యూత్
- పని ఒత్తిడి, టెక్నాలజీ వినియోగం, నగరీకరణ, ఆధునిక జీవనశైలే ప్రధాన కారణం
- తక్కువ గంటలు నిద్రించే వారిలో 15శాతం మరణరేటు ఎక్కువ! : ఫిలిప్స్ ఇండియా, హార్వర్డ్ యూనివర్సిటీ సర్వేల్లో వెల్లడి

66 శాతం మంది భారతీయులకు నిద్ర కష్టాలు

"కడుపు నిండా చక్కని తిండి. కంటి నిండా కమ్మటి నిద్ర.. మనిషికి ఈ రెండూ చాలంటారు పెద్దలు!" "చక్కని తిండి సరే.. కమ్మటి నిద్రేంటి? కమ్మగా ఉండటానికి.. అదేమైనా ఆహారమా?" అనే సందేహం వద్దు. ఆధునిక కాలంలో.. మారుతున్న జీవనశైలి కారణంగా.. నిద్ర యొక్క అసలైన రుచేంటో నేటి జీవి ఎప్పుడో మరిచిపోయాడు. ఇప్పుడు ఆ నిద్రలేమే సకల రోగాలకు మూలంగా పరిణమించడం ఆందోళనను కలుగజేస్తోంది. ఆ నేపథ్యంపై 'నవతెలంగాణ' ప్రత్యేక కథనం..



జై

ఉరుకులూ పరుగుల జీవనం మూలంగా ఒత్తిడి మొదలై, సరైన నిద్రలేక మనిషి జీవితం క్రమక్రమంగా దుర్భరమవుతున్నదని ఇప్పటికే ఎన్నో అధ్యయనాలు తేల్చాయి. నిద్రలేమితో అనేక సమస్యలు ఎదుర్కొంటున్న వారిలో భారతీయులదే ప్రముఖ స్థానమని హార్వర్డ్ యూనివర్సిటీ పరిశోధకులు ఇప్పటికే, హెచ్చరించిన విషయం తెలిసిందే! అయినప్పటికీ, భారతీయుల వ్యవహారశైలిలో మార్పు రాకపోవడం విచారకరం.

66 శాతం మందికి నిద్రలేమి!

ఇండియా, అమెరికా, యూకే, చైనా, ఆస్ట్రేలియా, జర్మనీ, జపాన్, ఫ్రాన్స్ వంటి 13దేశాలకు చెందిన సుమారు 15వేల మంది యువతీ, యువకులపై 'ఫిలిప్స్ ఇండియా' సంస్థ నిద్రకు సంబంధించి నిర్వహించిన తాజా సర్వేలో ఆసక్తికర విషయాలు వెలువడ్డాయి. తమలో నిద్రలేమికి టెక్నాలజీయే ప్రధాన కారణమని అధ్యయనంలో పాల్గొన్న సుమారు 32శాతం మంది భారతీయులు ...9లో

గిరిజన యువతిపై సామూహిక లైంగికదాడి 6

సీఎం ఉగాది శుభాకాంక్షలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. శ్రీవిళంబినామ సంవ త్సరంలో ప్రజలు సుఖ సంతో షాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందాలని, వాటితో రాష్ట్రం ముందుకు సాగాలన్నారు.

మంత్రే కమీషన్ తీసుకోమన్నాడు

- ఎన్నికల ఖర్చు రాబట్టుకోవాలంటే అది తప్పనిసరి : రాజన్న సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ సామల పావని

వ్యక్తిగత కారణాలతో రాజీనామా : పావని 9

ఎన్డీయే సర్కారుపై అవిశ్వాసానికి పూర్తి మద్దతు

సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో

వివరాలు 9లో

పీఈటీ వేధింపులతో విద్యార్థిని ఆత్మహత్య

- రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో ఘటన


వివరాలు 9లో

హెచ్‌సీయూ విద్యార్థినిపై

అసభ్య ప్రవర్తన

- నలుగురు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీసీపీ

వివరాలు 9లో



మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ

మే 23న నిరసన ప్రదర్శనలు

ప్రజాసంఘాల పిలుపు



న్యూఢిల్లీ : మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మే 23న నిరసన భేరీ మోగించనున్నారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు, బ్యాంకు, ఇన్సూరెన్ ఉద్యోగులు, కళాశాల, విశ్వవిద్యాలయ అధ్యాపకులు, విద్యార్థులు, మహిళలు, దళితులు, ఆదివాసీలు, పర్యావరణవేత్తలకు సంబంధించి దాదాపు 100కుపైగా ప్రజా సంఘాలు మే 23న జన్ ఏక్తా జన్ అధికార్ ఆందోళన్ (జేఈజేఏఏ) నేతృత్వంలో అన్ని రాష్ట్ర రాజధానుల్లో 'నిరసన దినం' పాటించనున్నారు. 'ఇటీవల దేశరాజధానిలో రైతులు, కార్మికులు, ఇతర వర్గాల ప్రజల జరిపిన ఆందోళనను మరింత ముందుకు తీసుకుని వెళ్లే లక్ష్యంతో ఎన్‌డీయే ప్రభుత్వ నాలుగో వార్షికోత్సవం రోజున జేఈజేఏఏ తన మరో విడత పోరాటాన్ని ప్రారంభించాలని నిర్ణయించింది' అని కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులు హన్నన్‌మొల్లా చెప్పారు. ప్రభుత్వ వినాశకర విధానాలు ముఖ్యంగా మహిళలు, యువకులపై తీవ్ర ప్రభావం పడుతున్నదని, ఇందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హన్నన్‌మొల్లా డిమాండ్ చేశారు. జేఈజేఏఏలో భాగస్వామి అయిన ఏఐకేఎస్ నేతృత్వంలో ఇటీవల మహారాష్ట్రలో నిర్వహించిన కిసాన్ మార్చ్ విజయవంతమైన విషయం తెలిసిందే. 'మహారాష్ట్రలో రైతుల మార్చ్‌ను మేం చూశాము, మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన గళానికి మరింత పదును పెట్టాలని నిర్ణయించాం' అని కో-ఆర్డినేషన్ కమిటీ పి కృష్ణప్రసాద్ చెప్పారు.



బీజేపీకి యూపీలో మరో ఎదురుదెబ్బ

- సమాజ్‌వాది పార్టీలో చేరిన మంత్రి అల్లుడు

లక్నో: ఇటీవలి ఉప ఎన్నికల్లో పరాజయాలతో తల బొప్పికట్టించుకున్న యూపీ అధికార పార్టీ బీజేపీకి తాజాగా మరో ఎదురు దెబ్బ తగిలింది. యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వంలో మంత్రిగా వున్న స్వామి ప్రసాద్ మౌర్య అల్లుడు నావల్ కిషోర్ శనివారం నాడు సమాజ్‌వాది పార్టీలో చేరారు. పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, మరో అగ్రనేత అజంఖాన్‌ల సమక్షంలో ఆయన సమాజ్‌వాది తీర్థం పుచ్చుకున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. గతంలో బీఎస్పీలో ఒబిసి నేతగా ఎదిగిన స్వామి ప్రసాద్ మౌర్య 2016 అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీలో చేరి ఘన విజయం సాధించారు. ప్రస్తుతం ఆయన యోగి మంత్రివర్గంలో కార్మిక, సర్వీస్ ప్లానింగ్, పేదరిక నిర్మూలన శాఖలను నిర్వహిస్తున్నారు.

యూపీలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

- గోరఖ్‌పూర్ కలెక్టర్‌కు ప్రమోషన్

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో 37 మంది ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్(ఐఏఎస్) అధికారులను బదిలీ చేస్తూ యోగి ఆదిత్యనాథ్ సర్కారు నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు శనివారం అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. బదిలీ అయిన వారిలో 17 మంది కలెక్టర్లు ఉన్నారు. గోరఖ్‌పూర్ డిస్ట్రిక్ మేజిస్ట్రేట్‌గా పని చేస్తున్న రాజీవ్ రౌతేలాకు దేవీపఠాన్ డివిజనల్ కమిషనర్‌గా పదోన్నతి లభించింది. ఇటీవల గోరఖ్‌పూర్, పుల్పూర్ లోక్ సభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికలో బీజేపీ దారుణ పరాజయాన్ని చవి చూసిన సంగతి తెలిసిందే. ఈ రెండు స్థానాలను సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) కైవసం చేసుకున్నది. ఈ ఎన్నికల ఫలితాలు వెల్లడైన రెండ్రోజుల్లోనే యూపీ ప్రభుత్వం.. అధికారులను బదిలీ చేయడం గమనార్హం. గోరఖ్‌పూర్ స్థానానికి ఓట్ల లెక్కింపు వివరాలు తెలుసుకోకుండా మీడియాను నిషేధించి రాజీవ్ రౌతేలా వివాదంలోకెక్కారు. కాగా.. యోగి సర్కారు చేపట్టిన ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా రాజీవ్‌కు ప్రమోషన్ దక్కడం గమనార్హం. కాగా 43 మంది ఐపీఎస్‌లను యోగి సర్కార్ బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో..

- ఒడిషా సెంట్రల్ యూనివర్సిటీ నిరవధికంగా మూసివేత

ఒడిషా: డిమాండ్లు పరిష్కరించాలని విద్యార్థులు చేస్తున్న ఆందోళనల నేపథ్యంలో ఒడిషా సెంట్రల్ యూనివర్సిటీ నిరవధికంగా మూతపడింది. శాశ్వత అధ్యాపకులను నియమించడం, ఆరోగ్య సంరక్షణ కేంద్రాల ఏర్పాటు, పరిశోధనా విద్యార్థులకు హాస్టల్ వసతులు కల్పించడం, పరిపాలన కార్యాలయాన్ని ప్రధాన క్యాంపస్‌కు మార్చాలనే ప్రధాన డిమాండ్లతో పాటు 60 డిమాండ్లను నెరవేర్చాలంటూ యూనివర్సిటీ విద్యార్థులు కోరాపుట్ క్యాంపస్‌లో కొన్ని రోజుల నుంచి ఆందోళనలు కొనసాగిస్తున్నారు. విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో యూనివర్సిటీని గురువారం నుంచి నిరవధికంగా మూసివేస్తూ వైస్ ఛాన్సలర్ సచ్చిదానంద మొహంతి ఆదేశాలు జారీ చేశారు. క్రమశిక్షణను కొనసాగించడానికే ఈ నిర్ణయాన్ని తీసుకున్నామని మొహంతి చెప్పారు. దీంతో విద్యార్థులంతా ఈ నెల 15లోగా హాస్టళ్లను ఖాళీ చేయాలని జాయింట్ రిజిస్ట్రార్ కెవి ఉమారావ్ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. కాగా, డిమాండ్లు ఫలించని కారణంగానే బుధవారం సాయంత్రం ధర్నా నిర్వహించామని విద్యార్థులు తెలిపారు.

మహిళా జర్నలిస్టుపై వివాదాస్పద వ్యాఖ్యలు

క్షమాపణ చెప్పిన తమిళనాడు మంత్రి

చెన్నై : మహిళా జర్నలిస్టుపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తమిళనాడు ఆరోగ్యశాఖ మంత్రి తన వ్యాఖ్యలపట్ల విచారం వ్యక్తం చేస్తున్నట్టు ప్రకటించారు. తమిళనాడు ఆరోగ్య శాఖ మంత్రి విజయ్ భాస్కర్ ఒక మహిళా జర్నలిస్టును ఉద్దేశించి చేసిన సెక్సీ కామెంట్లు వివాదాస్పదం గా వారాయి.. 'నీ స్పెడ్స్ చాలా బాగున్నాయ్.. నువ్వు కూడా చాలా అందంగా ఉన్నావ్..' అని అంటూ లేడీ టీవీ రిపోర్టర్‌ను ఉద్దేశించి విజయ్ భాస్కర్ వ్యాఖ్యానించారు. కాగా, ఇది తీవ్ర వివాదం కావడంతో చివరకు విచారం వ్యక్తం చేస్తున్నట్టు ప్రకటించారు. కావేరీ వాటర్ బోర్డ్‌కు సంబంధించి తమిళనాడు ప్రభుత్వ ముఖ్యులు జరిపిన సమావేశానికి విజయ్ భాస్కర్ హాజరయ్యాడు. సమావేశం ముగిసిన తర్వాత విలేకరులు ఏం మాట్లాడారో చెప్పాలని కోరారు. ప్రశ్నలడుగుతున్న వారిలో ఉన్న మహిళా జర్నలిస్టునుద్దేశించి పదేపదే 'నువ్వు అందంగా ఉన్నావు' అంటూ వ్యాఖ్యానించారు. ఇదంతా వీడియోల్లో రికార్డు అయ్యింది. ఈ వివాదంపై మంత్రి మాట్లాడుతూ.. తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నా రన్నారు.

పంజాబ్ మాజీ సీఎం హత్య కేసులో

దోషి జగ్తార్ సింగ్‌కు యావజ్జీవం

చండీగఢ్ : పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి బియాంత్ సింగ్ హత్య కేసులో ప్రమేయమున్న జగ్తార్ సింగ్ తారాకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు శనివారం కీలక తీర్పు వెలువరించింది. 1995 ఆగస్టు 31న చండీగఢ్‌లోని సివిల్ సెక్రెటేరియట్ ఆవరణలో జరిగిన ఆత్మాహుతి దాడిలో అప్పటి ముఖ్యమంత్రి బియాంత్‌తో పాటు మరో 16 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ కేసులో 1995 సెప్టెంబర్‌లో అరెస్టయిన జగ్తార్... 2004లో జైలు నుంచి తప్పించుకున్నాడు. 2015లో అతడు థాయిలాండ్‌లో అరెస్టయి చండీగఢ్‌లోని బురె యిల్ జైలులో ఉంటున్నాడు. కాగా..శాంతి భద్రతల దృష్ట్యా బురెయిల్ జైలులోనే.. సెషన్స్ కోర్టు జడ్జి జెఎస్ సిద్ధూ తీర్పు వెలువరించారు. మరోవైపు ఈ తీర్పును పై కోర్టులో సవాల్ చేయబోమని జగ్తార్ తరఫు న్యాయవాది సిమ్రాన్‌జిత్ సింగ్ తెలిపారు. సిక్కుల హక్కుల కోసం ప్రభుత్వంపై పోరాడుతున్నానని, ఇక ముందు కూడా కొనసాగిస్తానని జగ్తార్.. కోర్టుకు తెలిపినట్టు ఆయన వివరించారు.

నోటి దూల

- ఐన్‌స్టీన్ చెప్పిన ఈ - ఎంసీ స్క్వేర్‌కన్నా..
- శక్తివంతమైన సూత్రీకరణ వేదాలలో ఉన్నదా..?
- ఆ విషయం స్టీఫెన్ హాకింగ్ చెప్పారంటూ..
- సైన్స్ కాంగ్రెస్‌లో కేంద్రమంత్రి హర్షవర్ధన్ చేసిన వ్యాఖ్యలపై దుమారం

న్యూఢిల్లీ: 105వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సందర్భంగా కేంద్ర శాస్త్ర, సాంకేతికశాఖమంత్రి హర్షవర్ధన్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ప్రముఖ శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ చెప్పిన ఈ ఎంసీ స్క్వేర్ సూత్రీకరణ కన్నా శక్తివంతమైన సిద్ధాంతమే వేదాలలో ఉన్నదని ఇటీవల మరణించిన మరో ప్రముఖ శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ అన్నారని హర్షవర్ధన్ వ్యాఖ్యానించారు. హాకింగ్ పేరును తన వ్యాఖ్యల సమర్థనకు మంత్రి వాడుకోవడంతో అంతా ఆశ్చర్యపోయారు. అది ఆషామాషీ రాజకీయ సభ అయితే ఎవరూ అంతగా పట్టించుకునేవారు కాదు. దేశంలోని ఉద్దండ శాస్త్రవేత్తలు హాజరయ్యే సైన్స్ కాంగ్రెస్‌లో కేంద్రమంత్రి ఈ వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఓవిధంగా ఈ వ్యాఖ్యలతో కేంద్రమంత్రి ఇరకాటంలో పడ్డారనే చెప్పాలి. హాకింగ్ ఆ విధంగా చెప్పినట్టు ఆధారమేమిటని కేంద్రమంత్రిని విలేకరులు ప్రశ్నించారు. దాంతో, ఆధారం కోసం మీరు ప్రయత్నించండి, కనుగొనడంలో విఫలమైతే నా దగ్గరున్న సమాచారాన్ని మీకు ఇస్తానంటూ హర్షవర్ధన్ తప్పించుకున్నారు.

ఈ అంశంపై పలువురు శాస్త్రవేత్తలను జాతీయ మీడియా సంప్రదించగా హాకింగ్ అలా అన్నట్టు ఎటువంటి ఆధారాలు లేవని చెప్పడం గమనార్హం. దీనిపై బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో సీనియర్ శాస్త్రవేత్త రోహిణీ గాడ్‌బోలే మాట్లాడుతూ 'నాకు అనుమానంగా ఉన్నది. హాకింగ్ నుంచి అటువంటి ప్రకటన వచ్చినట్టుగా నేను ఏనాడూ వినలేదు' అని అన్నారు.



ఈ-ఎంసీ స్క్వేర్ అంటే..?

ఐన్‌స్టీన్ చెప్పిన ఈ సూత్రీకరణ పదార్థ విజ్ఞానశాస్త్రంలో పలు అంశాలను అత్యంత సూక్ష్మంగా పరిశీలించేందుకు అవకాశం కల్పించింది. ఈ అంటే శక్తి, ఎం అంటే ద్రవ్యరాశి, సీ అంటే కాంతి వేగం, స్క్వేర్ అంటే రెండుసార్లు గుణించాలి. కాంతి వేగం సెకండ్‌కు 3 లక్షల కి.మీ... ఏదైనా పదార్థాన్ని పూర్తిగా మండించగలిగితే(శక్తిగా మారిస్తే) ఐన్‌స్టీన్ చెప్పిన లెక్క ప్రకారం అంత శక్తి విడుదలవుతుందని అర్థం. కాంతి వేగాన్ని రెండుసార్లు గుణించగా వచ్చిన ఫలితంతో ద్రవ్యరాశిని గుణిస్తే ఎంతకు సమానమో అంత శక్తి అన్నది ఆ సూత్రీకరణ సారాంశం. అయితే, ఏ కొద్ది పదార్థాన్ని కూడా పూర్తిస్థాయిలో మండించడం అంత తేలికైన విషయం కాదు. ఉదాహరణకు ఓ చిన్న కట్టెపుల్లను మండిస్తే అందులోంచి కొంత ఉష్ణం, కాంతి, పొగ వస్తుంది. అంతేకాదు..కొంత బూడిదగా మారుతుంది. అంటే..బూడిద కూడా కట్టెలోని పదార్థమేనన్నది గమనార్హం. కానీ, రేడియో ధార్మిక పదార్థాలైన యురేనియం, థోరియంలాంటివాటిని పూర్తిస్థాయిలో మండించేందుకు అవకాశాలున్నాయి. దాని ఆధారంగానే అణుబాంబులు, హైడ్రోజన్ బాంబుల్ని రూపొందించారు. ఓవిధంగా ఐన్‌స్టీన్ సూత్రీకరణ అణుబాంబుల తయారీకి ఉపయోగపడింది. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో అప్పటి అమెరికా అధ్యక్షుడైన రూజ్‌వెల్ట్‌కు 1939, ఆగస్టు 2న ఐన్‌స్టీన్ ఓ లేఖ రాశారు. అణుబాంబుల తయారీకి ఉన్న అవకాశాల గురించి ఆ లేఖ ద్వారా అమెరికా శాస్త్రవేత్తలకు ఐన్‌స్టీన్ సూచించారు. ఆ లేఖ ప్రేరణతోనే మ్యాన్‌హట్టన్ ప్రాజెక్ట్ ద్వారా మొదటి అణుబాంబును అమెరికా రూపొందించింది. అయితే, విధ్వంసం సృష్టించాలనేది ఐన్‌స్టీన్ ఆలోచన కాదు. జర్మనీ నియంతగా ఉన్న హిట్లర్ దగ్గర అటువంటి బాంబులు అప్పటికే ఉన్నాయని ఐన్‌స్టీన్ అనుమానించారు. హిట్లర్‌ను కట్టడి చేయడం కోసం కౌంటర్‌గా అమెరికా వద్ద కూడా అణుబాంబులు ఉంటే ఎవరూ ప్రయోగించకుండా రాజీపడే అవకాశముంటుందనేది ఐన్‌స్టీన్ ప్రణాళిక.

ఐన్‌స్టీన్ అదొక్కటే కాదు, మానవాళికి ఉపయోగపడే పలు సూత్రీకరణలు చేశారు. ప్రత్యేక సాపేక్ష సిద్ధాంతం, ఫోటో ఎలెక్ట్రిక్ ఎఫెక్ట్, గురుత్వాకర్షణ తరంగాలువంటివి అందులో కొన్ని..ఫోటో ఎలెక్ట్రిక్ ఎఫెక్ట్‌కు ఐన్‌స్టీన్‌కు ప్రతిష్టాత్మక నోబెల్ బహుమతి కూడా వచ్చింది. ఐన్‌స్టీన్ సూత్రీకరణలు చాలావాటిని స్టీఫెన్‌హాకింగ్‌సహా ప్రముఖ శాస్త్రవేత్తలంతా అంగీకరించారు. ఇప్పటికే కొన్ని సూత్రీకరణలు ఆధారాలతోసహా రుజువయ్యాయి. గురుత్వాకర్షణ తరంగాల గురించి వందేండ్ల క్రితం చెప్పిన ఐన్‌స్టీన్ సూత్రీకరణకు ఇటీవలే శాస్త్రవేత్తలు రుజువులు సాధించారన్నది గమనార్హం.

బీజేపీ ద్వేషాన్ని వ్యాపింపజేస్తుంటే..

మేం ప్రేమ, సోదరభావంతో ముందుకు : రాహుల్

న్యూఢిల్లీ: నరేంద్రమోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ద్వేషం, ఆగ్రహాన్ని(కోపాన్ని) వ్యాపింపజేస్తున్నదని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ విమర్శించారు. దేశాన్ని స్నేహం, ప్రేమతో ముందుకు నడిపించేది కాంగ్రెస్ ఒక్కటేనని రాహుల్ అన్నారు. కాంగ్రెస్ చేయి(ఎన్నికల గుర్తు) మాత్రమే దేశాన్ని ఐక్యం చేస్తుందని రాహుల్ అన్నారు. వారు ద్వేషం, కోపాన్ని వ్యాపింపజేస్తుండగా.. తాము ప్రేమ, సోదరభావాన్ని వ్యాపింపజేస్తున్నామని రాహుల్ అన్నారు. బీజేపీకీ, కాంగ్రెస్‌కు తేడా అదేనన్నారు. యువతనూ,సీనియర్లనూ సమన్వయం చేస్తూ పార్టీని నడిపిస్తానని రాహుల్ అన్నారు. పార్టీ నిర్వహణలో మార్పు ఉన్నప్పటికీ గతాన్ని, వారసత్వాన్ని మరిచిపోమని రాహుల్ అన్నారు. సీనియర్ల అనుభవం తోడు లేకుండా యువత పార్టీని ముందుకు నడిపించలేరని రాహుల్ స్పష్టం చేశారు. ఈ దేశం అన్ని మతాలవారిది, అన్ని కులాలవారిది, అందరిదీ..కాంగ్రెస్ పార్టీ కూడా అందరిదీ అని రాహుల్ అన్నారు.



కాంగ్రెస్ పార్టీ 84వ ప్లీనరీ సమావేశాల్లో రాహుల్ ప్రసంగించారు. రాహుల్‌గాంధీ తొలిసారి అధ్యక్ష హోదాలో ఈ ప్లీనరీలో ప్రసంగించారు. శుక్రవారం ప్రారంభమైన ప్లీనరీ సమావేశాలు ఆదివారం ముగియనున్నాయి. ఈ సమావేశాలకు కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్,లోక్‌సభలో కాంగ్రెస్‌పక్ష నేత మల్లికార్జున్‌ఖర్గే, పార్టీ సీనియర్ నేతలు, వివిధ రాష్ట్రాల నుంచి ఏఐసీసీ ప్రతినిధులు హాజరయ్యారు.

నీరవ్‌కు 'మహా' షాక్..

- 250 ఎకరాల భూమి
- స్వాధీనం చేసుకున్న రైతులు

ముంబయి: పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ)కు దాదాపు రూ.12 వేల కోట్ల రుణాలు ఎగ్గొట్టిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీకి ఊహించని షాక్ తగిలింది. మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ జిల్లాలో ఆయన కంపెనీ పేరిట ఉన్న 250 ఎకరాల భూమిని రైతులు స్వాధీనం చేసుకున్నారు. తమను బెదిరించి అతి తక్కువ ధరకే ఈ భూమిని నీరవ్ సొంతం చేసుకున్నాడని వారు ఈ సందర్భంగా తెలిపారు. దాదాపు 200 మంది రైతులు ఎడ్ల బండ్లపై అహ్మద్‌నగర్‌లోని ఖండాలా ప్రాంతానికి శనివారం చేరుకున్నారు. అక్కడ నీరవ్ పేరిట ఉన్న భూమిని ట్రాక్టర్‌తో దున్నారు. ఈ భూమినంతా సాగు చేయనున్నట్టు రైతులు తెలిపారు. ఎకరా రూ.20 లక్షలు ధర పలికే భూమిని నీరవ్ కేవలం రూ.15 వేలకే సొంతం చేసుకున్నాడని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే.. పీఎన్‌బీ కేసు దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అటాచ్ చేసిన ఆస్తుల్లో ఈ భూమి కూడా ఉండటం గమనార్హం.



నెహ్రూ విగ్రహంపై నల్ల రంగు

- బెంగాల్‌లో ఘటన

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లోని కత్వా జిల్లాలో దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ విగ్రహంపై గుర్తుతెలియని కొందరు వ్యక్తులు నల్ల రంగు పోసి విధ్వంసం సృష్టించారు. కత్వాలోని టెలిఫోన్ మైదాన్ వద్ద ఉన్న నెహ్రూ విగ్రహంపై శుక్రవారం రాత్రి ఈ దాడి జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని దానిని శుభ్రం చేయించారు. త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కూటమి విజయంతో విగ్రవీగిన ఆ కార్యకర్తలు అక్కడి లెనిన్ విగ్రహ విధ్వంసంతో దేశంలోని పలు ప్రాంతాల్లో ఈ తరహాదాడులకు కాషాయ మూకలు తెరలేపిన విషయం తెలిసిందే.

బీహార్‌లో అంబేద్కర్ విగ్రహం

బీహార్‌లోని బేగుసరైలో గుర్తుతెలియని వ్యక్తులు కొందరు వ్యక్తులు అంబేద్కర్ విగ్రహానికి మసిపూసారు. గత 12 రోజుల్లో ఇది ఏడో ఘటన కావడం గమనార్హం.



జేఎన్‌యూలో సిబ్బంది తొలగింపు అన్యాయం

- రేపటి నుంచి టీచర్స్ అసోసియేషన్ నిరాహార దీక్ష

న్యూఢిల్లీ: దేశ రాజధానిలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ)లో సిబ్బంది తొలగింపును నిరసిస్తూ అధ్యాపకులు, విద్యార్థులు తమ ఆందోళనను ఉధృతం చేస్తున్నారు. ఈ క్రమంలోనే సోమవారం నుంచి సత్యాగ్రహ పేరుతో నిరాహార దీక్ష చేపట్టనున్నట్టు జేఎన్‌యూ టీచర్స్ అసోసియేషన్ వెల్లడించింది. వర్సిటీలో ఇటీవల అమల్లోకొచ్చిన తప్పనిసరి హాజరీ విధానాన్ని అమలు చేయడం లేదన్న కారణంతో పలు విభాగాల్లోని డీన్లు, చైర్‌పర్సన్లను యాజమాన్యం తొలగించింది. అయితే.. సిబ్బంది తొలగింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని, వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేస్తున్నది. వర్సిటీ యాజమాన్యం..సిబ్బందిపై అక్రమంగా చర్యలు తీసుకోవడమే కాక, వారిని వేధింపులకు గురి చేస్తున్నదని ఆరోపిస్తున్నది. వర్సిటీ అక్రమంగా జారీ చేసిన సర్క్యులర్లను ఈనెల 21లోగా వెనక్కి తీసుకోకుంటే ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించింది.

ఆరోగ్య పథకాల అమలులో కేంద్రం నిర్లక్ష్యం...

గత బడ్జెట్‌లో ఆర్ఎస్‌బీవై నిధులకు కోత

- రూ.975 కోట్ల నుంచి రూ.450 కోట్లకు కుదింపు
- మోడీ ప్రభుత్వ తీరును తప్పు పట్టిన పార్లమెంటరీ కమిటీ
- రూ.12,000 కోట్లు అవసరమైన ఎన్‌హెచ్‌పీఎస్‌పై పలు అనుమానాలు..?

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆరోగ్య పథకాల అమలుతీరు పట్ల పార్లమెంటరీ కమిటీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ ఏడాది(2018-19) బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా దేశంలోని పేద కుటుంబాలకు ఏటా రూ.5 లక్షలమేర ఆరోగ్య బీమా కల్పిస్తామంటూ జాతీయ ఆరోగ్య సంరక్షణ పథకం(ఎన్‌హెచ్‌పీఎస్)ను ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, దీనికన్నా ముందు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలు(బీపీఎల్ కుటుంబాలు), అసంఘటిత రంగంలోని కార్మికుల కోసం రాష్ట్రీయ స్వస్థ బీమా యోజన(ఆర్ఎస్‌బీవై) పేరుతో ఓ పథకం ఉన్నది. 2008లో యూపీఏ ప్రభుత్వం ప్రారంభించిన ఈ పథకాన్ని బీజేపీ నేతృత్వంలోని ప్రస్తుత ప్రభుత్వం కూడా బడ్జెట్ లెక్కల్లో అమలు చేస్తున్నట్టు చెప్పుకుంటూ వచ్చింది. కానీ, ఆర్ఎస్‌బీవైపై ఏర్పాటైన పార్లమెంటరీ స్థాయీ సంఘం అధ్యయనంలో పథకం అమలులోని పలు లోపాలు బయటపడ్డాయి. ఇటీవలే కమిటీ తన నివేదికను కేంద్రానికి అందించింది.

ఆర్ఎస్‌బీవై కోసం 2017-18 బడ్జెట్‌లో రూ.975 కోట్లు కేటాయిస్తున్నట్టు చెప్పి ఆ తర్వాత రూ.565 కోట్లకు మోడీ ప్రభుత్వం తగ్గించింది. కేటాయించిన నిధుల్ని కూడా రాష్ట్రాలకు విడుదల చేయలేదని, కేవలం రూ.450 కోట్లు మాత్రమే తన వాటాగా ఇచ్చిందని పార్లమెంటరీ కమిటీ తన నివేదికలో తెలిపింది. ఎందుకిలా తగ్గించారని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖను ప్రశ్నించగా..రూ.లక్షకు బీమా కవరేజ్‌ను పెంచేందుకు తమ ప్రతిపాదనపై రాష్ట్రాల నుంచి నివేదికల కోసం ఎదురు చూస్తున్నామని..దాంతో, ఆర్ఎస్‌బీవైని నిలిపి వేశామని సమాధానమిచ్చినట్టు కమిటీ తన నివేదికలో ఉటంకించింది. ఆర్ఎస్‌బీవై ద్వారా బీపీఎల్



కుటుంబాలకు రూ.30,000 బీమా కల్పించాలనేది గత పథకం లక్ష్యం. అయితే, ఆ లక్ష్యాన్ని కూడా చేరుకోవడంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విఫలమైనట్టు నివేదిక స్పష్టం చేసింది. కనీసం ఆ పథకం గురించి కూడా పేద కుటుంబాలకు చాలావరకు తెలియదనే చెప్పాలి. అర్హత ఉన్న కుటుంబాల్లో 57 శాతం మాత్రమే ఆర్ఎస్‌బీవైలో చేరారని, 12 శాతం మాత్రమే లబ్ది పొందారని కమిటీ(స్థాయీ సంఘం) తన నివేదికలో విశ్లేషించింది. వైఫల్యాలపై కమిటీని ఏర్పాటు చేసి ఇకనైనా ఆ పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని స్థాయీ సంఘం తన నివేదికలో కేంద్రానికి సూచించింది.

ఇదిలా ఉండగానే కేంద్రం ఎన్‌హెచ్‌పీఎస్ పేరుతో కొత్త పథకాన్ని ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఎన్‌హెచ్‌పీఎస్ పరిధిలోకి వచ్చేవారిలో దాదాపు 50 శాతం ఆర్ఎస్‌బీవై కింద ఉన్నవారేనని కమిటీ గుర్తించింది. ఎన్‌హెచ్‌పీఎస్ ద్వారా దేశంలోని 10 కోట్ల కుటుంబాలకు(50 కోట్లమందికి) ఆరోగ్య బీమా కల్పిస్తానని మోడీ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నది. ఈ పథకానికి తాజా బడ్జెట్‌లో కేటాయించింది మాత్రం రూ.2000 కోట్లే కాగా, కేంద్రం వాటాగా కనీసం రూ.12,000 కోట్లు అవసరమవుతాయని అంచనా ఉన్నది. కేంద్ర-రాష్ట్రాలు 60:40 నిష్పత్తిలో ఈ పథకం కోసం ఖర్చు చేయాల్సి ఉంటుంది. కొత్తగా తెచ్చిన పథకాన్ని ఔట్ పేషెంట్ల విషయంలోనూ అమలు చేయాలని పార్లమెంటరీ కమిటీ సూచించింది. అయితే, ఇప్పటికే ఏపీ, తెలంగాణలాంటి రాష్ట్రాల్లో ఆరోగ్యశ్రీ వంటి పథకాలు అమలవుతున్నాయి. రాష్ట్రాలు సొంతంగా అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలపై కేంద్ర అధికారులు అధ్యయనం చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఆరోగ్యశ్రీ అమలుతీరుపై తెలంగాణ ప్రభుత్వం నుంచి కేంద్రానికి నివేదిక అందింది.



ప్రత్యేకప్యాకేజీ కోసం..

అగర్తలా : త్రిపుర ముఖ్యమంత్రి విప్లవ్ కుమార్ దేవ్ త్వరలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలిసి రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజ్‌ను కోరనున్నారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభాన్ని తట్టుకుని నిలబడేందుకు ప్రత్యేక ప్యాకేజ్ కావాలని మోడీని కోరనున్నట్టు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రణజిత్ సింగ్ రాయ్ ఇక్కడ విలేకరులకు తెలిపారు.

FORM - A

PUBLIC ANNOUNCEMENT

[Under Regulation 6 of the Insolvency and Bankruptcy Board of India (Insolvency Resolution Process for Corporate Persons) Regulations, 2016]

FOR THE ATTENTION OF THE CREDITORS OF MIC ELECTRONICS LIMITED

RELEVANT PARTICULARS		
1.	Name of Corporate Debtor	MIC ELECTRONICS LIMITED
2.	Date of incorporation of corporate debtor	17.05.1988
3.	Authority under which corporate debtor is incorporated / registered	Ministry of Corporate Affairs, Registrar of Companies, Hyderabad.
4.	Corporate identity number of corporate debtor	L31909TG1988PLC008652
5.	Address of the registered office and principal office (if any) of corporate debtor	Registered Office: A4/II, ELECTRONIC COMPLEX, KUSHAIGUDA, HYDERABAD. TG 500062 IN
6.	Insolvency commencement date in respect of Corporate debtor	13.03.2018 (vide order dated 13.03.2018 passed by Hon'ble National Company Law Tribunal, Hyderabad Bench
7.	Estimated date of closure of insolvency resolution Process	180 days from the date of Insolvency commencement date which is 8th day of September2018.
8.	Name, Address, Email address and Registration number of the interim resolution professional	**Name:** Prabhakar Nandiraju **Address:** Nandiraju Prabhakar, S/O N. Surya Narayana, 11-12-7 Road No 1 Sri Rama Krishna Puram,Hyderabad,Andhra Pradesh, 500035 **Email address:** pnandiraju26@gmail.com / cirp.micel@avipgroup.co.in Registration No.: IBBI/IPA-002/IP-N00361/2017-2018/11030
9.	Last date for submission of claims	26th March 2018

Notice is hereby given that the National Company Law Tribunal has ordered the commencement of a corporate insolvency resolution process against the **MIC ELECTRONICS LIMITED** on 13.03.2018.

The creditors of **MIC ELECTRONICS LIMITED**,are hereby called upon to submit a proof of their claims on or before 26.03.2018 to the interim resolution professional at the address mentioned against item 8.

The financial creditors shall submit their proof of claims by electronic means only. All other creditors, including workmen and employees, may submit the proof of claims in person, by post or electronic means.

The claims may be submitted in the Scheduled Forms B,C,D,E and F in terms of Regulations 7, 8, 9 and 9A of the Insolvency and Bankruptcy Board of India (Insolvency Resolution Process for Corporate Persons) Regulations, 2016 by the Operational Creditors, Financial Creditors, Workmen or Employees and Authorized representative of workmen and employees respectively and other creditors, as the case may be. The aforesaid regulation and relevant forms are available and can be downloaded from the website www.ibbi.gov.in of The Insolvency and Bankruptcy Board of India.

Submission of false or misleading proofs of claim shall attract penalties.

Sd/-
Date : 15.03.2018 Prabhakar Nandiraju
Place : Hyderabad Interim Resolution Professional

ది. కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్ (KVB)

ఫోన్ నెం. 0870-2562149 & 2427592, ఇ-మెయిల్: warangal@kvbmail.com

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

రూల్ 8(1) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 క్రింద జారీచేయబడింది

[illegible]

తనఖా ఉంచిన స్థిరాస్తుల వివరములు

[illegible]

కళా ప్రదర్శనలకు ఆహ్వానం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఏప్రిల్ 13 నుంచి 22 వరకు హైదరాబాద్ కల్చరల్ ఫెస్ట్-2018 నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ రాష్ట్ర కార్యదర్శి కె.నర్సింహా తెలిపారు. శనివారం సుందరయ్య కళానిలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అభ్యుదయ కళా ప్రదర్శనలు ప్రదర్శించే బృందాలను వేదికపై ప్రదర్శనలు ఇవ్వాల్సిందిగా కోరారు. జానపద కళారూపాలు, సాంప్రదాయ నృత్యాలు, లఘు నాటికలు, వీధి నాటికలు, బృంద నృత్యాలు, భారత పాశ్చాత్య మిశ్రమ నృత్యాలు, పాటలు, నాటికలు వంటి అన్ని రకాల ప్రదర్శనలు చేయవచ్చని తెలిపారు.

ప్రతి బృందం తమ ప్రదర్శన నమోదు చేసుకున్న తర్వాత ప్రాథమికత పరిశీలన జరిపి ప్రదర్శనలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ప్రదర్శనల్లో పాల్గొన్న వారికి ప్రశంస పత్రాలతోపాటు సర్టిఫికేట్లు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, భిక్షమయ్య, మత్స్యగిరి, శాంతారాం, దేవి, వెంకట రమణ, కేఎల్ పదన్ తదిరులు పాల్గొన్నారు.

'తురక కాశలను ఆదుకోవాలి'



నవతెలంగాణ-సిటీబ్యూరో

సంచార జీవితం గడిపే తురక కాశలను ఆదుకోవాలని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ అబ్బాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 25న యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో తురక కాశల రాష్ట్ర సదస్సు నిర్వహించ నున్నట్టు చెప్పారు. హైదరాబాద్‌లోని ఆవాజ్ రాష్ట్ర కార్యాలయంలో సదస్సు పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిములలో తురక కాశ, ఫకీర్, గంటేవాల, అత్తర్‌సాబ్, గారెడీ, ఎలుగుబంట్లు, బోరెవాల వంటి సంచార జాతులు ఉంటాయని, వారిని ఎంబీసీల జాబితాలో చేర్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి కంప్రెషర్, కంకర మిషన్లు కొనుగోలు చేసి ఆర్థిక సాయం చేయాలని కోరారు. తురక కాశలకు ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 25న నిర్వహించనున్న సదస్సుకు టీమాస్ రాష్ట్ర చైర్మెన్ ప్రొఫెసర్ కంచ ఐలయ్య, ప్రొఫెసర్ మహ్మద్ అన్సారీ హాజరు కానున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్కె. లతీఫ్, తెలంగాణ ఫకీర్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహ్మద్ హుస్సేన్, తురక కాశ సంఘం నాయకులు ఎస్కె.ఇమాంపాషా, మగ్దూం, మాదార్, మౌలానా పాల్గొన్నారు.

గురుకులాల ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పొడిగింపు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువును ఈ నెల 20వ తేదీ వరకు పొడిగించారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం శుక్రవారంతో గడువు ముగిసింది. గురుకులాల్లో చదవాలని ఆశించిన విద్యార్థులందరికీ అవకాశం కల్పించాలన్న ఉద్దేశంతో గడువును మరో రెండు రోజులు పొడగించినట్టు గురుకులాల కార్యదర్శి ప్రశీణ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాశాఖ, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 497 గురుకులాల్లో చేరదలిచిన విద్యార్థు లకు ఏప్రిల్ 8న అర్హత పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు.

నవతెలంగాణ వార్షికోత్సవ సందర్భంగా 20న ఐలమ్మ ఆర్ట్ గ్యాలరీలో కార్టూన్ ఎగ్జిబిషన్

హైదరాబాద్: నవతెలంగాణ తెలుగు దినపత్రిక తృతీయ వార్షికోత్సవం సందర్భంగా సుందరయ్య విజ్ఞానకేంద్రం ఐలమ్మ ఆర్ట్ గ్యాలరీలో నవతెలంగాణ కార్టూన్ ఎడిటర్ నర్సిం, కార్టూనిస్టు జె వెంకటేష్ ల కార్టూన్ ఎగ్జిబిషన్ ఈ నెల 20వ తేదీ ఉదయం 11.30 కు ప్రముఖ సినీ దర్శకులు శ్రీ బి నరసింగరావు ప్రారంభిస్తారు. సమకాలీన సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలపై తమ వ్యంగ్య చిత్రాలతో పాఠకులను ఆకట్టుకుంటున్న ఈ కార్టూన్ల ప్రదర్శన ప్రారంభోత్సవానికి హాజరుకావాల్సిందిగా,అందరినీ ఆహ్వానిస్తున్నట్టు ఎడిటర్ ఎస్.వీరయ్య, చీఫ్ జనరల్ మేనేజర్ పివీ శ్రీనివాస్‌లు తెలిపారు. ప్రదర్శన ఈ నెల 22 వరకు కొనసాగుతుంది. ప్రదర్శన వేళలు మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుంది.



బహిరంగ ప్రకటన

[illegible]

కెనరా బ్యాంక్ (భారత ప్రభుత్వ సంస్థ)

ఫోన్:040 23436974

స్వాధీనతా ప్రకటన

[illegible] ... డిమాండ్ నోటీసు తేది: 28.05.2015 ... రూ. 1,26,45,987.14 ... 17 మార్చి, 2018న స్వాధీనంచేసుకొన్నారు. ... [illegible]

స్థిరాస్తి వివరణ

[illegible]

ప్రదేశం: హైదరాబాద్ / తేది: 17.03.2018 — అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

బంగారు ఆభరణాలుగా తాకట్టుపెట్టిన ఆస్తుల వేలం-కొరకు బహిరంగ ప్రకటన

బ్రాంచ్ చిరునామా

[illegible]

క్ర.సం.	పేరు/ చిరునామా/ ...
1.–50.	[illegible]
51.	[illegible] ఇ.నం.8-3-228/1280/277/ఎ, [illegible], యూసుఫ్‌గూడ, హైదరాబాద్, తెలంగాణ-500045/ రుణఖాతా నం: 917060007205599/ బాకీపడిన మొత్తం:53280.35
52.	[illegible] ఇ.నం.6-109, [illegible], ప్లాట్‌నం.102, రోడ్ నం.1, [illegible], రంగారెడ్డి, హైదరాబాద్, తెలంగాణ-500092/ రుణఖాతా నం: 917060033777927/ బాకీపడిన మొత్తం:97110.64
53.	[illegible] ప్లాట్‌నం.13, [illegible], యూసుఫ్‌గూడ [illegible], హైదరాబాద్, తెలంగాణ-500073/ రుణఖాతా నం: 917060068631786/ బాకీపడిన మొత్తం:36999.

బిందరు నియమనిబంధనలు:

[illegible] ... "Mr./Ms.M/s............" ... 23-మార్చి-2018న ... [illegible]

క్ర.సం.	బ్రాంచ్/ ఆఫీస్ పేరు	వేలం-తేది
1.	బీబీనగర్ (ఏపి)	27-03-2018
2.	చంపాపేట్, (ఏపి)	27-03-2018
3.	చందానగర్, హైదరాబాద్ (ఏపి)	27-03-2018
4.	డా.ఎఎస్ రావునగర్, హైదరాబాద్ (ఏపి)	27-03-2018
5.	[illegible] (ఏపి)	27-03-2018
6.	హిమాయత్‌నగర్, హైదరాబాద్ (ఏపి)	27-03-2018
7.	హైదరాబాద్ (ఏపి)	27-03-2018
8.	కూకట్‌పల్లి, హైదరాబాద్ (ఏపి)	27-03-2018
9.	మాదాపూర్, హైదరాబాద్ (ఏపి)	27-03-2018
10.	మహబూబ్‌నగర్ (టిజి)	27-03-2018
11.	మసాబ్‌ట్యాంక్, హైదరాబాద్ (ఏపి)	27-03-2018
12.	మెహిదీపట్నం, హైదరాబాద్ (ఏపి)	27-03-2018
13.	పటాన్‌చెరు (ఏపి)	27-03-2018
14.	సంగారెడ్డి (ఏపి)	27-03-2018
15.	సంజీవరెడ్డి నగర్, హైదరాబాద్ (ఏపి)	27-03-2018
16.	సికింద్రాబాద్ (ఏపి)	27-03-2018
17.	శంషాబాద్, హైదరాబాద్ (ఏపి)	27-03-2018
18.	తార్నాక, హైదరాబాద్ (ఏపి)	27-03-2018
19.	ఉప్పల్ కలాన్, హైదరాబాద్ (ఏపి)	27-03-2018
20.	జహీరాబాద్ (ఏపి)	27-03-2018

[illegible]

ప్రదేశం: హైదరాబాద్ — అధీకృత అధికారి, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

కొత్తదనం

సంపాదకీయం

జీవితంలో ప్రతిక్షణం నవనవోన్మేషంగా గడపాలన్న ఆకాంక్ష సహజం. మన అనుభవాల్లో, ఎదురయ్యే సంఘటనల్లో, దు:ఖంలో, సంతోషంలో కొత్తదనం కోసం ఆరాటపడటం మానవనైజం. సూర్యోదయాలు, సూర్యాస్తమయాలు, పూలు వికసించడం, నదులు ప్రవహించడం సర్వసాధారణం. కాలాలు వచ్చిపోతుంటాయి. రుతువులు మారుతుంటాయి. హేమంతం, గ్రీష్మం, వసంతం రాక అనివార్య పరిణామం. అయినప్పటికీ కాలాన్ని కొలమానంగా చేసుకొని నవ్యతని ఆశించడం మానవ స్వభావం. అందుకే నూతన సంవత్సరమన్నా, కొత్త రుతువులున్నా, కొత్త పంటలన్నా మనుషుల్లో ఒక ఉత్సాహపూరిత వాతావరణం నెలకొంటుంది. మానసికావరణంలో తెలియని ఉత్తేజమేదో తిరుగాడుతుంటుంది. ఏడాది పోకడ, రాకడ మామూలే అని సరిపెట్టుకోనివ్వదు మస్తిష్కం. కొత్త ఏడాదికి స్వాగతం పలకడం, కవిత్వ తోరణాలతో ఆహ్వానించడం ఆనందప్రద కలాపం. అందుకే విళంబి ఉగాదికి స్వాగతం పలుకుతోంది తెలుగు సమాజం.

కొత్తదనమంటే మార్పును కోరడం, మార్పు కోసం అసంకల్పితంగానే శ్రమించడం, మార్పు దిశగా ప్రయాణించడం. ఈ ప్రయాణంలో ఉగాదులు ఎన్నో వస్తుంటాయి. వాటిని సరికొత్తగా స్వాగతం పలకడం చరాచర ప్రకృతికి సత్కారం.

"నాకు ఉగాదుల్లేవు, ఉషస్సుల్లేవు" అని కృష్ణశాస్త్రి రాసినప్పటికీ కాసింత సాంత్వన కోసం ఆరాటపడే మనసు పండుగ వాతావరణానికి అతీతంగా ఉండదు. రెక్కలకష్టమ్మీద బతికే వారు పండగనాడు కూడా పనులు తప్పవని ఈసురోమంటారే తప్ప పండగ మీద విముఖత చూపరు. పండగంటేనే నూతనోత్సాహంతో మనసు విరాజిల్లుతుంది. పండగలన్నా, జాతరలన్నా, ఉత్సవాలన్నా, ఊరేగింపులన్నా ఆసక్తి చూపుతారు మనుషులు. నలుగురు కలిసే సందర్భాలు, మనసులు కలబోసుకునే సన్నివేశాలు పండగ వేళల్లోనే సాధ్యం. కష్టం, సుఖం పంచుకోడం, మంచీచెడ్డా మాట్లాడుకోడం ఎప్పుడయినా కొత్తగా ఉంటుంది. తెలియని విషయాలేవో తెలుసుకుంటున్న అనుభూతి హృదయానికి గొప్ప ఊరడింపు.



పండగలనే కాదు ఇతరేతర సందర్భాల్లోనూ కొత్తదనం కోసం ఉవ్విళ్ళూరుతుంది మనసు. కౌమారం విడిచి యవ్వనప్రాయంలోకి వెళ్ళే సమయాన తెలియని ఆకర్షణ ఏదో మనుషుల్ని కట్టిపడేస్తుంది. భావోద్వేగాలతో లోకమంతా కొత్తగా కనిపిస్తుంది. ఊగించి శాసించే ఉద్వేగాలు, యవ్వనోద్రేకాలు కొత్తకొత్తగా వుండి ఆనందాన్నీ, దు:ఖాన్నీ, ఎడబాటునీ ఇస్తాయి. 'బాధే సౌఖ్యమనే భావన రానీవోయ్' అన్నాడో కవి. ఎందుకంటే కొన్నిసార్లు బాధ అనివార్యం. ప్రేమ వైఫల్యాలు, ఎడబాట్లు, ఆకస్మిక బ్రేకప్‌లు మనిషిని నిలువనియ్యవు. అంతా శూన్యంగా అనిపిస్తుంది. ఆశిస్తారు, భంగపడతారు. భంగపాటు ఎల్లకాలం ఉండదనే ఎరుక ఉండదు. అందుకే మనసుకు దూరం కావడం, మనిషికి దూరం కావడం భరించలేని దు:ఖం కలిగిస్తుంది.

దు:ఖించే మనసు అలాగే ఉండిపోదు. కాలం ఎవరికోసమూ నిలిచిపోదు. మరల కొత్త మనుషులు తారసపడతారు. మనసైన మనిషి కోసం అనుకోకుండా ఎదురుచూస్తారు. మరల కొత్త సరికొత్తగా అనిపిస్తుంది. "ఒక అనుభవం తర్వాత మరో అనుభవమే జీవితం" అంటారు కవి పఠాభి. అయితే ఎప్పటికప్పుడు ఆ అనుభవం కొత్తగా ఉండాలన్నదే మనిషి తపన. అందుకే బాల్యం, కౌమారం, యవ్వనం, నడిప్రాయం, వార్ధక్యం అన్నవి ప్రతి మనిషికి నూతన దశలే. ఆయా దశల్లోని ప్రతి సంఘటనా, ప్రతి కలాపమూ కొత్తగా రూపొందించుకోవాలన్న ఆరాటమే అనేకానేక అనుభవాలకు మూలం.

పెళ్ళి, పిల్లలు, వాళ్ళను పెంచడం, వాళ్ళ బాల్యం, కౌమారం, యవ్వనం, యవ్వనావస్థల్లోని వెతలు అన్నీ ఎప్పటికప్పుడు నవీనదశలే. ఈ క్రమాన మనిషి వ్యక్తిగా, సమూహంలో ఒకనిగా పరస్పర ప్రభావితమైన పాత్రలు పోషిస్తారు. వ్యక్తిగా తన జీవిత ఔన్నత్యానికి సమాజం మూలమనే స్పృహ ఉన్నవారు చైతన్యవంతమైన పాత్రని నిర్వహిస్తారు. మనిషి మేలుని కోరని వ్యవస్థల తీరును భిన్నరూపాల్లో ప్రతిఘటిస్తారు. మనిషి మంచి కోసం ఏం చేస్తే బావుంటుందన్న ఆలోచనతో తమ వ్యక్తిగత, సమాజగత జీవితాన్ని మలచుకుంటారు. ఈ ప్రయాణంలో అవసరమైతే వ్యక్తిగా తన సౌఖ్యం కన్నా సమాజహితం మేలని తలపోస్తారు. అందుకు అనువైన ఆచరణని సంతరించుకుంటారు. ఇక్కడా కొత్తగా ఆలోచిస్తారు. భిన్నమైన క్రియాశీలతతో వ్యవహరిస్తారు. సరికొత్త నినాదాలు, పోరాటరూపాలు కాలానుగుణంగా కొత్త ఎజెండాలతో పదునెక్కుతాయి.

మార్పు అనివార్యం, అవసరమన్న లక్ష్యం తప్ప నిశ్చల నిశ్చితాలుండవు. సకలం మారుతుంటాయి. నవీన ఉత్తేజంతో భాసిల్లుతాయి. ఒకనాడు కరపత్రం ఊగించి శాసించే ఉద్యమతేజం. ఈ రోజున సోషల్‌మీడియాలో పెట్టే చిన్నపోస్టు సైతం జనావళిని కదిలించే ఉద్యమ నినాదం. సాంకేతిక ప్రజ్ఞ ఒకరి సొత్తు కాదు. ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా పాలకుల భజన చేసినా, సోషల్‌మీడియా సరికొత్త రూపాల్లో ఎదురుదాడి చేస్తుంది. వేల సంవత్సరాల మానవ ప్రయాణంలో ప్రతిభా సంపత్తులు ఒక్కచోట నిలిచిపోలేదు. ప్రజలపరం కావడం అనివార్యమయ్యాయి. మారుతున్న కాలాన మారే ప్రజల సరికొత్త ఆకాంక్షలకు అనువుగా మారడం తప్పనిస్థితి. జీవితంలో కొత్తదనం ఆశించే మానవస్వభావమే దీనికి చోదకశక్తి. కొత్తదనమంటే మార్పును కోరడం, మార్పు కోసం అసంకల్పితంగానే శ్రమించడం, మార్పు దిశగా ప్రయాణించడం. ఈ ప్రయాణంలో ఉగాదులు ఎన్నో వస్తుంటాయి. వాటిని సరికొత్తగా స్వాగతం పలకడం చరాచర ప్రకృతికి సత్కారం.

కార్పొరేట్ మీడియా విషపు రాతలు



ఎ.విజయకుమార్

నిప్పులు చిమ్ముకుంటూ నింగికి నేనెగిరితే
నిబిడాశ్చర్యంతో వీరు
నెత్తురు కక్కుకుంటూ నేలకు నే రాలితే
నిర్దాక్షిణ్యంగా వీరే....

అని విజయాలు, అపజయాలు పట్ల సమాజ వ్యవహార శైలిని మహాకవి శ్రీశ్రీ చెబుతారు. నేడు కమ్యూనిస్టుల పట్ల, వారి పాలన పట్ల, ఉద్యమాల ఎడల కార్పొరేట్ మీడియా తీరు కూడా అలానే ఉంది. కమ్యూనిస్టులు 25 ఏండ్లకు పైగా ఏకబిగిన పాలన చేస్తే కూడా ఆశ్చర్యంతో చూశారు తప్ప ఎందుకు అలా చేయగలిగారు అనే విషయాన్ని గ్రహించలేదు. అదే పాలనకు ప్రజలు తెరిపిస్తే మాత్రం "కూలిన లెఫ్ట్ కోట", దండయాత్ర, పాలనకు తెర"అని పతాక శీర్షికలు పత్రికల్లో దర్శనమిస్తాయి.

త్రిపురలో లెఫ్ట్ అధికారానికి దూరం కాగానే అప్పటిదాకా లేని మచ్చలు నాయకుల మీద, పాలన మీద మరకలు వెతకడం ప్రారంభించారు. ఒక తెలుగు పత్రిక మరింత ముందుకెళ్లి 'మాణిక్ సర్కార్'ను టార్గెట్ చేస్తూ వ్యంగ్యంగా కార్టూన్ ప్రకటించింది. ఆయన "సామాన్యుడు, పేదోడు, ఇల్లు లేదు, ఆస్తి లేదు, ఆయన లాగానే ప్రజలందరూ ఉండాలనుకున్నాడు" అని మాణిక్ సర్కార్‌ను, ఆయన పాలనను ఎద్దేవా చేస్తూ కార్టూన్ ప్రచురించారు. తప్పులు ఎత్తిచూపడం తప్పు కాదు కానీ ఆదర్శనీయత పట్ల కూడా విపరీతబుద్ధి చూపడమనేది గుడ్డి ద్వేషం.

"పెట్టుబడికి, కట్టుకథలకి పుట్టిన విష పుత్రిక పత్రిక" అని శ్రీశ్రీ అన్నట్టు నేటి మీడియా కార్పోరేట్లకు, అధికారానికి దాసోహమై విలువలకు వలువలు ఊడించడం సమాజానికి శ్రేయస్కరం కాదు. కౌటిల్యపు కండ్లద్దాలతో కాకుండా ప్రజల తరఫున వాస్తవాలు వెలువరించాలి. అట్లా లేకపోతే పత్రికల విశ్వసనీయతే దెబ్బతింటుంది. ఇది ప్రజాస్వామ్యానికే నష్టదాయకం.

ఆ కార్టూన్ రెండు విషయాలను ఎత్తిచూపింది. ఒకటి రాజకీయాల్లో విలువలకున్న స్థానం గురించి, రెండవది త్రిపుర అభివృద్ధి గురించి. మొదటిది నేడు రాజకీయాల్లో నాయకులు విలువలు పాటిస్తున్నారా అనేది ప్రశ్న. దానికి లేదు అనే సమాధానం దొరుకుతుంది. గల్లీ నుంచి ఢిల్లీ దాకా పదవులు రాగానే వార్డు స్థాయి నాయకులే మందీ మార్బలం, లగ్జరీ కార్లు మెయింటెన్ చేస్తూ హంగూ ఆర్భాటాలు లాంటివి నేటి సమాజంలో పరిపాటే. ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రులు పదవులు రాగానే పెద్దఎత్తున స్కాములల్లో ఇరుక్కుపోతున్నారు. అలాంటిది 25 ఏండ్లుగా ముఖ్యమంత్రిగా ఏకబిగిన పరిపాలించినా కూడా ఒక్క అవినీతి ఆరోపణ లేని, మచ్చలేని నాయకుడుగా మాణిక్ సర్కార్ ఘనతకెక్కారు. ఒక ముఖ్యమంత్రిగా ఉండి కూడా కించిత్తు గర్వం లేకుండా సాధారణంగా జీవిస్తున్న అసాధారణ వ్యక్తి అని దేశం మొత్తం కొనియాడుతున్నది. జీతం వస్తే పార్టీకే ఇచ్చి సాధారణ కార్యకర్తలాగా అలవెన్స్ తీసుకుని సామాన్యంగా గడపడం ఆయన గొప్పతనమే. ఇల్లు కూడా లేక పదవి పోగానే పార్టీ ఆఫీసు రెండు గదులలో ఇమిడే వ్యక్తిత్వం ఆయనది. అంతటి ఆదర్శమైన వ్యక్తిని కించపరచడం అంటే విలువలను కించపరచడమే అవుతుంది. దేశం మొత్తం బూతద్దం పట్టుకొని వెతికినా అవినీతి పంకిలం అంటుకోని రాజకీయ నాయకులు మచ్చుకు దొరకరు. రాజకీయాల్లో విలువలకు వలువలు లేని కాలంలో అవినీతికి ఆమడ దూరంలో ఉన్న నీతీ నిజాయితీగా పాలన అందించి సామాన్యంగా జీవించిన గొప్ప వ్యక్తిని అభినందించాల్సింది పోయి తూలనాడడం ఎంత వరకు సబబు? సమాజానికి ఆ పత్రిక ఏం సందేశమిస్తున్నట్టు?

త్రిపుర ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల్లో 30 మంది నేరగాళ్లు ఉన్నట్టు ఎలక్షన్ కమిషన్ ప్రకటించింది. వారిలో ఐపీఎఫ్‌టీ, బీజేపీ నాయకులే ఉన్నారు. ఒక్క కమ్యూనిస్టు అభ్యర్థి మీద కూడా నేరచరిత్ర ఛాయలు లేవు. ఇది చాలదా! ఒక్క వ్యక్తే కాదు మొత్తం కమ్యూనిస్టులు ఎలా ఉంటారో చెప్పడానికి, ప్రజలకు పాలన ఎలా అందించారో ఈ ఉదాహరణ చాలు. కోట్లు లేనిదే పోటీ చేయలేని ఈ ఎన్నికల పద్ధతిలో కూడా పేదవారికి సీట్లిచ్చి బరిలో నిలిపిన, నిలుపుతున్న చరిత్ర కమ్యూనిస్టులది. ఇలాంటి విషయాలు కార్పొరేట్ మీడియాకు కనిపించడం లేదు.

త్రిపుర ఎన్నికల ఫలితాలు ప్రకటించిన మరుసటి రోజు కార్పొరేట్ మీడియా "కూలిన లెఫ్ట్ కోట", "లెఫ్ట్ కోట బీటలు", "లెఫ్ట్‌పై కాషాయ దండయాత్ర" అని పతాక శీర్షికలు వెలువరించాయి. బీజేపీకి, బ్రహ్మరథం పట్టాయి. సంపాదకీయాలు రాశారు. నాగాలాండ్‌లో, మేఘాలయలో బీజేపీ అధికారం చేపట్టలేని స్థితిని మాత్రం ఎత్తి చూపలేదు. ఎవరు అధికారంలోకి వచ్చినా ఫర్వాలేదు. కానీ కమ్యూనిస్టులు మాత్రం ఉండకూడదనే అక్కసును చెప్పకనే వెళ్లగక్కారు.

గెలుపోటములు ఎన్నికల్లో సహజం. ఓడిపోయినంత మాత్రాన ప్రజలు తిరస్కరించినట్టు కాదు. బీజేపీ కూడా అధికారం చేపట్టాక పదేండ్లు ప్రతిపక్షంలో కూర్చున్న విషయం మరువరాదు. త్రిపురలో బీజేపీకి 43శాతం ఓట్లు వస్తే, సీపీఐ(ఎం)కు 42.7శాతం ఓట్లు వచ్చాయి. 0.3శాతం మాత్రమే తేడా. 4155 ఓట్లు మాత్రమే తక్కువగా వచ్చాయి. ఎన్నికల పద్ధతిలో లోపాల వల్ల సీట్ల తేడా మాత్రం ఎక్కువగా ఉంది. సీట్ల మెజారిటీ వచ్చింది కాబట్టి బ్రహ్మరథం పట్టినట్టవుతుందా? గత ఎలక్షన్‌లో 1.54 శాతంగా ఉన్న బీజేపీ ఒక్క సీటు కూడా గెలువలేదు. ఆ ఎన్నికల్లో 36.7 శాతం ఓట్లతో 10సీట్లు గెలిచిన కాంగ్రెస్ పార్టీ ఈసారి 1.9 శాతం ఓట్లతో ఒక్క సీటు కూడా గెలువలేదు. అంటే కాంగ్రెస్ పార్టీని టోకుగా బీజేపీ కొనేసింది. అంతేకాకుండా ప్రత్యేక త్రిపుర ల్యాండ్‌ను డిమాండ్ చేస్తున్న ఉగ్రవాద, వేర్పాటువాద సంస్థ ఐపీఎఫ్‌టీతో అపవిత్ర పొత్తు పెట్టుకొంది. ఇది ప్రమాదకర సంకేతం. ప్రజాస్వామ్యానికి హానికరం. ఈ ఎన్నికల్లో కమ్యూనిస్టులు ఓడారు అనేకంటే బీజేపీ నానా గడ్డి కరచి గెలిచింది అనడం సబబేమో. నిజానికి ఓడింది ప్రజలు.

నోట్ల రద్దుతో దేశమంతా డబ్బు కొరత ఉంటే బీజేపీకి వేలకోట్లు వచ్చి చేరాయి. ఆ డబ్బుతో దేశవ్యాప్తంగా వివిధ పార్టీల నాయకులను కొనడం, త్రిపురలో కాంగ్రెస్ నాయకులతో పాటు పార్టీనే గంపగుత్తగా కొనేసింది. టెర్రరిస్టు సంస్థతో అపవిత్ర పొత్తు పెట్టుకోవడం, మేఘాలయలో, అంతకుముందు గోవా, మణిపూర్‌లలో ప్రజలు తిరస్కరించినా దౌర్జన్యంగా అధికారం చేజిక్కించికోవడం లాంటి చర్యలకు బీజేపీ పాల్పడింది. ఇంతలా ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తున్నట్టు కనపడుతున్నా కార్పొరేట్ మీడియాలో ఒక భాగం ఏమీ ఎరగనట్టు ప్రజల దృష్టి మరల్చే విశ్లేషణలు చేస్తున్నది.

త్రిపురలో గానీ, కేరళలో గానీ దాడి చేస్తున్నది ఎవరు? పత్రికలు మనువాదం కండ్లతోనే చూస్తూ కాషాయం చేస్తున్న ప్రచారాన్నే ప్రకటిస్తున్నాయి. త్రిపురలో ఎన్నికలు కాగానే లెనిన్, మార్క్స్, వామపక్ష నాయకుల విగ్రహాలు కూల్చారు. కమ్యూనిస్టు పార్టీ నాయకుల, సానుభూతిపరుల ఇండ్లపై, ఆఫీసులపై దాడి చేసి దగ్ధం చేశారు. ఇందుకు సోషల్ మీడియాలో వీడియోలే సాక్ష్యంగా వచ్చాయి. ఒక్క బీజేపీ ఆఫీస్ గానీ, కార్యకర్త మీద గానీ దాడి జరుగలేదు. అయినా కొన్ని పత్రికలు పరస్పరం దాడులు జరిగాయని అసత్యాలనే ప్రచురించాయి. ఒకరికి అనుకూలంగా రాయకపోయినా వాస్తవాలను తెలుపాల్సిన బాధ్యత ఆ పత్రికలు మరిచాయి. కేరళలో కూడా దాడి చేస్తే ప్రతిగా ప్రజలు తిరగబడితే సీపీఐ(ఎం) చంపుతున్నదని దుష్ప్రచారం చేస్తున్నాయి. ఇదంతా ఆరెస్సెస్, బీజేపీ, కమ్యూనిస్టు వ్యతిరేక కార్పొరేట్స్‌ను సంతృప్తిపరచడానికే. వాళ్ళ మోచేతి నీళ్ళు తాగుతూ ఇతరులపై విషం వెళ్ళగక్కుతున్నాయి.



రెండవది త్రిపుర అభివృద్ధి విషయం. ఎన్నికల్లో ఆరెస్సెస్, బీజేపీల అరుపులను తమ కార్టూన్లలో, సంపాదకీయాలలో, ఛానళ్ళ ద్వారా గీపెట్టాయి. ఒక ఇంగ్లీష్ పత్రిక ఉద్యోగాలు లేక రిక్షాలు తొక్కుతున్నారని కార్టూన్ ప్రచురించడం చూస్తుంటే వాస్తవాలను మరుగునపరడమే అవుతుంది. అవినీతి లేని రాష్ట్రంగా 95శాతం అక్షరాస్యతతో, శిశుమరణాల రేటు 20శాతంలోపు తగ్గించడంలో, ఉపాధి హామీ పనులు 94 రోజులు కల్పించడం, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, న్యూట్రిషన్ అందించడంలో దేశంలోనే ఆదర్శప్రాయంగా ఉన్న రాష్ట్రం త్రిపుర. క్రైమ్ రేటు దేశ రేటు కంటే తక్కువ. అద్భుత ఆరోగ్య కేంద్రాల నిర్వహణ, వసతుల కల్పన, అశాంతిగా ఉన్న రాష్ట్రంలో శాంతి నెలకొల్పడంలో, చొరబాటుదారుల కుట్రలు అంతమొందించడంలో, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలను 62శాతం మందిని పైకి తీసుకురావడంలో కృషి ఘనం. నిరుద్యోగ రేటు అధికంగా ఉన్న గత కొన్నేండ్లుగా ఉపాధి కల్పనా రేటు పెరుగుదల, మహిళా శ్రామిక రేటు పెంచడంలో వామపక్ష ప్రభుత్వ కృషి అభినందనీయం. కేంద్రం సహకారం లేకుండా కక్షగట్టి నిధులు తగ్గిస్తున్న పరిస్థితులలో కూడా విద్య, వైద్యం, ఆరోగ్యం, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరు అమోఘం. అభివృద్ధి రేటు 10శాతం సాధించడంలాంటి విషయాలను గమనించడంలో కార్పొరేట్ మీడియా కండ్లకు గంతలు కట్టుకున్నట్టు వ్యవహరించింది.

గత కొన్నేండ్లుగా సోషల్‌మీడియా ప్రజల గొంతుకగా మారింది. ప్రజల సమస్యలను వెలికితీయడంలో హీరోయిక్ పాత్ర పోషిస్తోంది. మొన్న జరిగిన మహారాష్ట్ర రైతుల ఉద్యమాన్ని ప్రపంచం దృష్టికి తీసుకెళ్లింది. యాత్ర ప్రారంభమై నాలుగు రోజులైనా ఎవరూ పట్టించుకోలేదు. సోషల్‌మీడియా మాత్రం ప్రధాన పాత్ర పోషించింది. ఆలస్యంగా స్పందించిన టీవీ ఛానెళ్లు, పత్రికలు అసలు విషయాలను పక్కకు పెట్టినా, వారి డిమాండ్లను మొత్తం దేశవ్యాప్తంగా ప్రజలకు చేరువయ్యేలా సోషల్‌మీడియా అద్భుత పాత్ర పోషించింది. ఒకవైపు కమ్యూనిజం అంతరించిందనీ ఉద్యమాలకు కాలం చెల్లిందనీ ప్రధానమంత్రి మోడీ లాంటి వాళ్లు వాగిన రోజులు గడవకముందే ఉద్యమాల ఆవశ్యకతను, కమ్యూనిజం ఈ దేశానికి ఎంత అవసరమో మహారాష్ట్రలో రైతుల ఉద్యమం ద్వారా సోషల్‌మీడియాలో చర్చకు వేదికైంది. లెనిన్ విగ్రహాలు కూల్చి కమ్యూనిజం అంతమొందించాలనే వాళ్లకు చెంపపెట్టులాగా వేలవేలుగా లెనిన్ వారసులు పుట్టుకొస్తారని ఆ 'మహా' ఉద్యమం ప్రతిబింబించింది.

పాలకులు, ఆధిపత్య వర్గాలు, కాషాయ పరివారం ఎన్ని అవాస్తవాలు ప్రచారం చేసినా సోషల్‌మీడియా తిప్పికొట్టింది. దళితులపై దాడులు, ఉనా ఘటన, మధుకర్ హత్య, నరేష్, స్వాతి హత్యలు, కోరేగావ్ ఘటనలు ప్రజల దృష్టికి తెచ్చింది. నోట్ల రద్దు, జీఎస్‌టీ వల్ల నష్టాలు పెద్దఎత్తున ఎత్తిచూపింది. లెనిన్ విగ్రహం కూల్చివేతపై, మహారాష్ట్ర ఉద్యమంపై సోషల్‌మీడియా అణగారిన ప్రజల వైపు నిలబడింది. ప్రభుత్వాలు దిగివచ్చేలా హీరోయిక్ పాత్ర పోషించి ప్రజల ప్రత్యామ్నాయంగా నిలిచింది.

"పెట్టుబడికి, కట్టుకథలకి పుట్టిన విష పుత్రిక పత్రిక" అని శ్రీశ్రీ అన్నట్టు నేటి మీడియా కార్పోరేట్లకు, అధికారానికి దాసోహమై విలువలకు వలువలు ఊడించడం సమాజానికి శ్రేయస్కరం కాదు. కౌటిల్యపు కండ్లద్దాలతో కాకుండా ప్రజల తరఫున వాస్తవాలు వెలువరించాలి. అట్లా లేకపోతే పత్రికల విశ్వసనీయతే దెబ్బతింటుంది. ఇది ప్రజాస్వామ్యానికే నష్టదాయకం.

సెల్ : 9573715656

రిపోర్టర్స్ డైరీ

బోసిపోయిన గాంధీభవన్...

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం గాంధీభవన్ బోసిపోయింది. అయ్యో ఉన్నట్టు ఉండి ఏమైందని ఆశ్చర్యపోకండి... రోజూ ఏదో ఒక కార్యక్రమం, ప్రెస్ కాన్ఫరెన్స్‌లు, సమావేశాలు, ఏమీ లేకపోయినా ఎవరో ఒకరు గాంధీభవన్‌కు వచ్చిపోతుంటారు. శాసనసభ సభ్యత్వాన్ని కోల్పోయిన ఆ పార్టీ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్... ఇటీవల 48 గంటలపాటు ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో నిరాహారదీక్ష చేపట్టిన సంగతి తెలిసిందే. జిల్లాల నుంచి నాయకులు, వారి నియోజకవర్గాల నుంచి క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు అభిమానులు రావడంతో గాంధీభవన్ కోలాహలంగా మారింది. నినాదాలతో హోరెత్తింది. దిష్టిబొమ్మలు దగ్ధం, శవయాత్రలు చేయడం, మోకాళ్లపై నడిచి దీక్షలకు సంఘీభావం తెలిపారు. ఇదే అదనుగా పార్టీ నేతల ఉపన్యాసాలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. కేసీఆర్‌పై దుమ్మెత్తిపోశారు. దీక్ష ముగియగానే ఒక్కసారిగా గప్‌చుప్ అయిపోయింది. ఎందుకంటారా.... ఒకటి ఉగాది పండుగ, మరొకటి కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్లీనరీ జరగనుండడంతో పార్టీకి చెందిన ముఖ్యనేతలంతా హస్తినకు మకాం మార్చారు. దీంతో గాంధీభవన్‌లో అటెండర్లు తప్ప నాయక గణం కనిపించడం లేదు.

- గుడిగ రఘు

దిగని ఈటల బాణం

రాష్ట్ర బడ్జెట్ అంటే టక్కున గుర్తొచ్చేది ఆ శాఖ మంత్రి ఈటల రాజేందర్ సారే..! అయితే ఈసారి పెద్దగా ఆ సార్ పేరు వినిపించలేదు. ప్రతిఏడాదిలాగే ఈసారి కూడా మీడియాతో కాసేపు మాట్లాడినా బడ్జెట్‌లో ఆయన ప్రమేయం లేదనే గుసగుసలు వినిపిస్తున్నాయి. మొదటి రెండు బడ్జెట్లలో కొంత కనిపించినా తర్వాత క్రమేపీ తగ్గుతూ వస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ ఏడాది పూర్తిగా ప్రమేయం లేకుండానే బడ్జెట్ రూపకల్పన జరిగినట్టు సచివాలయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అందుకే ఈఏడాది ఈటల సాదాసీదాగా కనిపించారు. కొన్ని శాఖల బడ్జెట్ సమావేశాల్లో కొందరు అధికారులు, ముఖ్యమంత్రి తప్ప, ఈటలను పిలువలేదనే గుసగుసలు గుప్పుమంటున్నాయి. దీంతో ఆయన కొంత అలకబూనినట్టు వార్తలు వినిపిస్తున్నాయి. ఇదే విషయంపై ఇటీవల సచివాలయంలో విలేకరుల మధ్య చర్చ జరిగింది. 'భారీ బడ్జెట్ అయినా, విద్యా, యువజన, ఉపాధి కల్పన తదితర శాఖలకు నిధులు తగ్గినట్టు ఉన్నాయి..' అని ఓ విలేకరి అనగానే.. 'ఈసారి కూడా ఈటల బాణం దింపలేదు..' అని మరో విలేకరి చెప్పగానే అక్కడి వారంతా గొల్లుమన్నారు.

- నవీన్

కండ్లున్న కబోదులు...!

'ఇదేం వృత్తి ధర్మమన్నా... చూసింది చూసినట్టు కూడా రిపోర్టింగ్ చేయలేని దుస్థితి' ఓ సహచర జర్నలిస్ట్ మిత్రుడి ఆవేదన. ఈనెల 12న అసెంబ్లీ సమావేశాలు గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమైన విషయం తెలిసిందే. ఓవైపు గవర్నర్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తుండగానే...కాంగ్రెస్ సభ్యులు పోడియంలోకి వెళ్లే ప్రయత్నం...మార్షల్స్ అడ్డుకోవడం, కాగితాలు చింపి విసిరేయడం వంటి విషయాలన్నీ తెలిసినవే. ఈ దృశ్యాలన్నింటినీ అసెంబ్లీ మీడియా గ్యాలరీలో కూర్చున్న జర్నలిస్టులు అందరూ ప్రత్యక్షంగా చూస్తున్నారు. ఈలోపు కాంగ్రెస్ సభ్యులు ఒకరు ఏదో వస్తువు విసిరితే...అది వారికి అడ్డుగా ఉన్న మార్షల్స్‌కు అవతల పడింది. దాన్ని పెద్దగా ఎవరూ పట్టించుకోలేదు. గవర్నర్ కూడా ఎక్కడా ప్రసంగాన్ని ఆపలేదు. ఈలోపు ఆయన ప్రసంగపాఠం పూర్తవడం..గ్యాలరీలోని జర్నలిస్టులు బయటకు వచ్చేయడం జరిగిపోయాయి. కేవలం పది నిముషాల వ్యవధిలో శాసనమండలి చైర్మెన్ స్వామిగౌడ్ పైకి కాంగ్రెస్ సభ్యుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇయర్ ఫోన్స్ విసిరారని, ఆయన కంటికి తీవ్రగాయమైందని ప్రచారం మొదలైంది. అప్పటి వరకు గ్యాలరీలో ఉన్న జర్నలిస్టులు ఈ విషయం తెలిసి బిత్తరపోయారు. సభలో అలాంటి దృశ్యం ఏమన్నా జరిగిందా అని ప్రత్యక్షంగా చూసిన వారే ఒకర్ని ఒకరు వాకబు చేసుకోవడం కనిపించింది. ఆ సందర్భంలోనే పై మాటల్ని ఓ జర్నలిస్ట్ మిత్రుడు ఆవేదనగా చెప్పుకొచ్చారు.

- ఎస్ఎస్ఆర్ శాస్త్రి

వర్గీకరణ ఇప్పుడెందుకు గుర్తొచ్చిందో?

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అంశంపై ఇన్ని ఏండ్లు స్తబ్దుగా ఉన్న ముఖమంత్రి కేసీఆర్‌కు ఇప్పుడే ఎందుకు గుర్తొచ్చింది? మందకృష్ణతో వర్గీకరణ సాధ్యం కాదనీ తానే వర్గీకరణ కోసం పోరాడుతాననీ శాసనసభలో సీఎం ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. వచ్చే సాధారణ ఎన్నికల్లో ఎస్సీల ఓట్లు పొందడానికే సీఎం కేసీఆర్ వర్గీకరణ అంశాన్ని ఎత్తుకున్నట్టు అనిపిస్తున్నది. కేంద్రం ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలన్న ఆలోచనలో ఉన్నట్టు సీఎంకు తెలిసినట్టు ఉంది. అందుకే 24 ఏండ్లుగా వర్గీకరణ కోసం పోరాడుతున్న మందకృష్ణను జీరో చేసి చివర్లో తాను హీరో కావడానికే వర్గీకరణను ఎత్తుకున్నారా అన్న సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. జైల్లో పెట్టి ఆయన ప్రతిష్టను దిగజార్చాలన్న ఉద్దేశంతోనే సీఎం పదేపదే మందకృష్ణను అరెస్టు చేయిస్తున్నారా? ఎస్సీ వర్గీకరణపై సీఎంకు చిత్తశుద్ధి ఉంటే అఖిలపక్షాన్ని ఢిల్లీ ఎందుకు తీసుకెళ్లలేదో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

- టంగుటూరి సంజయ్‌కుమార్

పంచాంగం



తెలిదేవర భానుమూర్తి

నారదుడు కొప్పేసుకుండు.తంబూరు దీస్కుండు. ఒకపారి టింగ్‌టింగ్ మన్నడు. చిర్తలు దీస్కుండు.ఒకపారి గవ్వీటిని కొట్టిసూస్కుండు. గీ పారి యాడికి బోవాలె.యాడికిబోతె బాగుంటది అని జెరసేపు సోంచాయించిండు. యాడికో ఎందుకు ఎప్పటితీర్గనే యాద్గిరి గుట్టకు బోతె బాగుంటదని అనుకున్నడు. అనుకోని నారాయన, నారాయన అన్కుంట చిర్తలు గొట్టుకుంట మొగులు మీదికెల్లి ఎల్లిండు. గాయిన యాద్గిరి గుట్ట దిక్కు రాబట్టిండు.

నడ్మల నర్కం దిక్కుబోతున్న దున్నపోతు గల్సింది.

"యాడికి బోతున్నవు నారదా" అని దున్నపోతు అడిగింది.

"యాద్గిరి గుట్టకు బోతున్న" అని నారదుడు అన్నడు.

"గుట్టకు ఎందుకుబోతున్నవు?" అని దున్నపోతు అడిగింది.

"నర్సిమ్మసామితోని ముచ్చట బెట్టెతందుకు" అని నారదుడు అన్నడు.

"గాయినతోని ముచ్చటబెట్టె ఏమొస్తది?" అని దున్నపోతు అడిగింది.

"తెలంగానలనే గాకుంట దేసమంత ఏమైతున్నదో ఎర్కైతది" అని నారదుడు అన్నడు.

"గాయింత దాన్కి గాయిన కాడ్కి బోవుడు ఎందుకు?" అని దున్నపోతు ఇంకేమొ జెప్పబోతుంటె

"ఏంది గట్లుంటున్నవు?" అని నారదుడు అన్నడు.

"తెలంగానలనే గాకుంట గీ దేసంల ఏమైతున్నదో నేను జెప్తగద"అని దున్నపోతు అన్నది.

"నువ్వెట్ల జెప్తవు?నీకేమెర్క" అని నారదుడు అన్నడు.

"రొండు మూడు నెలల సంది నేను గీ దేసంలనే ఉన్న" అని దున్నపోతు అన్నది

"ఎందుకున్నవు?" అని నారదుడు అడిగిండు.

"మా దున్నపోతుల మీటింగ్లు అయితుంటె స్పీచ్‌గొట్టెతందుకు నన్ను బిల్సింన్రు.దినాం పత్రికలు సద్విన. మా దున్నపోతుల తోని మాట్లాడిన.ఇగ దాంతోని సంగతులన్ని నాకెర్కైనయి. గియ్యాల ఉగాది.పొద్దుమీకి వొస్తుంటె ఒకతాన పంచాంగం సదువుతుంటె ఇన్న" అని దున్నపోతు అన్నది.

"పంచాంగంల ఏం జెప్పింన్రు" అని నారదుడు అడిగిండు.

"మేష రాసోల్లకు ఏప్రిల్‌ల గురుడు సల్లగ సూస్తడు. ఇంట్ల చిత్తుకాగితాలను అమ్ముతరు. ఆల్ల బత్కు మల్పుదిర్గుతది. గాల్లు పత్తాలాట బంద్ జేసి రేసులాడుడు షురువుజేస్తరు. కొత్తకొత్త సామాన్లు గొంటరు.పాత అంగీలు, ఫైంట్లు ఇచ్చి స్టీలు సామాన్లు గొంటరు.కొత్త కేలండర్లు యాలాడదీసెతందుకు మొలలు గొంటరు. మేనెలల బుదుడు,శని కోపంతోని జూస్తరు. దెబ్బతాకిన కాడనే మల్ల దెబ్బ తాక్తది. కర్సిన కుక్కనే మల్ల గరుస్తది.ఎండకాలంల కారిన శెమ్టకు ఇంటి గోడ గూల్తది. గోడను గట్టి పిచ్చెతందుకు అందరితాన బదల్ అడుగుతరు.



బదల్ చుక్తజెయ్యశాత గాక తొవ్వపంటి బోతుంటె బాకీలోల్లకు కండ్లబడకుంట బుర్క ఏస్కోని దిర్గుతరు. ఇగ మిథున రాసోల్లను ఏప్రిల్‌ల శుక్రుడు సల్లగ జూస్తడు.ఆల్లు యాపారం జేస్తరు.ఒక డ్రామల లత్కోర్ ఏసం గడ్తరు. ఒంటింట్ల జిల్ల పురుగులు బడ్తరు.శని సల్లగ సూసెబట్కె మీకు స్తిరాస్తి ఒస్తది. పక్కింటాయి న తాబాద్ల అయితె పోకుంట ఒక రుబ్బురోలు ఇచ్చిపోతడు.జూన్ నెలల రాహువు సల్లగ సూడడు.కొత్త సీర గొనియ్యలేదని పెండ్లాం కొట్లాడ్తది.దినాం కూరల కారం ఏసి సంపుతది. పార్టీలు బద్లాయించె లీడర్లకు మంచిగుంటది. పోరగాల్లకు బస్సుల మీద రాల్లు ఏసె పనిబడ్తది.

తుల రాసోల్లకు ఏప్రిల్ నెలల శాన దినాల సంది కల్వని కవి దోస్తు గలుస్తడు. వొద్దువొద్దు అని మొత్తుకున్నా గాయిన రాసిన పద్దెంలు ఇనిపిస్తడు. మీ మెదడు తింటడు. మెదడు లేకుంటనే మీరు ఇంటికి బోతరు. గయ్యాల్ని సంది ఎవలెంత బోరుగొట్టినా మీకు ఏంగాదు. మేనెలల సంచులల్ల ఇంటికి జీతం గొంచబోతరు. చిల్లర పైసలల్లనే మీ జీతం ఇస్తరు. పోరి పెండ్లి గాలేదని మీకు ఫికర్ దల్గుతది. మీకు సుస్తయితది. మందు గావాలని మీరు మందుల దుక్నం బోతె పెరిగిన మీ గడ్డం జూసి పక్క దుక్నంకెల్లి మందు దెచ్చిఇస్తరు. గా మందు దాగి మీరు ఊక్కుంట ఇంటికి బోతరు. కన్య రాసోల్లకు ఏప్రిల్ నెలల మంచిగుంటది. పరీచ్చ పేపర్లు ఔటయ్యేబట్కె ఆడుకుంట పాడుకుంట పోరగాల్లు పరీచ్చలు రాస్తరు. వైసుపోరలు పెండ్లి సూపులకు బోయి మస్తు పలారాలు దిని కడ్పునొప్పి దెచ్చుకుంటరు.సిన్మ కతలు రాసెటోల్లంత గూడి కతల కార్కాన కులాయిస్తరు. అద్దగంట కొక కత రాస్తరు. జూన్‌ల గీ రాసోల్లకు తిర్గుడు పని ఉంటది.శని సల్లగ సూడడు. రేల్ గాడిల సీటు దొర్కదు. నిలబడే నిద్రబోతరు.దిగే టేషన్ బోయినంక మేల్కొస్తది. మే నెలల ఆడోల్లు నల్లకాడ కొట్లాడ్తరు. నల్లకాడ బెట్టిన బిందెను పక్కింటోల్లు ఎత్తేస్తరు.బిందెకు లొత్త బడ్తది. డిసెంబర్ల సలికి వొన్కుంట పాటలు బాడెటోల్లు బాగ పాటలు బాడ్తరు.

ఇగ కర్కాటక రాసోల్లను ఏప్రిల్ నెలల గురుడు సల్లగ జూస్తడు.సమజ్ గాని నవలలు సదువుతరు.సదివి సదివి మీరు గూడ ఒక సమజ్‌గాని నవల రాస్తరు. మే నెల కుజుడు సరింగ సూడబోయె బట్కె సిగిలేటు ముట్టిచ్చుకుంటుంటె మీ మూతి గాల్తది.మీటా పాన్ గట్టియ్యమంటె పాన్‌డబ్బోడు పక్కనోని తోని మాట్లాడుకుంట జర్దపాన్ గట్టిస్తడు.మీ కండ్లు తిర్గుతయి.సల్ల శెమ్టలు బడ్తయి. అడ్డం బడ్తరు.కవితలు అర్తం గాక .జెనం పల్లపల్ల ఏడుస్తరు.ఇగ దాంతోని నీటిమట్టం బెర్గుతది.నీటిమట్టం బెర్గెబట్కె కరెంటు కోత ఉండదు.జూలైల శుక్రుడు సరింగ జూసెబట్కె యాపారం మంచిగ నడుస్తది.. పంపుచర్లు జుడాయించెటోల్ల యాపారం మూడు పూలు ఆరుకాయలైతది.బియ్యం దర బెర్గెబట్కె అందరు ఆకులు తినుడు షురువు జేస్తరు దాంతోని పాన్‌డబ్బల యాపారం బాగ నడుస్తది. ఆగస్టుల శని సల్లగ జూసెబట్కె సదువుకునెపోరగాల్లకు చాకిలేట్లు దొర్కుతయి. సింహరాసోల్లకు ఏప్రిల్ నెలల శని మంచిగ సూడడు. గని చెంద్రుడు సరింగ జూస్తడు. చెంద్రుడు సరింగ జూసెబట్కె తల్లిగారింట్ల కెల్లి మీ పెండ్లం పాత మంచం బట్కొస్తది.నేను గీయింత దాంకనే పంచాంగం ఇన్న మల్ల గలుస్త" అన్కుంట దున్నపోతు నర్కం దిక్కు బోయింది. నారాయన,నారాయన అన్కుంట నారదుడు వైకుంటం దిక్కు బోయిండు.

సెల్ : 9959150491

నవతెలంగాణ
3వ వార్షికోత్సవం

కొత్త ఉత్తేజాన్నిచ్చే ఉగాది





తీపి, చేదు కలిసిందే జీవితం.. కష్టం, సుఖం కలిసిందే జీవితం...ఆ జీవితంలో ఆనందోత్సాహాలు పూయించేందుకు వస్తుంది ఉగాది పర్వదినం.. ఆత్మీయ అనుబంధాన్ని గుర్తు చేస్తున్న పండుగ ఇది. గుండెల్లో ఆనంద క్షణాలు నింపే తరుణం... జీవితంలో చవి చూడాలి మాధుర్యం అంటూ షడ్రుచుల ఉగాది పచ్చడి సేవనం తెలియచేస్తుంది. ఈ పండుగ మధురానుభూతుల సమ్మేళనం.. స్థిత ప్రజ్ఞత అలవరచుకోవడం వివేకి లక్షణం అదే ఉగాది ఇచ్చే సందేశం.. ఇలాంటి పర్వదినాన కొందరు సినీ, టీవీ తారలు మానవితో పంచుకుంటున్న తీపి జ్ఞాపకాలు...

ఉగాది శుభాకాంక్షలు

పచ్చడి చేయడానికి పోటీ పడతారు



ఉగాది మా ఇంట్లో బాగా సెలబ్రెట్ చేసుకుంటాం. అన్ని పండుగల కంటే ఉగాది కాస్త ప్రత్యేకం. ఎందుకంటే ఇంట్లో రెండు తెలుగు రాష్ట్రాల వారు ఉన్నారు. అమ్మ ఆంధ్ర, నాన్న తెలంగాణ. ప్రతి పండక్కీ రెండు రాష్ట్రాల పిండి వంటలు ఇంట్లో వండుతారు. అమ్మ తెలంగాణ వంటలు నేర్చుకుని మరీ మాకోసం చేసి పెడుతుంది. ఇక ఉగాది అంటే ముందు గుర్తు కొచ్చేది ఉగాది పచ్చడి. ఇది మాత్రం మా ఇంట్లో ఓ కాంపిటీషన్‌లా జరుగుతుంది. తెలంగాణలో ఉగాది పచ్చడి పల్చగ, పానకంలా చేస్తారు. ఆంధ్రవైపు గుజ్జులా ఉంటుంది. నాన్న ఒక కుండలో, అమ్మ ఓ కుండలో స్వయంగా ఉగాది పచ్చడి చేస్తారు. నాన్న తెలంగాణ స్టైల్లో, అమ్మ ఆంధ్ర స్టైల్లో చేసి ఇంటికి వచ్చిన వారందరికి పెట్టి 'ఏ పచ్చడి బాగుంది?' అని అడుగుతుంటారు. మేం చాలా ఏంజాయ్ చేస్తాం. పచ్చడంటే చాలా ఇష్టం. ఇలా ఉగాదికి మాకు రెండు రకాల టేస్టులు దొరుకుతాయి. అన్నింటికంటే ముఖ్యంగా న్యూయర్ లాంటి ఇంగ్లీష్ పండుగ కాకుండా మనకంటూ ఓ కొత్త సంవత్సరం ఉన్నందుకు మనసుకు హాయిగా అనిపిస్తుంది.

- చేతన ఉత్తేజ్

ఉగాది అంటే స్పెషల్



ఉగాది పండగొస్తే వారం రోజుల ముందే ప్రిపరేషన్ మొదలవుతుంది. మాది సిరిసిల్ల. ఈ పండుగకు మా దగ్గర భక్ష్యాలు బాగా చేస్తారు. ఉగాదిపచ్చడంటే చాలా ఇష్టం. పండుగ లేకపోయినా మామూలు టైంలో కూడా ఒక్కోసారి చేయించుకుని తింటాను. అమ్మ పచ్చడి బాగా చేస్తుంది. చిన్నప్పుడు పండుగంటే ఉదయాన్నే నిద్రలేచి తలస్నానం చేయడం, కొత్త బట్టలు వేసుకోవడం. . కొత్త బట్టలు, ఉగాది పచ్చడి, పిండి వంటలు తినడం చాలా సరదాగా ఉండేది. మిగిలిన రోజుల్లో ఎవరం ఎక్కడ ఉన్నా పండుగ రోజు మాత్రం ఫ్యామిలీ మొత్తం కలుసుకుంటాం.

- శిరీష

పండుగలన్నీ సెట్‌లోనే



ఉగాదికే కాదు ఏ పండుగకూ మాకు సెలవులంటూ ఉండవు. పండుగలన్నీ సెట్‌లోనే చేసుకుంటాం. అన్ని పండుగల్లా ఉగాది కూడా ఇక్కడే సెలబ్రెట్ చేసుకుంటాం. ఉగాది పచ్చడి సెట్‌లోనే చేసుకుంటాం. సెలవు తీసుకుని ఇంట్లో పిల్లలతో గడిపే సమయం మాకు ఉండదు. అందుకే పిల్లలని కూడా ఇక్కడికే తీసుకొచ్చుకొని సెలబ్రెట్ చేసుకుంటాం. నటనే సర్వస్వంగా బతుకుతున్నాం కాబట్టి పండుగకు సెలవులు పెట్టాలి, బయటకు వెళ్ళి ఎంజాయ్ చేయాలనే రూల్స్ పెట్టుకోం. పని చేసే దగ్గరే మా పండుగ. పిల్లలను ఇక్కడకు తీసుకురావడం వల్ల కూడా తల్లిగా ఎంత కష్టపడుతున్నామో, మా టీం ఏంటో తెలుసుకుంటారు. అలాగే అందరితో కలిసిపోయి వాళ్ళు కూడా ఎంజాయ్ చేస్తారు. రిలేషన్స్ గురించి తెలుసుకుంటారు. మరో విషయం ఏమిటంటే అందరూ ఒక్క రోజే చేసుకుంటారు. కానీ ఓ ఆర్టిస్టుగా మేం మాత్రం ఒక్కో చానల్ ద్వారా కనీసం వారం రోజులైనా ఉగాది చేసుకుంటాం.

- జ్యోతి రెడ్డి

వివిధ రాష్ట్రాల వెరైటీలన్నీ కలిపి..



ఉగాది పండగ మన తెలుగువారందరికీ కొత్త సంవత్సరం. ప్రకృతిలో చెట్లన్నీ చిగురించే కాలం. అలాగే మనలోనూ కొత్త ఆశలు చిగురించాలి. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, ఉత్తరాది రాష్ట్రాలలోనూ కొత్త సంవత్సరాలు వేరువేరుగా ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో ఉన్నప్పుడు వారితో కలసి కొత్త సంవత్సరం ఆనందంగా చేసుకునేవాళ్లం. అందుకే నేను చేసే ఉగాది పచ్చడిలో అన్ని రాష్ట్రాల వెరైటీలు కలుస్తాయి. మన తెలంగాణలో గసగసాలు, పుట్నాలు వేస్తారు. కర్ణాటకలో వేరుశెనగపప్పు, తమిళనాడులో కొబ్బరి వేస్తారు. ఆంధ్రలో అరటి పండు, ఉత్తరాదిలో డ్రైఫ్రూట్స్ వేస్తారు. కామన్‌గా అందరూ వేపపూత వేస్తారు. అన్ని ప్రాంతాల వెరైటీలను కలిపి చేసే ఈ పచ్చడి షడ్రుచుల పచ్చడి అనే కంటే షడ్ రాష్ట్రాల పచ్చడి అంటూ ఇంట్లో వారు ఆటపటిస్తారు. తెలుగు రాష్ట్రాల మాదిరిగానే తమిళనాడులోనూ ఉగాది సందర్భంగా కళాకారులను అవార్డులతో సత్కరిస్తారు. అలా ఒక ఏడాది నాకు అవార్డు వచ్చింది. బోలెడు కొత్త ఆశలతో, ఆశయాలతో నూతనసంవత్సరాది ప్రారంభించాలి అనుకునేవారందరికీ విళంబి నామసంవత్సరం సంతోషాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నాను.

- రూపాదేవి

అవార్డుల పండుగగా ఉండేది..



ఉగాది పచ్చడి అంటే చిన్నప్పుడు భలే క్రేజీగా ఉండేది. ఉగాది మనకు కొత్త సంవత్సరాది. అనేక రాష్ట్రాల్లో వేరువేరుగా కొత్త సంవత్సరాది ఉంటుంది. ఉగాది పచ్చడి మన సంప్రదాయం. ఇంట్లో ఉన్నా..షూటింగ్‌లో ఉన్నా ఉగాది పచ్చడి తప్పని సరిగా తింటాను. పచ్చడి రుచిని బట్టే ఆ ఏడాది జీవితం ఉంటుంది అంటారు. ఈ సెంటిమెంట్‌తో చాలామంది పచ్చడిలో స్వీట్ ఎక్కువ, చేదు తక్కువ వేస్తారనుకుంటాను. ప్రతి ఏడాది పచ్చడి తియ్యగానే ఉన్నా.. జీవితంలో ఒడిదుడుకులు మాత్రం తప్పవు. పంటలు చేతికి వచ్చే సంక్రాంతి తర్వాత వచ్చే ఉగాది సందర్భంగా ఏర్పాటుచేసే కల్చరల్ ఈవెంట్స్ చాలా ఆసక్తిగా ఉండేవి. డిఫరెంట్ టైప్ ఆఫ్ లైఫ్ నుంచి వచ్చేవారందరినీ ఒక వేదికపైకి తీసుకువచ్చేలా ఉండేవి. అంతేకాదు గతంలో ఉగాది పురస్కారాలు, నంది అవార్డులు ఇచ్చేవారు. ఒకవిధంగా చెప్పాలంటే అవార్డుల పండుగగా ఉండేది.

- జయసుధ, నటీ

నిత్య శోభితం!!

హే విళంబిని సాగనంపి..
యేతెంచినది విళంబి..
నవయుగానికి నాంది పలికి
కొత్త ఊహలకు ఊపిరి నిలిపి
జలకళతో చెరువులు నిండి
బీడు భూముల కడుపు పండి
పంటలు సిగిడి రంగుల నిండి
పచ్చదనపు చిగుళ్ళు ఆహ్వానం పలుకంగ
మోడుబారిన శిశిరాన్ని సాగనంపి
ప్రకృతి మది పులకించంగ
సబ్బండ వర్ణాలు సంతసించంగ
కొత్త ఆశల తియ్యని మకరందాలతో
ఆసాంతం తోడుండాలి ఈ నవ వసంతం
విళంబి నామం కావాలి నిత్య శోభితం!!

- పాల్వంచ హరికిషన్,
రామన్నపేట,యాదాద్రి జిల్లా
సెల్: 9502451780

కొత్త దారి

వెలుగులో పయనిస్తున్నామని
సంబరపడినంతసేపు పట్టలేదు
చీకటి దారి వైపు అడుగులు
చక చకా .. గబగబా .. వేగంగా
వెనక్కి తిరిగి చూసుకుంటే
ఏమీ మిగలలేదు
పచ్చని చెట్లు, పెంకుటిల్లు, పండుగలు
భారతీయత, సంస్కృతీ, సంప్రదాయం
అన్నీ మబ్బుల మాటున మటుమాయం
మనసున పట్టిన ఆ తెరలు తొలగాలి
పాతనే మళ్ళీ కొత్తదారిగా మలచుకోవాలి
అది ఈ ఉగాది ఉషస్సే ఎందుకు కాకూడదు ?

- యలమర్తి అనూరాధ
హైదరాబాద్
ఫోన్:9247260206

ఆశల హరివిల్లు - విళంబి స్వాగతం

అంకురించే కొత్త ఆశ(యా)ల వూసులతో..
ఋతుశోభలో.. పరువాల వసంతంతో...
తెలుగు లోగిళ్ళ ముంగిట విళంబికాలకన్య విచ్చేస్తోంది..
ఒకవైపు క్రొంగొత్త ఉష:కిరణాలు
గుండె గుమ్మాన్ని తాకు తున్నెయ్!!
కాలం జ్ఞాపకాల పొరలు.. కండ్ల కొలుకుల్లో
బాధల గాధలు జీరాడుతున్నాయ్!!
సెలయేటి నీటి స్వచ్ఛతలా! మా'నవ' జీవితాల్లో
సుఖ-శాంతులతో సాగాలి!!
కోయిలమ్మ పాటలా.. జానపదుల ఆటలా!
పల్లెలన్నీ నిత్య పండుగలా శోభించాలి!!
క్షామం తెలియని సంక్షేమం అవిభాజ్యంగావాలి!
గ్రీష్మంవిడిన వసంతంలా మా బతుకులు భాసించాలి!
నిండు గర్భిణిలా.. పల్లె సీమలు పచ్చటి పైర్లతో..
చల్లని.. తల్లిలా.. పల్లెఒడి.. హాయిగా ఉండాలి!!
ఆమని అందాలు ఆర బోస్తూ... వచ్చే ఉగాదీ...
అనుభవ సారంతో ఈ ఆశ(మా)లకి శుభాది!
మా కలలు సాకారంకావాలీ విళంభీ వందనం! అభివందనం

- తంగిరాల చక్రవర్తి
ఫోన్: 9393804472

కరిగిన మైనంతో...






తాను కరిగిపోతూ కొత్త ప్రపంచాన్ని పరిచయం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది క్యాండిల్. చివరి క్షణం వరకు వెలుతురును అందించి శున్యంలోకి జారిపోతుంది. అలా శున్యంలో మిగిలిన మైనంతో ఎన్నో వస్తువులను, అద్భుతమైన బొమ్మలను, సహజ సిద్ధమైన గిఫ్ట్‌లను స్వయంగా తయారు చేసుకోవచ్చు. దీని కోసం కాస్త శ్రద్ధ, సృజనాత్మకత ఉంటే సరిపోతుంది. కరిగిన మైనంతో ఎన్నో అబ్బురపరిచే వస్తువులను తయారు చేసుకోవచ్చు. వాటిలో కొన్ని తెలుపు రంగులో ఉండే పొడవైన గౌనును, లేత గులాబీ రంగులో చెక్కిన ప్రేమ పక్షులను, హ్యాండిల్ గ్లాసులో వాటర్ మిలన్ జ్యూసును, మైనపు గ్లాసులను, నీలి రంగు దీపాలను, పండ్లతో డిజైన్ చేసిన ప్రమిదలను తయారు చేసి స్నేహితులకు బహుమతిగా ఇస్తే చాలా సంతోషిస్తారు. ఈ వేసవి సెలవుల్లో ఓ సారి ప్రయత్నించండి...







కొన్ని రకాల మసాలా దినుసులు చెక్క, లవంగాలు, యాలకలు వంటివి ఎక్కువ రోజులు నిల్వ చేయడం వల్ల వాటిలోని ఆరోమా వాసన తగ్గిపోతుంది. అలాగే రుచికూడా తగ్గుతుంది. కాబట్టి మసాలా దినుసులను ఆరు నెలలకంటే ఎక్కువ రోజులు స్టోర్ చేయకూడదు.



రోజూ శుభ్రపరిస్తే !



ఇంటికి ప్లాస్టిక్ కిటికీలు పెడితే ప్రయోజనం ఉంటుందని చెబుతున్నారు నిపుణులు. రీసైకిల్ చేసిన ప్లాస్టిక్ ఈ రకమైన వస్తువులకు ప్రత్యేకతనిస్తుంది. గ్లాస్ కిటికీల కంటే కూడా ప్లాస్టిక్ కిటికీలు బాగుంటున్నాయని సర్వేలో తేలింది. ప్లాస్టిక్ కిటికీల వలన ప్రయోజనాలెంటో చూద్దామా...

కిటికీల మీద గీతలు పడకుండా వుంటాయి. అధికమైన లైటింగ్ ఇంటిలోపలికి ప్రసరిస్తుంది. గ్లాస్ విండోలకంటే కూడా బలంగా వుంటాయి. అయితే వీటిని తరచుగా శుభ్రం చేయాల్సి వుంటుంది. శుభ్రం చేయడానికి కొన్ని చిట్కాలను పాటిస్తే సరిపోతుంది.

ఒక బకెట్ సబ్బు నీటిలో మెత్తటి క్లాత్‌ను లేదా స్పాంజి ని తీసుకొని నీటిలో ముంచి మెల్లగా కిటికీలను తుడవాలి. మరో సారి మంచి నీటిలో ముంచి తుడిస్తే మంచిది. ఇలా చేయడం వల్ల సబ్బు మరకలు కనపడవు. ఇంకా నీటి మరకలు కనిపించకుండా ఉండాలంటే మెత్తటి పొడి గుడ్డ తో మెల్లగా తుడిస్తే దుమ్ము, ధూళి పూర్తిగా తొలగిపోతుంది. ఈ చిట్కాలను ప్రతిరోజు పాటిస్తే కిటికీలు తళ తళ మెరుస్తాయి.

❄

గిరిజన యువతిపై సామూహిక లైంగికదాడి

- 11న అమరారం జాతరలో కిడ్నాప్
- రెండు రోజుల పాటు 11 మంది అఘాయిత్యం
- ఆలస్యంగా వెలుగులోకి...

నవతెలంగాణ-పినపాక

గిరిజన యువతిని కిడ్నాప్ చేసి రెండ్రోజుల పాటు 11 మంది సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగుడెం జిల్లా పినపాక మండలం జానంపేట పంచాయతీ పరిధిలోని అమరారంలో జరిగింది. శనివారం బాధితురాలి తల్లి ఫిర్యాదుతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితురాలి వివరాల ప్రకారం..జానంపేట పంచాయతీ పాండు రంగాపురం గ్రామానికి చెందిన యువతి ఈ నెల 11న అమరారంలో నిర్వహించిన తల్లుల జాతరకు వెళ్లింది. అమరారం గ్రామానికి చెందిన పొలెబోయిన భరత్, ఏసుబాబుతో పాటు మరో 9 మంది యువకులు యువతిని ఆటోలో బలవంతంగా లాక్కొని తీసుకెళ్లారు. అమరారం అడవుల్లో సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. ఆ తర్వాత మరునాడు భూపాలపల్లి జిల్లా అభినపల్లి మల్లారం అడవుల్లో మరోమారు అఘాయిత్యానికి పాల్పడ్డారు. అనంతరం వదిలి వెళ్లారు. ఈ నెల 14వ తేదీ వరకూ తన బిడ్డ ఇంటికి రాకపోవడంతో ఏడూళ్లబయ్యారం పోలీస్ స్టేషన్‌లో బాధితురాలి తల్లి ఫిర్యాదు చేసింది. అయితే, యువతి శనివారం ఇంటికి చేరుకొని తనపై జరిగిన అఘాయిత్యం గురించి తల్లికి తెలిపింది. ఇదే విషయమై ఏడూళ్ల బయ్యారం ఏఎస్ఐ లక్ష్మినారాయణను వివరణ కోరగా ఈ నెల14న సదరు యువతి కనబడుట లేదని ఫిర్యాదు అందిందని, కేసు విచారణలో ఉందని తెలిపారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఆయన తెలిపారు.

తెలుగు కళలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు

శాసన సభా స్పీకర్ మధుసూదనాచారి

- ఎన్టీఆర్ కళామందిరంలో ఉగాది ఉత్సవాలు
- డాక్టర్ కె.నాగేశ్వర్‌కు, జస్టిస్ ఆవుల సాంబశివరావు పురస్కారం



నవతెలంగాణ - కల్చరల్ రిపోర్టర్

తెలుగు కళలకు ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందని శాసన సభ స్పీకర్ మధుసూదనాచారి అన్నారు. తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ కళామందిరంలో శనివారం ఢిల్లీ తెలుగు అకాడమీ ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలు, ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వారు రెండు రాష్ట్రాల్లోనూ భాషాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ ఢిల్లీలో తెలుగు సంస్థను 30 ఏండ్లు నిర్వహించి తెలంగాణలో డీటీపీ ఏర్పాటు చేసిన నాగరాజు అభినందనీయుడని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ కాకర్ల సుబ్బారావుకు జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేశారు. ఉగాది ప్రతిభా పురస్కారాలను పిఎస్.ప్రకాశ్, సుశీల్ అగర్వాల్, సమతాగోపాల్, తుల్జాసింగ్, గీత, డాక్టర్ రాజేందర్‌లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు బండారు దత్తాత్రేయ, తమిళనాడు పూర్వ గవర్నర్ డాక్టర్ కె.రోశయ్య, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.శివశంకర్‌రావు, తెలంగాణ ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి ఎస్.వేణుగోపాలచారి పాల్గొన్నారు.

డాక్టర్ కె. నాగేశ్వర్‌కు జస్టిస్ ఆవుల సాంబశివరావు పురస్కారం

తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో మాజీ ఎమ్మెల్సీ, డాక్టర్ కె. నాగేశ్వర్‌కు జస్టిస్ ఆవుల సాంబశివ రావు పురస్కారాన్ని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నూతి రామ్మోహన్‌రావు శనివారం అందజేశారు. రూ. 25వేల నగదు, జ్ఞాపిక, శాలువాతో నాగేశ్వర్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రావు మాట్లాడుతూ...ప్రస్తుతం న్యాయ వ్యవస్థలో నిష్పక్షపాతం లోపించి అనేక ప్రలోభావాలకు లోనై దారితప్పుంతోదని అనుమానం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో కీలక భూమిక వహించే పత్రికా రంగం పారిశ్రామిక రంగంగా మారిందని వాపోయారు. పురస్కార గ్రహీత డాక్టర్ నాగేశ్వర్ మాట్లాడుతూ..సమాజంలో ప్రజలపై ప్రభావం చూపగలిగే స్థాయిలో ఉండి జరుగుతున్న పరిణామాలపైనా, అధికార వ్యవస్థలపైనా నిరంతరం ప్రశ్నల సంధించేవాడు సమాజ సేవకుడుగా నిలిస్తాడన్నారు. మీడియా, మేధావులు ఎక్కడ అధికార వ్యవస్థలో పాలుపంచుకుంటారో ఆ సమాజం నాశనమవుతుందని తాను ప్రగాఢంగా నమ్ముతానని అన్నారు. తెలుగు వర్సిటీ పూర్వ ఉపాధ్యక్షులు డాక్టర్ ఆవుల మంజులత మాట్లాడుతూ..ప్రజాస్వామ్య మనుగడ మాతృభాషపై ఆధారపడి ఉంటుందని జస్టిస్ ఆవుల సాంబశివరావు గట్టిగా నమ్మేవారని చెప్పారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షన వహించిన తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ మాట్లాడుతూ..విశ్వవిద్యాలయంలో పెన్షన్ సౌకర్యం లేని ఉద్యోగుల కోసం కోటి రూపాయల మూలనిధిని ఏర్పాటు చేయాలన్న దృఢ సంకల్పంతో పనిచేస్తున్నామన్నారు.

ఉద్యోగ నియామకాలపై నియంతృత్వ దోరణి

కేసీఆర్‌పై కనుకుల జనార్ధనరెడ్డి ఫైర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగ నియామకాలను చేపట్టకుండా ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ సేవాదళ్ చైర్మెన్ కనుకుల జనార్ధన్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ ఉద్యమం సందర్భంగా కేసీఆర్ 1.68 ఉద్యోగాలు ఖాళీలుగా ఉన్నట్టు చెప్పారని, అధికారంలోకి వచ్చాక ఉద్యోగ నియామకాలను మరచిపోయారని విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లో తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఎంత మందికి ఉద్యోగాలొచ్చాయి. ఎంత మంది లబ్దిపొందారో చెప్పాలని డిమాండ్ చేశారు.

మున్సిపల్ కార్మికుల అడ్డగింపు

ఖమ్మం కలెక్టరేట్ ముట్టడిలో ఉద్రిక్తత

- దిష్టిబొమ్మ దహనం చేస్తుండగా అరెస్ట్
- ప్రతి కార్మికుడినీ పర్మినెంట్ చేయాలి: పాలడుగు భాస్కర్



నిజామాబాద్‌లో నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ- విలేకరులు

మూడు రోజులు తమ సమస్యలపై సమ్మెలో ఉన్న మున్సిపల్ కార్మికులను శనివారం పలు చోట్ల పోలీసులు అడ్డుకున్నారు. ఖమ్మం కలెక్టరేట్ ముట్టడిగా బయలుదేరిన కార్మికులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత ఏర్పడింది. నాయకులను అరెస్టు చేస్తుండగా తోపులాట జరిగింది. రాస్తారోకో, దిష్టిబొమ్మలు దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. సీఎం హామీ మేరకు వేతనాలు పెంచి, ప్రతి కార్మికుడినీ పర్మినెంట్ చేయాలని, ఉద్యోగులతో సమానం వేతనాలివ్వాలని గజ్వేల్‌లో కార్మికుల సమ్మెలో పాల్గొన్న మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ చైర్మెన్ పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు.

ఖమ్మంలో సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులంతా కలిసి కలెక్టరేట్ ముట్టడికి యత్నించారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. నాయకులను, కార్మికులను అరెస్టులు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అరెస్టుల సందర్భంగా స్వల్ప తోపులాట జరిగి ఉద్రిక్తత ఏర్పడింది.

మేడ్చల్ జిల్లా ఫీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు సభ నిర్వహించిన సభలో జేఏసీ చైర్మెన్ పాలడుగు భాస్కర్ ప్రసంగించారు. రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్న కార్మికులది ఆకలి, ఆత్మగౌరవ పోరాటమని అన్నారు.

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు వెళ్తుండగా పోలీసులు కార్మికులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. సీఐటీయూ నాయకులు మల్యాల గోవర్ధన్‌ను అరెస్టు చేయబోగా కార్మికులు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు వనమాల కష్ణ మాట్లాడుతూ.. శాంతియుతంగా ఆందోళన నిర్వహిస్తున్న కార్మికులపై పోలీసులను ఉసిగొల్పి ఉద్యమాన్ని అణచివేయాలని చూడటం దుర్మార్గమన్నారు.

కామారెడ్డి జిల్లా కేంద్రంలో రోడ్డుపైనే కార్మికులు వంటావార్పు నిర్వహించారు. బాన్సువాడ డివిజన్ కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో చేపట్టారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో రాస్తారోకో చేశారు. వేములవాడ, కరీంనగర్‌లో కార్మికుల సమ్మెకు పలు రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు.

పెద్దపల్లి జిల్లా రామగుండం కార్పోరేషన్ ఎదుట ధర్నా, అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. పెద్దపల్లిలో మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. జగిత్యాలలో కార్మికుల ర్యాలీని మున్సిపల్ చైర్‌పర్సన్ టి.విజయలక్ష్మీ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైటాయించారు.

సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి, జహీరాబాద్, సదాశివపేట, జోగిపేట నగర పంచాయతీ కార్మికులు సమ్మె కొనసాగింది. సిద్దిపేట జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ, ధర్నా చేశారు. అనంతరం వినతిపత్రం అందజేశారు.

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో ధర్నా అనంతరం ఉప తహసీల్దార్ ఎగ్బాల్‌కు వినతిపత్రం అందజేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలో కార్మికులు చిప్పలు పట్టుకుని నిరసన తెలిపారు. జోగులాంబ జిల్లా కేంద్రంలో కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు.

నల్లగొండ మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మెకు కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. మిర్యాలగూడ మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడారు.

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో కార్మికులు కండ్లకు గంతలు కట్టుకుని జాతీయ రహదారిపై అర్ధనగ్న ప్రదర్శన చేశారు. అంబేద్కర్ చౌరస్తాలో రోడ్డుపైనే వంటావార్పు చేసుకున్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె విజయవంతం

- జయప్రదం చేసిన కార్మికులకు అభినందనలు
- ఇప్పటికైనా వేతనాల పెంపుదల జీవో విడుదల చేయాలి
- లేకుంటే నిరవధిక సమ్మె: డీఎంఏ శ్రీదేవికి కార్మిక సంఘాల జేఏసీ నోటీస్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె విజయవంతమైందని, మూడు రోజులుగా సమ్మె జయప్రదం చేసిన కార్మికులకు మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ అభినందనలు తెలిపింది. మున్సిపల్ కార్మికులు మూడు రోజులుగా సమ్మె చేస్తున్న నేపథ్యంలో డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (డీఎంఏ) డాక్టర్ టికె శ్రీదేవి శనివారం సాయంత్రం చర్చలకు ఆహ్వానించారు. తన మున్సిపల్ కార్మికుల సమస్యలు, వేతనాల పెంపుదలకు సంబంధించిన జీవో విడుదల, ఇతర సమస్యలను అసెంబ్లీ సమావేశాలు ముగియగానే ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు దృష్టికి తీసుకెళ్లి ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జేఏసీకి హామీ ఇచ్చారు. అప్పటి వరకు సమ్మెను వాయిదా వేయాలని కోరారు. ఇదే సందర్భంలో వేతనాల పెంపుదలపై 15 రోజుల్లో తగిన నిర్ణయం రాకపోతే మార్చి 30, 2018 తర్వాత ఏ రోజునుండైనా నిరవధిక సమ్మె చేపడుతామని, అందుకు సంబంధించిన సమ్మె నోటీసును జేఏసీ ఇచ్చింది. ఆ తర్వాత ప్రస్తుతం కొనసాగుతున్న సమ్మెను విరమించినట్టు జేఏసీ ప్రకటించింది. డీఎంఏతో జరిగిన చర్చల్లో పాల్గొన్న వారిలో మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ నేతలు పాలడుగు భాస్కర్, జె వెంకటేష్, ఖమర్ అలీ, మంగపతి, (సీఐటీయూ), ఏసు రత్నం , సహదేవ్ (ఏఐటీయూసీ), కె సూర్యం, యాదయ్య, ఎస్ఎల్ పద్మ (ఐఎఫ్‌టీయూ), ఎంకె బోస్ (టీఎన్‌టీయూసీ) పాల్గొన్నారు. ప్రభుత్వం ఇప్పటికే అనేక సార్లు కార్మికుల వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చి అమలు చేయకుండా కాలయాపన చేసిందని జేఏసీ పేర్కొంది. అయినప్పటికీ ప్రభుత్వానికి మరో గడువు ఇవ్వాలని నిర్ణయించింది. ఇచ్చిన గడువును పరిగణనలో తీసుకొని వేతనాల పెంపుదలను ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకుండా ఇదే పద్ధతుల్లో వ్యవహరిస్తే నిరవధిక సమ్మె చేయనున్నట్టు తెలిపింది. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో (గ్రేటర్ హైదరాబాద్ మినహా) కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో పని చేస్తున్న కాంట్రాక్టు మరియు ఔట్ సోర్సింగ్ ఉద్యోగ, కార్మికులందరికీ జీవో నెంబ14లో పేర్కొన్న వేతనాల పెంపుదలపై మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం అమలు చేయాలని కోరుతూ ఈ నెల 15, 16, 17 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన సమ్మె జయప్రదమైందని జేఏసీ తెలిపింది. ప్రభుత్వం ఇప్పటికైనా కార్మికుల ఆగ్రహాన్ని పరిగణనలోకి తీసుకొని వేతనాల పెంపుదల జీవో విడుదల చేయాలని డిమాండ్ చేసింది.

దశల వారీగా పోరాటాలు

మున్సిపల్ కార్మికుల వేతనాల పెంపుదల జీవోను విడుదల చేయాలని కోరుతూ జేఏసీ దశలవారీగా పోరాటాలు నిర్వహించింది. మార్చి 1 నుంచి 5 వరకు ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు సమర్పించడం, మార్చి 6, 7 తేదీలల్లో ఇంటింటికి భిక్షాటన, మార్చి 12న కలెక్టరేట్ల ముట్టడి, ధర్నాలు నిర్వహించడం, మార్చి 14న రాజకీయపార్టీలు, ఉద్యోగ, కార్మిక, ప్రజాసంఘా లతో హైదరాబాద్‌లో రౌండ్‌టేబులు సమావేశం, మార్చి 15,16,17 తేదీలల్లో మూడు రోజుల సమ్మె నిర్వహించింది. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో ఓట్ల కోసం కేవలం గ్రేటర్ కార్మికులకు 2015 జూలై నెలలో వేతనాన్ని రూ 8500 నుంచి రూ 12500 పెంచింది. గ్రేటర్ మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచిన సర్కారు....ఇతర కార్పొరేషన్లు , మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో పని చేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచలేదు. ఈ నేపథ్యంలోనే జేఏసీ పిలుపు మేరకు మున్సిపల్ కార్మికులు మూడురోజులుగా సమ్మెకు దిగారు.

చెరువులో ఐదుగురు చిన్నారులు మృతి

అంతా దగ్గరి కుటుంబీకులే..

కన్నీరుమున్నీరవుతున్న తండావాసులు



నవతెలంగాణ-కొండమల్లేపల్లి

పొద్దుటి పూట బడిలో తోటి పిల్లలతో గడిపిన చిన్నారులు.. ఒంటి పూట బడి ఇడవగానే చెరువులో స్నానానికి దిగిన ఐదుగురు ప్రాణం కోల్పోయారు. వీరంతా దగ్గరి కుటుంబాలకు చెందిన వారే. విగత జీవులైన ఆ పసికందులను చూసి తల్లిదండ్రులు, తండావాసులు గుండెలవిసేలా రోదించారు. ఈ హృదయవిదారక ఘటన శనివారం నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం పెండ్లిపాకల గ్రామపంచాయతీ పరిధిలోని గుడితండాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నేనావత్ ఓంకారం-సరస్వతి కుమారులు సంతోష్(7), రాకేష్(5) గౌతమి పాఠశాలలో రెండో తరగతి, ఎల్‌కేజీ చదువుతున్నారు. సర్దార్-జయ కుమారుడు నేనావత్ శివ(6) కూడా అదే పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్నారు. నేనావత్ హనుమ-కుమారిల కుమారులు సాత్విక్(7), నేనావత్ నవదీప్(5) విజయమేరి స్కూల్‌లో ఎల్‌కేజీ, ఒకటో తరగతి చదువుతున్నారు. ఒంటిపూట బడులు కావడంతో మధ్యాహ్నమే ఇంటికి వచ్చారు. ఐదుగురూ కలిసి గ్రామానికి సమీపాన ఉన్న పెండ్లిపాక ప్రాజెక్టు చెరువుకు వెళ్లారు. వారికి ఈత రాకపోవడంతో మునిగి చనిపోయారు. పిల్లలు సాయంత్రం వరకూ ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు వెతికారు. చెరువు వద్దకు వెళ్లి చూడగా, అందులో మృతదేహాలు పైకి తేలాయి. డీఎస్పీ రవికుమార్, సీఐ శివరాంరెడ్డి, ఎస్ఐ శంకర్‌రెడ్డి తండాకు పోయి పరిశీలించారు. చిన్నారుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. జెడ్పీ చైర్మెన్ బాలునాయక్‌తోపాటు, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు పిల్లల ఒకేసారి చనిపోవడంతో తండాలో రోదనలు మిన్నంటాయి.

వృద్ధ దంపతుల ఆత్మహత్యాయత్నం

- భూసమస్యను పరిష్కరించని అధికారులు
- ఆర్డీఓ కార్యాలయం ఎదుటే ఘటన
- సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలి: అఖిలపక్ష నాయకుల ఆందోళన



నవతెలంగాణ-హుస్నాబాద్

భూసమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని, కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోయిన వృద్ధ దంపతులు ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం ఆర్డీఓ కార్యాలయం ఎదుట శనివారం జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కోహెడ మండలం కూరేళ్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బాల్‌రెడ్డి(75)కి ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. ముగ్గురు అన్నదమ్ములకు కలిపి నాలుగెకరాల వ్యవసాయ భూమి ఉంది. తండ్రి పేరు మీద ఉన్న ఆ భూమిని ముగ్గురూ సమానంగా సాగు చేసుకుంటున్నారు. బాల్‌రెడ్డి దంపతులకు సంతానం లేదు. కొన్నాళ్లుగా వారు వృద్ధాశ్రమంలో ఉంటున్నారు. ఆ క్రమంలోనే బాల్‌రెడ్డికి తెలియకుండా తమ్ముళ్లు భూమిని అమ్మేశారు. ఆ తర్వాత విషయం తెలిసి బాల్‌రెడ్డి రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. ఆరు నెలల నుంచి ఆర్డీఓ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. శనివారం ఆర్డీఓ కార్యాలయం ఎదుటే బాల్‌రెడ్డి, భార్య వెంకటవ్వ(70) పురుగుల మందు తాగారు. స్థానికులు గమనించి వెంటనే దంపతులిద్దరిని చేర్యాల ఆస్పత్రికి తరలించారు. అక్కడి డాక్టర్ల సూచన మేరకు సిద్దిపేట ఏరియాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి హైదరాబాద్ తరలించారు. విషయం తెలుసుకున్న అఖిలపక్షం నాయకులు బాధితులకు న్యాయం చేయాలని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. సంబంధిత అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. హుస్నాబాద్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో రైతు సంఘం నాయకులు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు శివరాజ్, కోయడ కొమురయ్య, డీసీసీ అధికార ప్రతినిధి కేడం లింగమూర్తి, బొలిశెట్టి శివయ్య, ఆకుల వెంకట్, అక్కు శ్రీనివాస్, బత్తుల రవీందర్, రాజు కుమార్ పాల్గొన్నారు.



19 నుంచి టీఎస్‌ఆర్టీసీఈయూ రిలేదీక్షలు

- వేతన సవరణ చేయాలని డిమాండ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీ కార్మికుల వేతన సవరణను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19 నుంచి 23 వరకు రిలే నిరాహారదీక్షలు నిర్వహిస్తున్నట్టు టీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ బాబు, కె రాజిరెడ్డి తెలిపారు. ఐదు రోజులపాటు జరిగే ఈ దీక్షలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తమ కార్యాలయంలోనే జరుగుతాయని చెప్పారు. శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 23వ తేదీ మహాధర్నా నిర్వహిస్తామన్నారు. 2017 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రావల్సిన వేతన సవరణపై ఇప్పటి వరకు యాజమాన్యం, ప్రభుత్వం పట్టించుకోవట్లేదని విమర్శించారు. గుర్తింపు కార్మిక సంఘం పట్టీపట్టనట్టే వ్యవహరిస్తోందన్నారు. ఆర్టీసీ కార్మికులకు 62 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులకు అమల్లో ఉన్న మాస్టర్ స్కేల్‌ను ఆర్టీసీ కార్మికులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రేట్ ఆఫ్ ఇంక్రిమెంట్ 6 శాతం ఉండాలని చెప్పారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఆర్టీసీ విస్తరణ కోసం ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. పైపెచ్చు ఆర్టీసీకి రావల్సిన బకాయిల్ని సైతం విడుదల చేయట్లేదని చెప్పారు. టిక్కెట్ తీసుకొనే బాధ్యత ప్రయాణీకుడిదే అని ఉత్తర్వులు జారీ చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

- 'మీ సేవ' ద్వారా స్వీకరణకు ఏర్పాట్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆహారభద్రత, అంత్యోదయ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించేందుకు పౌరసరఫరాలశాఖ ఏర్పాట్లు చేస్తున్నది. కార్డు పొందేందుకు అర్హతలు కలిగి ఉండి, ఇప్పటివరకు కార్డులు లేనివారు మరికొన్ని రోజుల్లో 'మీ సేవ' ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. వాటిని పరిశీలించి కార్డుల జారీకి తగిన అర్హత ఉన్నట్టు సంబంధిత అధికారులు నిర్ధారించిన తర్వాత కొత్త కార్డులను జారీ చేయనున్నారు. ఈ మేరకు హైదరాబాద్ సీఆర్‌ఓతోపాటు అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్లకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. శాఖ ప్రక్షాళనలో భాగంగా ప్రభుత్వం 17,500 రేషన్ దుకాణాల్లో రాష్ట్రవ్యాప్తంగా ఈ-పాస్ విధానాన్ని అమలు చేస్తున్నది. ఈ విధానంలో వినియోగదారుల వేలిముద్రలు సేకరించి వాటి ఆధారంగా సరుకులు పంపిణీ జరుగుతున్నది. ఈ విధానంతో ప్రతి నెల సగటున 15 శాతం వరకు బియ్యం ఆదా అవుతున్నట్టు అధికారులు గుర్తించారు. అక్రమాలకు దాదాపుగా తెరపడటంతో కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తులకు మార్గం సుగమమైంది. రాష్ట్రంలో 85.64 లక్షల రేషన్ కార్డులుగాను 2.75 కోట్ల మంది లబ్ధిదారులు ప్రయోజనం పొందుతున్నారు. నెలకు 1.75 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం రాష్ట్రానికి అవసరమవుతుండగా, కేంద్రం 1.24 లక్షల మెట్రిక్ టన్నులు విడుదల చేస్తున్నది. 50 వేల నుంచి 60 వేల మెట్రిక్ టన్నులు బియ్యాన్ని రాష్ట్రం అదనంగా కొనుగోలు చేస్తున్నది. బియ్యం పంపిణీకి ఏడాదికి రూ.5954.25 కోట్లు ఖర్చవుతున్నాయి. ఇందులో కేంద్రం వాటా రూ.3487.45 కోట్లు, రాష్ట్రం వాటా రూ.2466.80 కోట్లు. కాగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రభుత్వం ఇప్పటి వరకు కొత్త కార్డులు జారీ చేయని సంగతి తెలిసిందే. తాజాగా, ప్రభుత్వం నిర్ణయంపై అర్హత కలిగిన కార్డులులేని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హిందీ, సంస్కృత భాషల్ని పరిరక్షించండి

- ఇంటర్ మూల్యాంకనం బహిష్కరణ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

హిందీ, సంస్కృత భాషల్ని పరిరక్షించాలని తెలంగాణ ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్ట్ అధ్యాపక సంఘం డిమాండ్ చేసింది. తెలుగుభాషను తప్పనిసరి చేస్తూ, మిగిలిన ద్వితీయ భాషల్ని రద్దు చేస్తున్నట్టు సమాచారం రావడంతో ఇంటర్ పరీక్షల మూల్యాంకనాన్ని బహిష్కరించినట్టు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి రమణారెడ్డి, కొప్పిశెట్టి సురేష్ ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగును తప్పనిసరి చేస్తే అనేక మంది ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని, జాతీయ భాషను కాపాడాలని ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. అందుకే తాము మూల్యాంకనాన్ని బహిష్కరించామని, దీనివల్ల ఇంటర్ ఫలితాల ప్రకటన ఆలస్యమౌతుందని తెలిపారు. హిందీ, సంస్కృత భాషలకు ఎలాంటి ముప్పు లేదని రాష్ట్రప్రభుత్వం ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇవ్వకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని చెప్పారు.

విశ్వవిజేతగా నారాయణ స్కూల్స్

- నాసా కాంటెస్ట్‌లో వరుసగా నాలుగో సారి విజయభేరీ

హైదరాబాద్: నాసా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన నాసా స్పేస్ సెటిల్‌మెంట్ డిజైన్ కాంటెస్ట్-2018లో నారాయణ విద్యార్థులు సత్తా చాటారు. ప్రపంచవ్యాప్తంగా 128 సెలక్షన్స్ ప్రకటించగా అందులో 40 సెలక్షన్స్(32శాతం) నారాయణ స్కూల్స్ సాధించింది. ఇందులో వరల్డ్ నెంబర్ 1 స్థానంలో 5 సెలక్షన్స్, నెంబర్ 2స్థానంలో 4 సెలక్షన్స్, నెంబర్ 3స్థానంలో 7 సెలక్షన్‌లను నారాయణ విద్యార్థులు సాధించారు. దీంతో రాష్ట్రస్థాయిలోనే కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తమ విద్యాసంస్థలు రాణిస్తున్నాయని నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి సింధూర తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఎంతో పోటీ ఉండే ఈ కాంపిటీషన్‌లో 200మందికి పైగా నారాయణ విద్యార్థులు 40 సెలక్షన్స్ సాధించారని వివరించారు. పోటీ పరీక్షల కోసం ప్రత్యేకంగా సీఓ స్పార్క్, ఒలింపియాడ్, ఈ-టెక్నో, మెడిస్పార్క్ వంటి శిక్షణనందిస్తున్నామని పేర్కొన్నారు. ఇలాంటి కాంటెస్టుల్లో సృజనాత్మకతో కూడిన నూతన ఆవిష్కరణలు చేయాల్సి ఉంటుందని, అందుకే విద్యార్థుల్లో ఆసక్తి రేకెత్తించేలా, నూతన ఆవిష్కరణలు ప్రేరేపించేలా బోధిస్తున్నామని తెలిపారు. ఈ విజయాల వెనుక నారాయణ సుపీరియర్ ప్లానింగ్, సూపర్లేటివ్ టీచింగ్ వెన్నుదన్నుగా ఉన్నాయన్నారు. ఘనవిజయం సాధించిన విద్యార్థులను నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె పునీత్ ప్రత్యేకంగా అభినందించారు.

సత్తా చాటిన శ్రీ చైతన్య విద్యార్థులు

హైదరాబాద్: నాసా-నేషనల్ స్పేస్ సొసైటీ, అమెరికా నాసా ఏమ్స్ స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్‌లో శ్రీచైతన్య విద్యార్థులు సత్తా చాటారు. ఈ ఏడాది ప్రపంచంలోనే అత్యధికంగా 334 మంది విద్యార్థులు వారి ప్రాజెక్టులకు అవార్డులు సాధించారు. ఇందులో మొదటి బహుమతిని రెండు ప్రాజెక్టులు, రెండో బహుమతిని ఆరు ప్రాజెక్టులు సొంతం చేసుకున్నాయి. దీంతో నాసా స్పేస్ కాంటెస్ట్‌లో ఆధిపత్యం కొనసాగిస్తు వరుసగా ఐదో ఏడాది కూడా శ్రీ చైతన్యయే వరల్డ్ ఛాంపియన్ అని మరోసారి నిరూపితమైందని శ్రీచైతన్య స్కూల్స్ అకడమిక్ డైరెక్టర్ సీమ తెలిపారు. ప్రాజెక్టు విజేతలకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మెన్ డాక్టర్ బి.ఎస్ రావు అభినందనలు తెలిపారు. ఎంపికైన విద్యార్థులందరూ లాస్ ఏంజిల్స్, కాలిఫోర్నియా, అమెరికాలో జరిగే ఐ.ఎస్.డి.సీ.కాన్ఫరెన్స్‌కు హాజరవుతారని ఆయన తెలిపారు.

సెంట్రల్ మిలిటరీ కమిషన్ చీఫ్‌గా జిన్‌పింగ్

- పార్లమెంట్‌లో ప్రమాణ స్వీకారం
- ఉపాధ్యక్షుడిగా వాంగ్ క్విషాన్ ఎంపిక

బీజింగ్: రెండోపర్యాయం చైనా అధ్యక్షుడిగా జీ జిన్‌పింగ్ ఎంపికకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. దీంతో ఆయన శనివారంనాడు బీజింగ్‌లోని 'గ్రేట్ హాల్ ఆఫ్ ద పీపుల్' (పార్లమెంట్)లో దేశాధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. పార్లమెంట్‌లోని 2970 మంది సభ్యులు అధ్యక్షుడిగా ఆయన ఎంపికకు అంగీకారం తెలిపారు. జిన్‌పింగ్ సన్నిహితుడిగా పేరు ఉన్న వాంగ్ క్విషాన్ ఉపాధ్యక్షుడిగా ఎంపికయ్యారు. దీనిపై పార్లమెంట్ ఓటింగ్‌లో కేవలం ఒక్క సభ్యుడు మాత్రమే వ్యతిరేకత వ్యక్తం చేశాడు.

దేశ రాజ్యాంగంలో అధ్యక్షుడు రెండు పర్యాయాలు మాత్రమే పదవిలో ఉండే నిబంధనను ఎత్తేస్తూ ఇటీవల చైనా పార్లమెంటు సంచలన నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. దీంతో రెండో పర్యాయం అధ్యక్షుడిగా ఎన్నికైన జిన్‌పింగ్ అయిదేళ్ల పదవీకాలం ముగిసిన తర్వాత కూడా అధ్యక్షుడిగా కొనసాగేందుకు అవకాశం ఏర్పడింది. చైనా



పూర్తి సైన్యానికి హైకమాండ్‌గా వ్యవహరించే అత్యంత శక్తివంతమైన 'సెంట్రల్ మిలిటరీ కమిషన్' అధినేతగా జిన్‌పింగ్ ఎంపికకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. జిన్‌పింగ్ నేతృత్వంలో నేడు ఏర్పడిన కొత్త ప్రభుత్వంలో ప్రధాని లీ క్వెకియాంగ్ మినహా మినహా ఉన్నత స్థాయి అధికారులను, మంత్రిమండలిని, అక్కడి సెంట్రల్ బ్యాంకు గవర్నర్‌ను మార్చేయనున్నారు.


చైనాలోని అధికార కమ్యూనిస్ట్ నేషనల్ పార్టీ అధ్యక్షుడి, ఉపాధ్యక్షుడి పదవీకాల పరిమితిని ఎత్తేస్తూ ప్రతిపాదించిన చట్ట సవరణను మార్చి 11న నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్‌కు చెందిన 2900మంది డిప్యూటీలంతా కలిసి ఆమోదించారు. రెండు పర్యాయాల కాల పరిమితి ప్రకారం జిన్‌పింగ్ 2023నాటికి కమ్యూనిస్ట్ నేషనల్ పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవాల్సి ఉండేది. ఆయన 2013లో అధ్యక్షుడు అయ్యారు. జిన్‌పింగ్ ప్రవేశపెట్టిన అవినీతి వ్యతిరేక కార్యక్రమం వాంగ్ క్విషాన్ ఆధ్వర్యంలో జరుగుతోంది.



వాంగ్ క్విషాన్ , జీ జిన్‌పింగ్

రిటైర్మెంట్‌కు ముందు ఉద్యోగం ఊడింది

వాషింగ్టన్: గతంలో ఎఫ్‌బీఐ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేసిన ఆండ్ర్యూ మెక్‌కేబ్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్టు అటార్నీ జనరల్ జెఫ్ సెషన్స్ వెల్లడించారు. అయితే పదవీ విరమణకు కేవలం ఒక్కరోజు కంటే ముందే ఆయనను ఉద్యోగం నుంచి తొలగించారు. దీని వల్ల ఆయనకు పదవీవిరమణ అనంతరం పొందే లాభాలు రాకుండా పోయే అవకాశం ఉంది. మెక్‌కేబ్ ఇటీవల తరచూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహానికి గురవుతున్న నేపథ్యంలో రిటైర్మెంట్‌కు కేవలం 26 గంటలు ఉందనగా ఆయనను ఉద్యోగం నుంచి తీసేయడం చర్చనీయాంశంగా మారింది. మార్చి 16న రాత్రి పది గంటల(అమెరికా కాలమానం ప్రకారం) సమయంలో జెఫ్ సెషన్స్ ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. కాగా మార్చి 18న ఆయన పదవీ విరమణ చేయాల్సి ఉంది.మెక్‌కేబ్ 2016 ఫిబ్రవరి 1 నుంచి 2018 జనవరి 29 వరకు ఎఫ్‌బీఐ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేశారు. తర్వాత తన పదవీవిరమణ రోజైన మార్చి 18వరకు సెలవు పెట్టారు. హిల్లరీ క్లింటన్ ఈమెయిల్ సర్వర్ కేసు దర్యాప్తు విషయంలో సమాచారాన్ని మీడియాకు ఇచ్చేందుకు



ఆండ్ర్యూ మెక్‌కేబ్

సహకరించారని, దర్యాప్తు అధికారులను తప్పుదోవ పట్టించారని ఎఫ్‌బీఐకి చెందిన ప్రొఫెషనల్ రెస్పాన్సిబిలిటీ కార్యాలయం నివేదిక అందజేసింది. అంతర్గత దర్యాప్తు నివేదిక ప్రకారం ఆయనను ఉద్యోగం నుంచి తీసెయ్యొచ్చని సిఫార్సు చేసింది. దీంతో ఆయనను వెంటనే తొలగిస్తున్నట్టు అటార్నీ జనరల్ జెఫ్ సెషన్స్ వెల్లడించారు.

మెక్‌కేబ్స్‌ను తొలగించడం జస్టిస్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన అంశమని, అయితే ఈ నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామని అధ్యక్ష నివాసమైన వైట్‌హౌస్ వెల్లడించింది. మెక్‌కేబ్స్ దాదాపు 20ఏండ్లపాటు ఎఫ్‌బీఐలో పనిచేశారు. పలు కీలక పదవుల్లో బాధ్యతలు నిర్వర్తించారు. ఆదివారం రిటైర్ కావాల్సిన ఆయనను ఇలా ఉన్నట్టుండి తొలగించడంతో ఇన్నేండ్ల సర్వీసుకు సంబంధించి పెన్షన్ డబ్బు తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తనున్నాయి. మరోవైపు సమాచారాన్ని జర్నలిస్ట్‌లకు తెలియజేయడానికి తనకు అధికారం ఉందని మెక్‌కేబ్ పేర్కొన్నారు. ఇది తన విశ్వసనీయతపై జరుగుతున్న దాడి అని అన్నారు.

ఆస్కార్ అకాడమీ చీఫ్‌పై లైంగిక ఆరోపణలు

న్యూయార్క్ : లైంగిక ఆరోపణల ఉచ్చులో ఆస్కార్ అకాడమీ ప్రెసిడెంట్ చిక్కుకున్నాడు. గత ఏడాది ఆగస్టులో అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ అధ్యక్షుడిగా ఎంపికైన జాన్ బైలీపై మూడు లైంగిక వేధింపుల కేసులు నమోదైనట్టు వార్తలు వెలువడ్డాయి. సినిమాటోగ్రాఫర్‌గా అమెరికన్ గిగోలో, ది బిగ్ చిల్ , గ్రౌండ్ హోగ్ డే వంటి సినిమాలకి పనిచేశారు బైలీ. జాన్ బైలీపై వస్తున్న వార్తలపై ఆస్కార్ కమిటీ మెంబర్స్ పూర్తిగా సమీక్షించి ఆ తర్వాత బోర్డ్ ఆఫ్ గవర్నర్స్‌కి రిపోర్ట్ చేయనుంది. దీనిపై సమగ్ర విచారణ పూర్తయ్యే వరకు ఎలాంటి ప్రకటనా చేయబోమని అకాడమీ అనధికారికంగా తెలిపింది. ఒకవేళ బైలీ తప్పుచేశాడని తెలిస్తే అతని స్థానంలో సీనియర్ మేకప్ ఆర్టిస్ట్ లూయిస్ బుర్ వెల్ అధ్యక్షుడిగా ఉంటారు. ప్రస్తుతం లూయిస్ అకాడమీ వైస్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్నారు.

ప్రతి ఏడాది ఎంతో ఘనంగా జరిగే ఆస్కార్ పండుగ ఈ సారి లాస్ ఏంజెల్స్‌లో ఉన్న డాల్బీ థియేటర్‌లో మార్చి 4న అంగరంగ వైభవంగా జరిగిన సంగతి తెలిసిందే. 90వ ఆస్కార్ అవార్డుల వేడుకకి ప్రముఖ అమెరికన్ టెలివిజన్ హోస్ట్ జిమ్మీ కిమ్మెల్ వ్యాఖ్యాతగా వ్యవహరించాడు. ఉత్తమ నటుడిగా గ్యారీ ఓల్డ్ మాన్ (డార్కెస్ట్ హవర్), ఉత్తమ నటి అవార్డును ఫ్రాన్సెస్ మెక్ డార్మమండ్ (త్రి బిల్బోర్డ్స్ ఔట్సైడ్ ఎబింగ్, మిసోరి) సొంతం చేసుకున్నారు. 'ద షేప్ ఆఫ్ వాటర్' సినిమాకు గాను గిలెర్మో డెల్ టోరో ఉత్తమ దర్శకుడిగా ఎంపికయ్యారు. ఉత్తమ చిత్రంగా 'ద షేప్ ఆఫ్ వాటర్'కి ఆస్కార్ అవార్డ్ వరించిన విషయం విదితమే.



బడ్జెట్ కార్మికుల సంక్షేమాన్ని విస్మరించింది

- 19 నుంచి ధర్నాలు:ఏఐటీయూసీ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

టీఆర్ఎస్ సర్కారు ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు టి. నరసింహన్, ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్‌రావు విమర్శించారు. ఈనేపథ్యంలో ఈనెల 19 నుంచి 23 వరకు ధర్నాలు నిర్వహించనున్నట్టు ప్రకటించారు. శనివారం హైదరాబాద్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. బడ్జెట్ 1.74 లక్షల కోట్లతో ప్రవేశపెట్టినా, కార్మికులకు ఎలాంటి ప్రయోజనం లేదని వ్యాఖ్యానించారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికులకు సామాజిక భద్రత కల్పించేవిధంగా ఏ ఒక్క చర్యా చేపట్టలేదని ఆరోపించారు. రాష్ట్రంలో రెండున్నర లక్షల మంది ఉద్యోగ ఖాళీలు ఒకవైపు ఉంటే, మరోవైపు అతి తక్కువ వేతనాలతో రెండున్నర లక్షల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నా, ఉద్యోగ భద్రత లేక దుర్భర పరిస్థితిలో ఉన్నారని విమర్శించారు. మున్సిపల్ కార్మికులే మా దేవుళ్లని గొప్పలు చెప్పిన సీఎం, నాలుగేండ్లు గడుస్తున్నా వారి ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా ప్రభుత్వ పథకాలు, సహకార, స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు రూ.18 వేలు చెల్లించాలని, కనీస పింఛను రూ. 3 వేలు అమలుచేయాలని కోరారు. ఐదేండ్ల కాల పరిమితి ముగిసిన జీవోలను సమరించ కపోవడం దారుణమని అభిప్రాయపడ్డారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 19 నుంచి 23 వరకు ధర్నాలు నిర్వహించ నున్నట్టు తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో ఏఐటీ యూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ.ప్రేంపావని, కార్యదర్శులు ఎండీ యూసుఫ్, బి.చంద్రయ్య, బి.వెంకటేశం, ఎన్.కరుణకుమారి పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు కేటాయించాలి

- రెవెన్యూ మంత్రికి టీడబ్ల్యూజేఎఫ్ వినతి
- రాష్ట్రవ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, కలెక్టర్లకు సమర్పణ



రెవెన్యూ శాఖ మంత్రి మహ్మద్ మహమూద్ అలీకి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేస్తున్న ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు వెంటనే కేటాయించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. నాలుగేండ్లుగా ముఖ్యమంత్రి హామీ నెరవేరలేదని తెలియజేసింది. శనివారం హైదరాబాద్‌లో రెవెన్యూ శాఖ మంత్రి మహ్మద్ మహమూద్ అలీకి ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఎం.సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య ఇండ్ల స్థలాల విషయాన్ని మంత్రితో చర్చించారు. మండలస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు జర్నలిస్టులందరికి ఇండ్లస్థలాలు, డబుల్‌బెడ్‌రూం కేటాయించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో పలుమార్లు సీనియర్ జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాలతో సీఎం భేటి అయ్యారని, ఆ సందర్భంగా పలు ప్రతిపాదనలు చేశారని చెప్పారు. అయితే అవి ఆచరణలో కార్యరూపం దాల్చలేదని వివరించారు. ప్రభుత్వమే ప్రత్యేకంగా సమాచార శాఖ ఆధ్వర్యంలో ఒక ఫ్లాట్‌పారం ఏర్పాటు చేసి దాని ద్వారా ఇండ్లస్థలాలు ఇవ్వడం, లేదా అన్ని జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీలకు స్థలాలు కేటాయించడం చేయాలని సూచించారు. సుప్రీంకోర్టు కేసును సాకుగా చూపించి కాలయాపన చేయరాదని అభిప్రాయపడ్డారు. దీనికి మంత్రి మహమూద్ అలీ స్పందిస్తూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళతానని వివరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.ఆనందం, పి.రాంచందర్, కార్యదర్శి ఎస్.కె.సలీమా, నాయకులు రమేశ్, విజయానంద్ పాల్గొన్నారు.

జిల్లాల్లో..

ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా శాఖలు ప్రజాప్రతినిధులు, కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించాయి హైదరాబాద్‌లో హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్(హెచ్‌యూజే), టీడబ్ల్యూజేఎఫ్ తరపున ఎక్సైజ్ శాఖ మంత్రి టి. పద్మారావుకు వినతిపత్రం అందజేశారు. అలాగే కరీంనగర్, ఖమ్మం, వికారాబాద్, సంగారెడ్డి, యాదాద్రి-భువనగిరి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, జోగులాంబ-గద్వాల, వనపర్తి, భద్రాద్రి-కొత్తగూడెం, నిజామాబాద్, నిర్మల్, సూర్యాపేట, రాజన్న-సిరిసిల్ల, మహబూబాబాద్, సిద్ధిపేట, తదితర జిల్లాలతోపాటు ఇతర ప్రాంతాల్లోనూ ఈ కార్యక్రమం చేపట్టారు.


'అవి రాజకీయ సమితిలే...రైతుల ఓట్ల కోసమే ఈ పథకాలు'

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రైతు సమన్వయ సమితిలు ఏర్పాటు చేసి, అవి వ్యవసాయ రంగానికి బాగు చేసే సర్వ రోగ నివారినిలా ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు బిల్డప్ ఇస్తున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు. దమ్ముంటే ఈ నాలుగేండ్లలో తెలంగాణలో జరిగిన వ్యవసాయ రంగ సంక్షోభం, ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా చేసిన నిర్లక్ష్యం, రైతుల ఆత్మహత్యలు, ఇతర రైతాంగ సమస్యలపై బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ సవాల్ చేశారు. ఈ విషయంపై ముఖ్యమంత్రికి ఆయన బహిరంగ లేఖ రాశారు. ఇంతకాలం టీఆర్ఎస్ కార్యకర్తలకు ఎలాంటి పదవులు ఇవ్వకపోవడంతో వారంతా రాజకీయంగా నిరుత్సాహంతో మీపై తిరగబడుతారనే ఉద్దేశంతో, మీరు పశువులను సంతలో కొనుగోలు చేసినట్టు కొన్న నాయకులకు పదువులు ఇవ్వడం కోసం ఏదో ఒక దళారీ సంస్థను తెరిచి దానికి ఒక రాజకీయ దళారీని అధ్యక్షుడిగా ప్రకటించారని పేర్కొన్నారు.

నవచిత్రం

రవితేజ నేల టిక్కెట్టు


'నేల టిక్కెట్టు' చిత్రంలో రవితేజ

'టచ్ చేసి చూడు' వంటి సూపర్‌హిట్ తర్వాత కళ్యాణ్ కృష్ణ దర్శకత్వంలో రవితేజ ఓ సినిమాలో నటిస్తున్న విషయం విదితమే. ఎస్.ఆర్.టి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రామ్ తాళ్లూరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి తాజాగా 'నేల టిక్కెట్టు' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఉగాది పండుగను పురస్కరించుకుని శనివారం చిత్ర ఫస్ట్‌లుక్‌ను ట్విట్టర్ ద్వారా రవితేజ అభిమానులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ, "క్లాస్, మాస్ అంశాల మేళవింపుతో ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం. మాళవిక శర్మ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం దాదాపు 60 శాతం చిత్రీకరణ పూర్తి చేసుకుంది. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి మే 24న సినిమాను విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు. జగపతిబాబు, బ్రహ్మానందం, జయప్రకాష్, రఘుబాబు, సుబ్బరాజు, అలీ, పోసాని, అన్నపూర్ణమ్మ, ప్రియదర్శి, ప్రభాస్ శ్రీను, పృథ్వీ, సురేఖా వాణి, ప్రవీణ్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: శక్తికాంత్ కార్తీక్, ఎడిటింగ్: ఛోటా కె.ప్రసాద్, ఆర్ట్: బ్రహ్మ కడలి, కెమెరా: ముఖేష్.

వాటి ప్రభావం మాపై ఉండదు..


'విశ్వరూపం' చిత్రంలో కమల్‌హాసన్

రజనీకాంత్, కమల్ హాసన్ అగ్ర నటులు మాత్రమే కాదు అంతకు మించి ఈ ఇద్దరూ మంచి స్నేహితులు. ఇటీవల ఇద్దరూ రాజకీయాల్లోకి వస్తున్నట్టు ప్రకటించి సంచలనం సృష్టించారు. కమల్ హాసన్ 'మక్కల్ నీది మయ్యమ్' పార్టీని స్థాపించారు. ఈ నేపథ్యంలో రజనీకాంత్‌తో ఉన్న అనుబంధాన్ని, రాజకీయ భవిష్యత్ గురించి తాజాగా కమల్ స్పందించారు. ఆయన మాట్లాడుతూ, సినిమా రంగంలో రజనీకాంత్‌కు, నాకున్న అనుబంధం గురించి అందరికి తెలిసిందే. ఇప్పటి వరకు మేమిద్దరం కలిసి ఎన్నో సినిమాలు చేశాం. ఎన్నో సూపర్ హిట్స్ అందుకున్నాం. అయినప్పటికీ మా ఇద్దరి వ్యూహాలు, అభిరుచులు వేరు. సినిమాల్లో ఆయన చేసిన పాత్రలు నేను చేయలేదు. ఆయన కూడా నాలాంటి పాత్రలు చేయలేదు. ఏదేమైనా సినిమాలో మా ఉద్దేశం ఒక్కటే.. ప్రేక్షకులను అలరించడం. ఇప్పుడు ఇద్దరం రాజకీయాల్లోకి ప్రవేశించాం. ఇప్పటి వరకు కలిసున్న మమ్మల్ని రాజకీయాలు వేరు చేస్తున్నాయి. ఆయన రాజకీయ వ్యూహాలేంటో నాకు తెలియదు. రాజకీయంగా నా సిద్ధంతాలు నాకున్నాయి. నేను మతాలను నమ్మను. ఏ మతంపై ప్రేమ లేదు. రజనీకాంత్‌తో నాకు మంచి అనుభవం ఉంది. కాబట్టి మేం రాజకీయంగా వేరైనా వాటి ప్రభావం మా బంధంపై పడదు' అని అన్నారు.

విశ్వరూపం2 సెన్సార్ పూర్తి..

కమల్ హాసన్ నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'విశ్వరూపం 2'. 'విశ్వరూపం' చిత్రానికిది సీక్వెల్. పూజా కుమార్, ఆండ్రియా కథానాయికలుగా నటించారు. సెన్సార్ పూర్తి చేసుకుని 'యు/ఎ' సర్టిఫికెట్ పొందిన ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. ప్రస్తుతం 'శభాష్ నాయుడు' చేస్తున్న కమల్ 'భారతీయుడు 2'లోనూ నటించబోతున్నారు.

ఆ ఆలోచన ఇప్పటికైతే లేదు..

'ప్రస్తుతం సక్సెస్ కోసం ప్రయత్నిస్తున్నాను. రాజకీయాల్లోకి రావాలనే ఆలోచన ఇప్పటికైతే లేదు. చిత్ర పరిశ్రమలో హ్యాపీగా ఉన్నాను' అని అంటున్నారు కథానాయకుడు కళ్యాణ్ రామ్. 'ఇజం' తర్వాత కళ్యాణ్ రామ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'ఎంఎల్‌ఎ'. కాజల్ కథానాయికగా ఉపేంద్ర మాధవ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 23న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం మీడియాతో కళ్యాణ్‌రామ్ ముచ్చటించారు. ఆ విశేషాల సమాహారం ఆయన మాటల్లోనే...


కళ్యాణ్‌రామ్

పొలిటికల్ టచ్..

దర్శకుడు ఉపేంద్ర మాధవ్ చెప్పిన కథ ఫ్రెష్‌గా, జెన్యూన్‌గా అనిపించింది. నా పాత్ర కూడా కొత్తగా ఉంది. స్క్రిప్ట్ బాగా నచ్చడంతో చేశాను. కళ్యాణ్ అనే కార్పొరేట్ జాబ్ చేసే కుర్రాడిగా కనిపిస్తాను. తమ ఊరిలో తరతరాలుగా ఉన్న ఓ రాజకీయ నాయకుడు ఫ్రాడ్ చేస్తుంటాడు. అప్పుడు హీరో ఎంటరై ఏం చేశాడు?, ఊర్లో సమస్య కోసం ఎలా ఫైట్ చేశాడనేదే సినిమా. పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్. 'లక్ష్మీ కళ్యాణం' తర్వాత కాజల్‌తో కలిసి నటించడం హ్యాపీగా ఉంది. విద్య ప్రాధాన్యతను తెలిపే పాత్రలో కాజల్ కనిపిస్తుంది. ఉపేంద్ర ఒక ప్రత్యేకమైన డిక్షన్ ఉన్న దర్శకుడు. డైలాగ్ డెలివరీ, బాడీ స్టయిల్ ఎలా ఉండాలో పర్‌ఫెక్ట్‌గా చూసుకున్నారు. ఆ విషయంలో ఎక్కడా రాజీపడలేదు.

సక్సెస్ కోసం ప్రయత్నం..

కార్పొరేట్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే లవ్ స్టోరీతో ఫస్టాఫ్ ఉంటే, ద్వితీయార్థం పొలిటికల్ టచ్‌తో ఉంటుంది. అలాగని పూర్తిగా రాజకీయ నేపథ్యం ఉండదు. కథ డిమాండ్ మేరకు ఎంత ఉండాలో అంతే ఉంటుంది. భారీ పొలిటికల్ డైలాగ్‌లున్నప్పటికీ అది సినిమాకే పరిమితం. నేను రాజకీయాల్లోకి రావడం కోసం కాదు. ప్రస్తుతానికి ఆ ఆలోచనలేదు. మున్ముందు వస్తానో రానో కూడా తెలియదు. అందరు అన్నట్టు ప్రస్తుతానికి సక్సెస్ తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తాను (నవ్వుతూ). నటుడిగా, నిర్మాతగా సంతోషంగా ఉన్నాను. కమర్షియల్ రిజల్ట్ పక్కన పెడితే 'ఇజం' సినిమా విషయంలో ఒక ఆర్టిస్టుగా చాలా సంతృప్తిగా ఉన్నా. నటుడిగా నన్ను చాలా అంశాల్లో ఓపెన్ చేసిన చిత్రమది. అది ఈ సినిమాకు ఉపయోగపడింది. ఇందులో నా డైలాగ్ డిక్షన్, బాడీ లాంగ్వేజ్‌లో చాలా మార్పు కనిపిస్తుంది.

నచ్చితేనే చేస్తా..

నేను ఏ సినిమా చేసినా నా గత చిత్రాలకు, పాత్రలకు భిన్నంగా, నాకు కొత్తగా ఉండే వాటికే ప్రయారిటీ ఇస్తాను. అంతేకాదు సమ్‌థింగ్ స్పెషల్ అనుకునేలా ఉండాలి. అలాంటి కథ వస్తేనే చేస్తాను. లేకపోతే అస్సలు చేయను. ప్రస్తుతం చేస్తున్న 'ఎంఎల్‌ఏ', తదుపరి సినిమా 'నా నువ్వే' జెన్యూన్‌గా నమ్మి చేస్తున్నవే. 'నా నువ్వే' చిత్రానికి జయేంద్ర దర్శకుడు. ప్యూర్ లవ్ స్టోరీ చిత్రమిది. మొదటిసారి లవ్ స్టోరీ చేస్తున్నా. చాలా ఫ్రెష్‌గా ఉంటుంది. తమిళ దర్శకుడైనప్పటికీ యూనివర్సల్ కాన్సెప్ట్ కావడంతో ఈ సినిమా మన ప్రేక్షకులందరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. ఎట్టిపరిస్థితుల్లోనూ తమిళ ఛాయలు ఎంత మాత్రం కనిపించవు.

ఈ ఏడాదిలో మల్టీస్టారర్..


నేను మల్టీస్టారర్ చిత్రాలు చేసేందుకు కూడా సిద్ధమే. ఏ హీరోతోనైనా చేస్తాను. ఏ.ఎస్.రవికుమార్ చౌదరి దర్శకత్వంలో సాయిధరమ్‌తేజ్‌తో ఓ మల్టీస్టారర్ సినిమా చేయాల్సి ఉంది. స్క్రిప్ట్ సంతృప్తిగా అనిపించలేదు. ప్రస్తుతం ఓ మల్టీస్టారర్‌కు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయి. అది ఈ ఏడాదిలోనే ఉంటుంది. దానికి దర్శకుడు పవన్ సాధినేనా?, ఇందులో ఎన్టీఆర్ నటిస్తాడా లేదా అనేది ఇంకా క్లారిటీ రావాల్సి ఉంది. తమ్ముడు ఎన్టీఆర్, నేను తరచూ కలుస్తూనే ఉంటాం. సినిమాలు, సినిమాల సన్నివేశాలు, ప్రజెంట్ పాలిటిక్స్ వంటి తదితర అంశాల గురించి మేమిద్దరం చర్చించుకుంటాం. తనకు నటన పట్ల కాన్ఫిడెన్స్ ఎక్కువ. ఈ చిత్ర ట్రైలర్ చూసి చాలా ఫ్రెష్‌గా ఉందన్నాడు.


శ్రియా

మూడు ముళ్లు.. ఏడడుగులు..

కథానాయిక శ్రియా రష్యాకు చెందిన క్రీడాకారుడు, వ్యాపారవేత్త ఆండ్రీ కొచ్చీవ్‌ను ఈ నెల 12న అత్యంత సన్నిహితుల సమక్షంలో వివాహం చేసుకుందని తెలుస్తోంది. బాలీవుడ్ ప్రముఖులు మనోజ్ బాజ్‌పేయ్, షబానా అజ్మీలు పెళ్ళికి హాజరైన వారిలో ఉన్నారట. అంతకు ముందు రోజు, మార్చి 11న పీ వెడ్డింగ్ వేడుక కూడా అత్యంత వైభవంగా జరిగిందని శ్రియా సన్నిహితులు చెబుతుంటే, హిందూ సంప్రదాయం ప్రకారం వివాహం జరిగినట్టు సోషల్ మీడియాలో వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. శ్రియా, ఆండ్రీ కొచ్చీవ్ పెళ్ళి చేసుకోబోతున్నారంటూ ఇటీవల మీడియాలో వచ్చిన వార్తల్లో నిజం లేదని శ్రియ తల్లితోపాటు శ్రియా కూడా ఖండించింది. ఈ నేపథ్యంలో తాజా పెళ్ళి వార్త అందర్నీ సర్‌ప్రైజ్ చేసింది. ఆమె అభిమానులందరూ స్వీట్ షాక్‌కు గురయ్యారు. ఇటీవల 'గాయత్రి'లో మెప్పించిన శ్రియా ప్రస్తుతం 'వీరభోగ వసంతరాయలు', 'నరగాసురన్', 'తడ్కా' చిత్రాల్లో నటిస్తోంది.

రజనీతో పోటీ కష్టమే..


అమీర్‌ఖాన్

'రజనీకాంత్ అంటే నాకు చాలా ఇష్టం. అయితే ఆయనతో పోటీ అంటే చాలా కష్టమే' అని అంటున్నారు అమీర్ ఖాన్. ప్రస్తుతం అమీర్ నటిస్తున్న చిత్రం 'థగ్స్ ఆఫ్ హిందుస్థాన్'. విజయ్ కృష్ణ ఆచార్య దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కత్రీనా కైఫ్, ఫాతిమా సనా షైఖ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. దీపావళి కానుకగా ఈ చిత్రం నవంబర్ 7న ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు రెడీ అవుతోంది. ఇదిలా ఉంటే, రజనీకాంత్ ప్రస్తుతం నటిస్తున్న సినిమా '2.0'. 'రోబో' తర్వాత శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా ఇది. గ్రాఫిక్స్ కారణంగా వాయిదా పడుతూ వస్తున్న ఈ సినిమాను ఆగస్ట్ 15 లేదా దీపావళికి విడుదల చేసేందుకు చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది. దీపావళికి వస్తే అటు అమీర్, ఇటు రజనీ సినిమాలు పోటీ పడాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో దీనిపై అమీర్ స్పందిస్తూ, 'రజనీకాంత్ పెద్ద స్టార్. ఆయనంటే నాకు చాలా గౌరవం, ఇష్టం. ఆయన నటిస్తున్న '2.0' మా సినిమాతోపాటు విడుదల కాకూడదని కోరుకుంటున్నా. ఒకవేళ ఇదే జరిగితే మాకు పెద్ద సమస్య ఎదురవుతుంది. చాలా కష్టమైపోతుంది' అని అన్నారు.

బర్త్‌డే స్పెషల్ చి.ల.సౌ ఫస్ట్‌లుక్


సుశాంత్

నటుడు రాహుల్ రవీంద్రన్ దర్శకుడిగా మారి సుశాంత్ హీరోగా 'చి.ల.సౌ' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. రుహాని శర్మ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని సిరుని సినీ కార్పొరేషన్ పతాకంపై జస్వంత్ నడిపల్లి నిర్మిస్తున్నారు. నేడు(ఆదివారం) సుశాంత్ పుట్టిన రోజును పురస్కరించుకుని శనివారం చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ, 'సుశాంత్ హీరోగా నిర్మిస్తున్న ఈ చిత్రంతో నిర్మాతగా పరిచయం కావడం చాలా హ్యాపీగా ఉంది. ప్రామిసింగ్ చిత్రంగా రాహుల్ రవీంద్రన్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. షూటింగ్ పూర్తయ్యింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటోంది. మే 11న చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని అన్నారు. వెన్నెల కిషోర్, రోహిణి, అనుహాసన్, రాహుల్ రామకృష్ణ, జయప్రకాష్, విద్యుల్లేఖ, సంజయ్ స్వరూప్, హరీష్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఎం.సుకుమార్, సంగీతం: ప్రశాంత్ ఆర్.విహారి, ఎడిటర్: ఛోటా కె ప్రసాద్.

స్ఫూర్తిదాయక కార్యక్రమం..


కాదంబరి కిరణ్, తమన్నా

'పరిశ్రమలో అండలేని వాళ్ళను ఆదుకునేందుకు 'మనంసైతం' లాంటి సంస్థను ప్రారంభించడం, వందలాది మందికి సహాయం అందించడం గొప్ప విషయం' అని తమన్నా అన్నారు. నటుడు కాదంబరి కిరణ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న 'మనంసైతం' సంస్థ తయారు చేసిన టీ షర్ట్‌ను తమన్నా శనివారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యక్రమాలను, కాదంబరి కిరణ్‌ను ఆమె అభినందించారు. 'మనం సైతం కార్యక్రమాల గురించి తెలుసుకున్నా. ఎంతో మంది పేదవాళ్లను ఆదుకుంటోంది. ఈ సంస్థ సేవా కార్యక్రమాల్లో నేను కూడా భాగస్వామి అవుతాను. ఇండస్ట్రీలో ఇరవై నాలుగు విభాగాల కార్మికులకు ఈ సంస్థ అండగా నిలవడం సంతోషంగా ఉంది. ఇదొక స్ఫూర్తిదాయక గొప్ప కార్యక్రమం' అని తమన్నా అన్నారు. 'మనంసైతం' కార్యక్రమాలను విస్తృతం చేయడమే మా ముందున్న లక్ష్యం. దీని వల్ల ఎక్కువ మందికి సేవ చేసే అవకాశం లభిస్తుంది. తమన్నా వంటి స్టార్ హీరోయిన్ మా కార్యక్రమాలకు చేయూతనివ్వడం ఆనందంగా ఉంది. ఇందులో భాగస్వామినవుతాననడం ఎంతో బలాన్ని, శక్తినిచ్చింది. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని మరికొంత మంది తమ చేయూతనిస్తారని ఆశిస్తున్నాం. ఈ సందర్భంగా మా సంస్థ ద్వారా తమన్నాకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నా' అని కాదంబరి కిరణ్ తెలిపారు.

వెండితెర ఉద్దమ్ సింగ్..!

బయోపిక్‌ల జోరు బాలీవుడ్‌లో రెట్టింపు ఉత్సాహంతో కొనసాగుతోంది. ప్రముఖుల జీవితాలను తెరపై చూసేందుకు ప్రేక్షకులూ ఆసక్తి చూపుతుండటం, ఆయా చిత్రాలు కమర్షియల్‌గానూ బాగా వర్కౌట్ అవుతున్న నేపథ్యంలో బయోపిక్ చిత్రాల నిర్మాణం పెరగటం విశేషం. తాజాగా బాలీవుడ్‌లో మరో బయోపిక్ తెరపైకి రాబోతున్నట్టు సమాచారం. స్వాతంత్ర్య సమరయోధుడు ఉద్దమ్ సింగ్ జీవితాన్ని తెరపై ఆవిష్కరించేందుకు దర్శకుడు సూజిత్ సర్కార్ ప్లాన్ చేస్తున్నారట. ఇందులో ఉద్దమ్ సింగ్ పాత్రలో రణబీర్ కపూర్‌ను నటించనున్నట్టు తెలుస్తోంది. 1919లో ఏప్రిల్ 13న అమృత్ సర్ స్వర్ణదేవాలయం సమీపంలో ఉన్న జలియన్ వాలా బాగ్ దురంతంలోని తోటలో 20వేల మంది స్వాతంత్ర సమరయోధులు సమావేశమయ్యారు. ఆ విషయం తెలుసుకున్న పంజాబ్ జనరల్ డయ్యర్ వారిపై విచక్షణా రహితంగా కాల్పులు జరపడంతో దాదాపు 3వేల మంది చనిపోయారు. ఈ ఘటనకు చలించిపోయిన ఉద్దమ్ సింగ్ 1940, మార్చి 13న డయ్యర్‌ను కాల్చి చంపేశాడు. దీంతో జూలై 31న ఉద్దమ్‌ను బ్రిటీష్ ప్రభుత్వం ఉరి తీసింది. సూజిత్ సర్కార్ ప్రస్తుతం 'అక్టోబర్' సినిమాను రూపొందిస్తున్నారు. ఇది ఏప్రిల్ 13న విడుదల కానుంది. రణ్‌బీర్ ప్రస్తుతం 'సంజు', 'బ్రహ్మాస్త్ర' చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు.


రణ్‌బీర్ కపూర్


దామోదర ప్రసాద్, గణేష్‌రాజ్, తరుణ్, గురురాజ్, పద్మరాజ్, ఏ.వి.ఎస్.రాజు

ఆనందం పాటల సందడి

నివిన్ పాల్ అతిథి పాత్రలో, అరుణ్ కురియన్, థామస్ మాథ్యూ, రోషన్ మాథ్యూ, విశాక్ నాయర్, అన్ను ఆంటోని ప్రధాన పాత్రధారులుగా గణేష్ రాజ్ దర్శకత్వంలో మలయాళంలో రూపొంది ఘన విజయం సాధించిన సినిమా 'ఆనందం'. ఈ సినిమాను అదే పేరుతో సుఖీభవ మూవీస్ పతాకంపై ఎత్తరి గురురాజ్ తెలుగులో విడుదల చేస్తున్నారు. సచిన్ వారియర్ సంగీతం అందించిన ఈ చిత్ర తెలుగు ఆడియో విడుదల కార్యక్రమం శనివారం హైదరాబాద్‌లో జరిగింది. అతిథులుగా విచ్చేసిన దామోదరప్రసాద్ బ్యానర్ లోగోను, పద్మరాజు చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దామోదర ప్రసాద్ మాట్లాడుతూ, సీతారామరాజు నాకు ఈ సినిమా చూపించారు. చాలా ఫ్రెష్‌గా ఉంది. ఇంజనీరింగ్ కుర్రాళ్ళ జర్నీని తెలుపుతుంది. యూత్‌తోపాటు ఫ్యామిలీ ఆడియెన్స్‌కు, అన్ని వర్గాలకు కనెక్ట్ అవుతుంది. ఎమోషన్ ఆకట్టుకుంటాయి. దర్శకుడు గణేష్ అత్యద్భుతంగా తెరకెక్కించారు. తెలుగు ఆడియెన్స్ ఆదరిస్తారని నమ్ముతున్నా' అని అన్నారు. హీరో తరుణ్ చెబుతూ, 'ట్రైలర్, సినిమా చాలా ఫ్రెష్‌గా ఉంది. యూత్‌తోపాటు పెద్ద వాళ్ళను కూడా అలరించే చిత్రమవుతుంది' అని చెప్పారు. 'ఈ కథపై ఆరేండ్లు వర్క్ చేశా. కొత్తవాళ్ళతో సినిమా చేయడం రిస్క్ అయినా కష్టపడి చేశాం. 2016లో విడుదలైన ఈ సినిమా మలయాళంలో వంద రోజులు ఆడటంతోపాటు 20కోట్లు కలెక్ట్ చేసింది. ఇది తెలుగులో రావడం ఆనందంగా ఉంది. కథ యూనివర్సల్ థీమ్‌తో కూడుకున్నది. అందరికీ కనెక్ట్ అవుతుంది. తెలుగులో వచ్చిన 'హ్యాపీడేస్' చూశా. ఇలాంటి సినిమా మలయాళంలో కూడా చేయాలని చేశా. తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకునే సినిమా అవుతుంది' అని దర్శకుడు గణేష్ రాజ్ అన్నారు. 'ఈ మలయాళ సినిమాను తెలుగులో విడుదల చేయమని మా పిల్లలు కోరడంతో విడుదల చేస్తున్నా. సచిన్ మంచి మ్యూజిక్ అందించారు. పాటలు అలరిస్తాయి. సినిమా కోసం ప్రేక్షకులు ఎంత ఆనందంతో థియేటర్‌కి వస్తారో అంతే ఆనందంతో తిరిగి వెళతారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి సినిమాను ఈ నెల 23న విడుదల చేస్తున్నాం. తమ కాలేజ్ రోజులను గుర్తు చేస్తూ ఊహల్లో విహరింపచేస్తుంది' అని నిర్మాత గురురాజ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏ.వి.ఎస్.రాజు, సీతారామరాజు తదితరులు పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.


నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక



నేనే రాజు...నేనే మంత్రి

- ప్రధాన ప్రతిపక్షం లేకుండానే
- తెలుగు రాష్ట్రాల అసెంబ్లీ సమావేశాలు

ప్రశ్నించే గొంతు లేకుండా చేయటమే ప్రస్తుత పాలకుల అభిమతంగా కనిపిస్తున్నది. అధికార పక్షంతో పాటూ క్రియాశీల ప్రతిపక్షం ఉంటేనే చట్టసభల్లో అర్థవంతమైన చర్చలు జరుగుతాయనే ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఇప్పుడు పాలక ప్రతిపక్షాలు వ్యవహరిస్తున్నాయి. ఏపీ తెలంగాణ రాష్ట్రాలు దీనికి తాజా ఉదాహరణ అని చెప్పవచ్చు. ప్రతిపక్షం ఏది మాట్లాడినా వారిపై వ్యక్తిగత విమర్శలు చేయటం, అధికార పక్షమే సంయమనం పాటించకుండా ఎదురుదాడికి దిగడం రెండు రాష్ట్రాల్లో సర్వసాధారణమై పోయింది. ఈ విషయంలో ఇద్దరు చంద్రుల ఆలోచనా ధోరణి ఒకేలా ఉన్నదని రాజకీయ పరిశీలకులంటున్నారు.



(ఫైల్)

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో ప్రధాన ప్రతిపక్షం లేకుండా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయి. తెలంగాణ అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగించే సమయంలో నిరసన వ్యక్తం చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ప్రస్తుత సమావేశ కాలం వరకూ సస్పెండ్ చేయగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్‌లు కౌన్సిల్ చైర్మన్ స్వామిగౌడ్‌ను గాయపరచారని వారి శాసన సభ్యత్వాలను రద్దు చేస్తూ స్పీకర్ అసాధారణ నిర్ణయం తీసుకున్నారు. ఏపీలో కూడా గత సంవత్సరం నుంచీ అసెంబ్లీ సమావేశాలకు ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ సభ్యులు హాజరు కావటం లేదు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై స్పీకర్ చర్యలు తీసుకోవటం లేదనే కారణంతో వారు అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించారు. అధికార పక్షంతో పాటూ ప్రతిపక్షం ఉంటేనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అభిప్రాయ పడ్డారు. పైకి చెప్తున్న కారణాలేవైనప్పటికీ ప్రతిపక్షం ఉంటే ప్రజా సమస్యలపై అధికార పక్షాన్ని నిలదీస్తుందనే భయంతో రెండు రాష్ట్రాల్లోనూ వారిని లేకుండా చేసినట్టు స్పష్టమవుతున్నది. కేవలం ఏడాది కాలంలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న తరుణంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే అవకాశం ఉన్నదనే భయంతోనే ప్రధాన ప్రతిపక్షం లేకుండానే రెండు రాష్ట్రాల్లో బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రజా సమస్యలపై అధికార పార్టీ శాసన సభ్యులు మాట్లాడే అవకాశం లేదు. ఏపీ విషయానికి వస్తే ప్రత్యేక హోదా, రాజధాని నిర్మాణం. పోలవరం ప్రాజెక్టు వంటి అంశాలు ఎజెండాగా మారాయి. ఈ అంశాలపై ప్రతిపక్షం నిలదీస్తే తట్టుకునే పరిస్థితి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేదు. ఏపీలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న వైసీపీతో పాటూ మొన్నటి వరకూ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న బీజేపీ కూడా ఇప్పుడు ప్రతిపక్ష పాత్ర నిర్వహిస్తున్నది. అయితే వారి సంఖ్యాబలం తక్కువ కావటంతో అధికార తెలుగుదేశం పార్టీ పెద్దగా భయపడటం లేదు. ఎన్డీఏ ప్రభుత్వం నుంచి కేంద్ర మంత్రులు రాజీనామా చేసిన తర్వాత ఏపీ అసెంబ్లీలో చంద్రబాబు గద్గధ స్వరంతో మాట్లాడారు. మరోవైపు వైసీపీ కేంద్రంలోని ఎన్డీఏలో చేరుతుందనే ప్రచారం కూడా తెలుగుదేశం శాసనసభ్యులే చేస్తున్నారు. సీఎం చంద్రబాబు స్వయంగా ఇటువంటి ఆరోపణలు చేశారు. ప్రధాన మంత్రి కార్యాలయంతో వైయస్ జగన్ సంప్రదింపులు జరుపుతున్నారని కూడా చెప్పారు. తెలంగాణలో కూడా ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ లేకపోవటంతో బీజేపీ, తెలుగుదేశం, సీపీఐ (యం) సభ్యులు మాత్రమే ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నారు. వీరి సంఖ్యాబలం కేవలం ఎనిమిది మాత్రమే. రైతుల ఆత్మహత్యలు, ప్రాజెక్టుల రీడిజైన్, వ్యవసాయోత్పత్తుల గిట్టుబాటు ధరలు, ఫీజుల రీఇంబర్స్‌మెంట్, డబుల్ బెడ్‌రూం ఇండ్లు వంటి ప్రధాన అంశాలపై ప్రధాన ప్రతిపక్షం నిలదీస్తుందనే భయంతోనే ముఖ్యమంత్రి వారిని బయటికి పంపినట్టు రాజకీయ పరిశీలకులంటున్నారు. ప్రధాన సమస్యల నుంచి తప్పించుకునేందుకే ఏపీ, తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో వాయిదా తీర్మానాలను అనుమతించవద్దనే నిర్ణయం తీసుకున్నారు. ఆత్మస్తుతి, పరనిందతో కాలం గడుపుతున్న ఇద్దరు ముఖ్యమంత్రులకూ ప్రశ్నించే వారంటే గిట్టరనే చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతున్నది. ప్రధాన ప్రతిపక్షం విషయంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌ల ధోరణి ఒకే విధంగా ఉన్నదని తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

పీఈటీ వేధింపులతో విద్యార్థిని ఆత్మహత్య

నవతెలంగాణ-మొయినాబాద్‌రూరల్

పీఈటీ వేధింపులు తాళలేక విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పీఈటీని శిక్షించాలని డిమాండ్ చేస్తూ బంధువులు పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. పాఠశాలపై దాడికి యత్నించారు. పోలీసులు అక్కడికి చేరుకుని న్యాయం చేస్తామని హామీనివ్వడంతో బంధువులు ఆందోళన విరమించారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిలుకూరు గ్రామంలో శనివారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుమ్మరి యాదయ్య కుమార్తె తేజస్విని (15) స్థానిక శివసాయి ఇంటర్ నేషనల్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నది. అదే పాఠశాలలో పీఈటీగా పని చేస్తున్న ప్రశాంత్ ఆరు నెలలుగా తేజస్వినిని వేధిస్తున్నాడు. వారం నుంచి వేధింపులు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో శనివారం ఉదయం తేజస్విని ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. తేజస్విని మృతికి పీఈటీ కారణమని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు పాఠశాల ఎదుట మృతదేహంతో ఆందోళన నిర్వహించారు. పాఠశాలపై దాడి చేసేందుకు యత్నించారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని పోలీసులు చెప్పడంతో ఆందోళన విరమించారు. పీఈటీని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

నెల రోజుల్లో కొత్త పార్టీ : కోదండరామ్

- భారీ చేరికలుంటాయి
- కరవు నివారణా చర్యలను పెడచెవిన పెట్టిన ప్రభుత్వం :ప్రొఫెసర్ కోదండరామ్

నవతెలంగాణ-నయాబజార్

నెల రోజుల్లో కొత్త పార్టీని ప్రకటించనున్నట్టు పొలిటికల్ జేఏసీ చైర్మెన్ ప్రొఫెసర్ కోదండరామ్ చెప్పారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రెండ్రోజుల పర్యటనలో భాగంగా శనివారం రాత్రి ఖమ్మంలోని ఓ ప్రయివేటు హోటల్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటైన దగ్గర్నుంచి అభివృద్ధి కోసం పొలిటికల్ జేఏసీ పోరాడిందన్నారు. కరువు నివారణా చర్యలు, వ్యవసాయాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, నిరుద్యోగ సమస్య పట్ల సూచనలు చేస్తున్నా ప్రభుత్వం పెడచెవిన పెడుతోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికగా ఉన్న హైదరాబాద్‌లో ధర్నాచౌక్‌ను మూసేయడంతో పాటు, తమను గ్రామాల్లో తిరగనీయకుండా ప్రభుత్వం నిర్బంధం విధిస్తోందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జేఏసీ రాజకీయ పార్టీగా ఆవిర్భవించి తెలంగాణ అభివృద్ధికి కృషి చేయనున్నట్టు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రమంతా తిరిగి అన్ని వర్గాల అభిప్రాయాలు సేకరించామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం వద్ద పార్టీ ఏర్పాటుకు దరఖాస్తు చేస్తున్నామని, సాంకేతికంగా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని అన్నారు. మరో నెల రోజుల్లో పార్టీ ఏర్పాటు, పేరు, విధివిధానాలను ప్రకటిస్తామన్నారు. కొత్తగా ఏర్పాటు కానున్న తమ పార్టీలోకి భారీగా చేరికలుంటాయన్నారు. తమకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్, డాక్టర్ జయప్రకాశ్ నారాయణ వంటి మహనీయులే ఆదర్శమన్నారు. ప్రస్తుతానికి ఏ పార్టీతోనూ కలిసి పోటీచేసే ఆలోచన లేదని, ముందు విధానాలు, నిర్మాణాలు చేసుకునే ఆలోచనలో ఉన్నామని అన్నారు. ఆయన వెంట టీజేఏసీ ఖమ్మం జిల్లా చైర్మెన్ డాక్టర్ శీలం పాపారావు, మాజీ ఎమ్మెల్సీ కె. దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

హెచ్‌సీయూ విద్యార్థిని పట్ల అసభ్య ప్రవర్తన

- నలుగురు అరెస్ట్ : వివరాలు వెల్లడించిన డీసీపీ

నవతెలంగాణ-గచ్చిబౌలి

హెచ్‌సీయూ విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన నలుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగింది. డీసీపీ విశ్వప్రసాద్ శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించి కేసు వివరాలు వెల్లడించారు. హెచ్‌సీయూలో ఐఎంఏ (ఎకనామిక్స్) చదువుతూ సౌత్ క్యాంపస్‌లోని లేడీస్ హాస్టల్‌లో ఉంటున్న ఓ విద్యార్థిని శుక్రవారం సాయంత్రం తన క్లాస్‌మెట్‌తో కలిసి యూనివర్శిటీలోని చిన్నచెరువు వద్దకు వెళ్లింది. ఆ సమయంలో నల్లగండ్ల, గుల్‌మోహర్‌పార్కు, హుడా కాలనీలకు చెందిన నలుగురు యువకులు అక్కడికి వచ్చి వారి వద్ద ఉన్న డబ్బులు, సెల్‌ఫోన్ ఇవ్వాలని బెదిరించారు. దీంతో వారు తమ వద్ద ఉన్న రూ.150 ఇచ్చేశారు. ఆ తర్వాత విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు. మరో విద్యార్థి ఆ నలుగుర్ని ఎదురించి, విద్యార్థినికి పారిపోవాలని సూచించాడు. ఆమె వెంటనే తన స్నేహితులకు సమాచారం అందించింది. వారు రావడాన్ని గమనించిన దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు క్రైం పోలీసులు రంగంలోకి దిగి నిందితులను అరెస్టు చేశారు. వారిపై 376(డి), 394 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

తడిపేసింది..రాల్చేసింది

- అకాల వర్షంతో మిరప రైతులకు అపార నష్టం
- కల్లాల్లో, మార్కెట్లో తడిసిన పంటలు
- పలుచోట్ల రాలిన మామిడి.. నేలకొరిగిన మొక్కజొన్న

నవతెలంగాణ-యంత్రాంగం

శుక్రవారం రాత్రి, శనివారం పలుచోట్ల కురిసిన అకాల వర్షం రైతన్నలకు అపార నష్టాన్ని చేకూర్చింది. మార్కెట్లల్లో, కల్లాల్లో ఉంచిన మిర్చి పంట వర్షానికి తడిసిపోయింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్‌లో శుక్రవారం రాత్రి పిడుగుపడి పల్లె లింగంగౌడ్‌కు చెందిన పాడి ఆవు, దూడ మృత్యువాత పడ్డాయి. అదే విధంగా భారీ వర్షం కురవడంతో ఇదే మండలం రాంనుంతల పెద్దతాండాకు చెందిన లాలూనాయక్ అనే రైతుకు చెందిన టమాట తోట పూర్తిగా నేలమట్టమైంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మిర్చి, మొక్కజొన్న, మామిడి రైతులకు నష్టం వాటిల్లింది. సుమారు ఐదువందల ఎకరాల్లో మొక్కజొన్న పంట నేలకొరిగినట్టు, రెండు వందల క్వింటాళ్లకుపైగా మిర్చి తడిసి నష్టం వాటిల్లినట్టు అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. అరటి, మామిడి, బొప్పాయి పంటలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. అశ్వారావుపేట, సత్తుపల్లి, కొత్తగూడెం, భద్రాచలం డివిజన్లలో మామిడి తోటల్లోని పూత, పిందెలు రాలిపోయాయి. కొణిజర్ల, రఘునాథపాలెం, చింతకాని, బోనకల్, ఖమ్మం రూరల్, కూసుమంచి, వైరా, తల్లాడ, కల్లూరు, సత్తుపల్లి, మధిర, కామేపల్లి, కారేపల్లిలలో వర్షం ఎక్కువ పడింది. భద్రాద్రి జిల్లాలో చండ్రుగొండ, కొత్తగూడెం, జూలూరుపాడు, పాల్వంచ, తదితర మండలాల్లో కల్లాల్లోని మిర్చి తడిసిపోయింది. రాత్రివేళ వర్షం రావడంతో రైతులు ఇంటివద్దనుండి కల్లాల దగ్గరికి వెళ్లేసరికే మిర్చి తడిసిపోయింది. మొక్కజొన్న పంట నేలకొరింది. దీంతో తీవ్ర నష్టం వాటిల్లింది. ఖమ్మంలో భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమైనాయి. వర్షపునీరు రోడ్లపై భారీగా ప్రవహించింది. మహబూబాబాద్ జిల్లాలోని బయ్యారం, గార్ల మండలాల్లో వర్షం వల్ల మిర్చి, పత్తి, మొక్కజొన్న పొలాలు దెబ్బ తిన్నాయి. బయ్యారం మండలంలో మిర్చి కోతలు కోసి, ఆరబోసిన రైతాంగానికి క్షణాల్లో వర్షం రావడంతో మిర్చి తడిచిపోయింది. గార్లలో మండల పరిధిలోని పినిరెడ్డిగూడెం, సీతంపేట, రాంపురం, మద్దివంచ, పుల్లూరు, మర్రిగూడెం, బుద్దారం, వెంకటాపురం, పోచారం, గోపాలపురం, ముల్కనూరు, చిన్న, పెద్దకిష్టాపురం, సత్యనారాయణపురం గ్రామాల్లో రెండు వందల క్వింటాళ్లకు పైగా కల్లాల్లో ఆరబోసిన మిర్చి తడిసి పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో పలుచోట్ల మార్కెట్లలో వేరుశనగ పంట తడిసిపోయింది.

నిద్ర కరువు

మొదటిపేజీ తరువాయి

అభిప్రాయపడగా, ఓవర్ నైట్ డ్యూటీ వల్ల నిద్రకు దూరం అవుతున్నామని 19శాతం మంది పేర్కొన్నారు. ఆఫీసు సంబంధిత ఒత్తిళ్ళ మూలంగా నిద్ర పట్టడం లేదని 58శాతం మంది తెలిపారు. వివిధ సాధనాల (మందులు, మ్యూజిక్ వగైరా) ద్వారా నిద్రను బలవంతంగా తెచ్చుకుంటున్నట్టు 45శాతం మంది ఇండియన్స్ చెప్పడం విస్తుగొలుపుతోంది. 'ఆరోగ్యం బాగుండాలంటే, వ్యాయామం చేస్తే సరిపోతుంది. నిద్రతో పనిలేద'ని సర్వేలో పాల్గొన్న సుమారు 66శాతం మంది చెప్పడాన్ని చూసిన సర్వే ప్రతినిధులు.. "మనిషి జీవితంలో నిద్రకు ఉన్న ప్రాముఖ్యత ఏంటో ఈ తరానికి అవగాహన లేద"ని వాపోవడం గమనార్హం.

మరణాలకూ కారణం:

మనిషికి మంచి తిండి ఎంత అవసరమో, సుఖమైన నిద్ర కూడా అంతే అవసరం. అత్యాధునిక జీవన విధానంవైపు పరుగులు పెడుతున్న ప్రతి మనిషి ఎంత పని ఉన్నా.. రోజుకు తప్పకుండా ఏడెనిమిది గంటలు నిద్రపోవాలని వైద్యులు సెలవిస్తున్నారు. మనిషికి కావలసినంత నిద్రలేకపోవడం వల్లే చిరాకు, అసహనంతో కూడిన ఒత్తిడి, నిరుత్సాహం, ఏకాగ్రత మందగించడం వంటి దుష్పరిణామాలు ఏర్పడుతున్నాయని, నిద్రలేమి మూలంగా తలనొప్పి మొదలై క్రమంగా జ్ఞాపకశక్తి లోపించే అవకాశం కూడా ఉన్నదని వివిధ పరిశోధనల్లో తేలింది. అంతేనా, నిద్రలేమి మూలంగా నరాలకు సంబంధించిన వ్యాధులు, మైగ్రేన్ వంటి నొప్పులు, అధిక బరువు, గ్యాస్ట్రిక్ వంటి అజీర్తి బాధలు వస్తాయని ఢిల్లీని ఎయిమ్స్ సంస్థ నిర్వహించిన సర్వేలో సైతం వెల్లడైంది. ముఖ్యంగా, భారతదేశంలో 70 శాతం మంది నిద్రలేమితో బాధపడుతున్నారని వీరిలో ఎక్కువ శాతం యువతేనని తేలడం ఆందోళన కలిగిస్తోంది. నిద్రలేమి వల్ల అనారోగ్య సమస్యలతో పాటు మరణరేటు సైతం పెరిగే అవకాశం ఎక్కువగా ఉన్నట్టు రూఢీ అయింది. రోజుకు ఏడు గంటలు మించి నిద్రపోయే వారితో పోలిస్తే, ఆరు గంటలకన్నా తక్కువ నిద్రపోయేవారిలో 15శాతం మరణరేటు ఎక్కువగా ఉన్నదని నిపుణులు పేర్కొంటున్నారు.



మానసిక ప్రశాంతతకు, రోగాల నుంచి కాపాడుటకు కమ్మటి నిద్రను మించిన మంచి ఔషధం లేదంటారు. సరైన తిండి, వ్యాయామం ఎంతున్నా.. మనిషికి ప్రశాంతమైన నిద్ర కూడా కావాలని నేటి తరం గుర్తించడం ఇప్పుడు ఎంతైనా అవసరం.

నిద్ర - ఆసక్తికర అంశాలు :

ః తెల్లవారుజామున వచ్చిన కలలు నిజమవుతాయని అనుకుంటారు. ఇది పచ్చి అబద్ధం. వేకువజామున ప్రతీ ఒక్కరూ 'రెమ్' నిద్ర (కలలు గుర్తుండే సమయంలోని నిద్ర) లో ఉండటం వల్ల వచ్చిన కలలు గుర్తుండి.. మరునాడు యాధృచ్ఛికంగా ఎక్కడో ఓ దగ్గర ఆ కలలు సింక్ అవ్వడం వల్ల.. డ్రీమ్స్ నిజమయ్యాయని అపోహ పడతాం. అంతే!

ః గ్రామాలతో పోలిస్తే, పట్టణ ప్రాంతాల్లో నివసించే వారికే నిద్రలేమి సమస్యలు ఎక్కువట! పట్టణాల్లో నివసించే దాదాపు 93శాతం మంది నిద్ర సమస్యలతో బాధపడుతున్నారని అంచనా!

ః నిద్రలేమి వల్ల పిల్లల్లో పెంకితనం పెరుగుతూ, ఎదుగుదల (శారీరకంగా, మానసికంగా) తగ్గే అవకాశమున్నట్టు ఇటీవలి ఓ సర్వేలో తేలింది.

వికలాంగులకు తీరని అన్యాయం : ముత్తినేని వీరయ్య

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



రాష్ట్ర బడ్జెట్‌లో వికలాంగుల అంశమే లేకపోవడంతో ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు వారికి తీరని అన్యాయం చేశారని టీపీసీసీ వికలాంగుల విభాగం చైర్మెన్ ముత్తినేని వీరయ్య పేర్కొన్నారు. ఇది హక్కుల ఉల్లంఘన అని, వికలాంగుల హక్కుల చట్టం-2016 ప్రకారము 5 శాతం బడ్జెట్ కేటాయించాలని తెలిపారు. శనివారం ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ బడ్జెట్ రూ 1,74,453 కోట్లలో 5శాతమంటే రూ 8722.65కోట్లు వికలాంగులకు కేటాయించాలన్నారు. శిశు సంక్షేమశాఖకు రూ 1799కోట్లు మాత్రమే కేటాయించి, ఇక్కడ వికలాంగులు అనే పదాన్ని వాడకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. పక్క రాష్ట్రంలో వికలాంగులకు రూ 130 కోట్లు కేటాయించిందన్నారు. బడ్జెట్ కేటాయించకుండా ప్రభుత్వం వికలాంగులకు కించపరచడమంటే జాతీయతను కించపరిచినట్లేనన్నారు. గవర్నర్ కల్పించుకొని ఈ ప్రభుత్వం మీద వికలాంగుల హక్కుల చట్టం క్రింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై కేంద్ర వికలాంగుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని ఆయన పేర్కొన్నారు.

మంత్రే కమీషన్ తీసుకోమన్నడు

- కాంట్రాక్టర్ల నుంచి రెండు శాతం తీసుకుంటం
- రాష్ట్రమంతా ఇదే నడుస్తాంది

నవతెలంగాణ-సిరిసిల్ల



'లక్షలు ఖర్చు చేసి కౌన్సిలర్లుగా గెలిచినం. దాన్ని తిరిగి సంపాదించాలంటే కాంట్రాక్టర్ల వద్ద వసూలు చేయాల్సిందే. పనుల్లో 2 శాతం కమీషన్ తీసుకోవాలని మా మంత్రిగారే చెప్పిండ్రు. రాష్ట్రమంతా ఇదే నడుస్తాంది' అంటూ రాజన్నసిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ సామల పావని చెప్పుకొచ్చారు. జిల్లా కేంద్రంలోని పురపాలక భవనంలో శనివారం మున్సిపల్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన అనంతరం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 'కాంట్రాక్టర్ల వద్ద బలవంతపు వసూళ్లు చేస్తున్నారెందుకు..?' అంటూ ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ఆమె బదులిచ్చారు. అన్ని వార్డుల కౌన్సిలర్లూ తమ ప్రాంతాల్లోని అభివృద్ధి పనుల్లో కమీషన్ తీసుకుంటున్నారని చెప్పారు. తానూ ఒకటి, రెండు శాతం కమీషన్ తీసుకుంటున్నట్టు తెలిపారు. వేరేచోట్ల మూడు, నాలుగుశాతం తీసుకుంటున్నారని, తామే తక్కువగా తీసుకుంటున్నామని ఆవేదన వెలిబుచ్చారు. మరో అడుగు ముందుకేసి 'నేను రాజకీయం మాత్రమే చేస్తాను. మా సారు వసూలు చేస్తాడు' అంటూ సమాధానమిచ్చారు. సిరిసిల్లలోనే కాదు.. రాష్ట్రమంతా ఇదే వ్యవహారం నడుస్తోందంటూ బాహాటంగానే తమ అవినీతి రాజకీయాన్ని చెప్పిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.


వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నా : పావని

తాను వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్టు రాజన్నసిరిసిల్ల జిల్లా మున్సిపల్ చైర్‌పర్సన్ సామల పావని శనివారం రాత్రి ప్రకటించారు. తన రాజీనామా పత్రాన్ని మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు. సిరిసిల్ల పట్టణాభివృద్ధిలో తనను భాగస్వాములను చేసి సహకరించిన మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాజీనామా కంటే ముందు మున్సిపల్ బడ్జెట్ సమావేశం సందర్భంగా కాంట్రాక్టర్ల వద్ద తాను బహిరంగంగా కమీషన్లు తీసుకున్నానని, అందుకు మంత్రి కేటీఆర్ కూడా అనుమతించారని బాహాటంగా చెప్పిన విషయం తెలిసిందే. దీనిపై మంత్రి నుంచి చివాట్లు ఎదురుకావటంతో పావని రాజీనామా చేసినట్టు ప్రచారం జరుగుతున్నది.

పేపర్ రేట్లకే కోళ్లను విక్రయించాలి

బ్రాయిలర్ రైతుల ధర్నా

నవ తెలంగాణ-సూర్యాపేట



పత్రికల్లో ట్రేడర్స్ ఇస్తున్న ధరలకు విరుద్ధంగా సుగుణ కార్పొరేట్ కంపెనీ తక్కువ ధరలకు కోళ్లను విక్రయించడం వల్ల బ్రాయిలర్ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని బ్రాయిలర్ రైతుల సంఘం నల్లగొండ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సిహెచ్.యాదగిరి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సుగుణ కార్పొరేట్ కంపెనీ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పత్రికల్లో ట్రేడర్స్ ఏ ధర ప్రకటిస్తే ఆ ధరకే బిల్లు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కోడి పిల్లల రేట్లను తగ్గించాలన్నారు. రైతులు కోళ్ల ఫారాలు పెట్టుకొని జీవనం సాగిస్తున్నారని, ధరలు తగ్గించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని దృష్టిలో ఉంచుకొని బ్రాయిలర్ రైతులకు కనీస మద్దతు ధర కిలో 90 రూపాయలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. పేపర్ ధర కంటే అతితక్కువ ధరకు అమ్ముతున్న సుగుణ కంపెనీ ఆగడాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కుంభంపాటి కిరణ్, వెంకటరెడ్డి, రవి, జానయ్య, శ్రావన్‌కుమార్, శ్రీను, ఉదయ్, నయీంముద్దీన్ పాల్గొన్నారు.

ఎన్డీయే సర్కారుపై అవిశ్వాసానికి పూర్తి మద్దతు

సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో

న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక హోదా, ఇతర అంశాలపై ఇచ్చిన హామీలను అమలు చేయాలన్న డిమాండ్‌తో తెలుగుదేశం పార్టీ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలు ఎన్డీయే సర్కారుపై ప్రతిపా దిస్తున్న అవిశ్వాస తీర్మానానికి సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో పూర్తి మద్దతు ప్రకటించింది. ఈ నెల 16, 17 తేదీలలో ఇక్కడ జరిగిన పొలిట్‌బ్యూరోలో వివిధ అంశాలపై చర్చించినట్టు, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, ఇతర హామీలపై కొనసాగుతున్న ఉద్యమాన్ని తాము గట్టిగా సమర్థిస్తున్నామని పొలిట్‌బ్యూరో శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. విభజన చట్టం చేస్తున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీల అమలులో వెనక్కి తగ్గటం ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని పొలిట్‌బ్యూరో స్పష్టం చేసింది. అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగినపుడు అన్నిరంగాలలో ప్రభుత్వ వైఫల్యంతో పాటు, పార్లమెంటరీ జవాబుదారీ తనాన్ని తప్పించుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఎండగడతామని వివరించింది. లోక్‌సభ మొత్తం సభ్యుల సంఖ్యలో కనీసం 10 శాతం మంది మద్దతు వుంటే తీర్మానాన్ని చేపట్టేందుకు అంగీకరించాల్సి వుండగా లోక్‌సభ స్పీకర్ సభలో పరిస్థితి అదుపులో లేదంటూ సభను వాయిదా వేయటం శోచనీయమని పేర్కొంది. సభలో ఇదే పరిస్థితి కొనసాగుతున్న సమయంలో ప్రభుత్వం భారత స్థిరీకరణ నిధి నుంచి దాదాపు పదిలక్షల కోట్ల రూపాయల మేర సొమ్మును ఉపసంహరించుకునేందుకు ఉద్దేశించిన ఫైనాన్స్ బిల్లును సభ ఎలా ఆమోదించిందని ప్రశ్నించింది. సభా నిర్వహణలో బీజేపీ సర్కారు అనుసరిస్తున్న ద్వంద్వ ప్రమాణాలకు ఇది నిదర్శనంగా నిలుస్తోందని పొలిట్‌బ్యూరో వ్యాఖ్యానించింది. బీజేపీ సర్కారు అనుసరిస్తున్న ఈ ప్రజాస్వామ్య వ్యతిరేక వైఖరిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపింది.

మహారాష్ట్ర రైతులకు అభినందనలు

వ్యవసాయ రుణాల మాఫీ, మద్దతు ధర, పించన్, అటవీ హక్కుల చట్టం అమలు వంటి డిమాండ్లతో మహారాష్ట్ర ప్రభుత్వంపై జరిపిన పోరాటంలో విజయం సాధించిన ఆ రాష్ట్ర రైతులకు పొలిట్‌బ్యూరో అభినందనలు తెలియచేసింది. అఖిల భారత కిసాన్‌సభ సారథ్యంలో ఈ నెల 6న నాసిక్ నుంచి ముంబయి వరకూ రైతులు చేపట్టిన లాంగ్ మార్చ్ గొప్ప విజయం సాధించిందని అభిప్రాయపడింది. తొలుత 25 వేల మందితో ప్రారంభమైన ఈ లాంగ్ మార్చ్‌లో ఈ నెల 12న ముంబయి నగరానికి చేరుకునే సమయానికి 50 వేల మంది రైతులు జత కలిసారని వివరించింది. రైతులు భారీ సంఖ్యలో నిర్వహించిన ఈ మార్చ్ ఒత్తిడికి తలొగ్గిన మహారాష్ట్ర ప్రభుత్వం రైతుల డిమాండ్లను ఆమోదిస్తూ లిఖితపూర్వక హామీ ఇచ్చిందని తెలిపింది. ఇది దేశవ్యాప్తంగా ప్రభావాన్ని చూపుతుందని, రైతులకు ఇచ్చిన హామీలను నిర్దిష్ట కాలవ్యవధిలో నిలుపుకునేందుకు మహారాష్ట్ర సర్కారు ప్రయ త్నించాలని సూచించింది. రైతుల ఉద్యమానికి మహారాష్ట్రలోని అన్ని వర్గాల ప్రజలతోపాటు, రాజకీయ, సామాజిక వర్గాల నుంచి లభించిన విస్తృత మద్దతు పట్ల పొలిట్‌బ్యూరో హర్షం వ్యక్తం చేసింది.

త్రిపుర ఎన్నికలు

త్రిపుర శాసనసభకు ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై అందిన ప్రాథమిక నివేదికను తాము సమగ్రంగా పరిశీలించినట్టు పొలిట్‌బ్యూరో తన ప్రకటనలో వివరించింది. త్రిపురలో గత లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం ప్రజానుకూల కార్యక్రమాలను అమలు చేసేందుకు, రాష్ట్రంలో శాంతి, సామరస్యాలను కాపాడేందుకు తన శక్తివంచన లేకుండా ప్రయత్నించినప్పటికీ ఈ ఫలితాలు రావటం అనూహ్యమైన విషయమని అభిప్రాయపడింది. అయితే ప్రజల్లో పెరుగుతున్న ఆకాంక్షలను తీర్చటానికి అందుబాటులో వున్న పరిమిత వనరులతో లెఫ్ట్ ప్రభుత్వానికి కార్యాచరణ కష్టసాధ్యమైందని వ్యాఖ్యానించింది. ఈ ఎన్నికల్లో బిజెపితో జత కట్టి విజయం సాధించిన ఐపీఎఫ్టీ తమ విజయం ప్రత్యేక ఆదివాసీ రాష్ట్రం త్విప్రాలాండ్‌కు దారి తీస్తుందని చెబుతోందని, రాష్ట్రంలో అధికార మార్పిడికి బీజేపీ-ఐపీఎఫ్టీ కూటమి ఈ నినాదాన్ని నేర్పుగా వినియోగించుకున్నదని పొలిట్‌బ్యూరో అభిప్రాయపడింది. దీనితో పాటు ఈ ఎన్నికలను ప్రభావితం చేసేందుకు బీజేపీ ధన బలంతో పాటు ఇతర వనరులను కూడా భారీయెత్తున వినియోగించిందని, చివరకు గతంలో కాంగ్రెస్ పార్టీకి పోలైన లెఫ్ట్ వ్యతిరేక ఓట్లను కూడా బీజేపీ సమీకరించగలగడంతో లెఫ్ట్ ఫ్రంట్‌కు ఈ ఎన్నికల్లో ఎదురు దెబ్బతగిలిందని భావిస్తున్నట్టు వివరించింది. అయినా ఈ ఎన్నికల్లో లెఫ్ట్ ఫ్రంట్‌కు 45 శాతం ఓట్లు లభించగా, బీజేపీ-ఐపీఎఫ్టీ కూటమికి 50.5 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయని వివరించింది. కాగా ఎన్నికల అనంతరం బీజేపీ మూకలు రెచ్చిపోయి రాష్ట్రంలో కొనసాగిస్తున్న హింసాకాండను పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. వీరి హింసాకాండలో దాదాపు 750కి పైగా పార్టీ ఆఫీసులపై దాడి జరిగిందని, అనే కార్యాలయాలు దహనం చేయటం లేదా కూల్చివేయటం జరిగిందని వివరించింది. దాదాపు 742 మంది పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులపై భౌతిక దాడులు జరిగాయని, దాదాపు 1,829 ఇండ్లపై దాడులు చేసి లూటీ చేశారని, 217 ఇండ్లను తగులబెట్టారని తెలిపింది. పార్టీ సభ్యులు, మద్దతుదారులకు చెందిన 442 షాపులను దహనం చేసారని ఈ ప్రకటనలో పేర్కొంది. 35 రబ్బర్ ప్లాంటేషన్లను ధ్వంసం చేశారని, దాదాపు 230 మందికి పైగా ప్రజల దగ్గర అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని తెలిపింది. త్రిపుర ప్రజలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా దేశంలో అనేక ప్రాంతాలలో సంఘీభావ ప్రద ర్శనలు జరిగినట్టు వార్తలందుతున్నాయని పొలిట్‌బ్యూరో వెల్లడిస్తూ, త్రిపురలో ఆరెస్సెస్, బీజేపీ గూండాల దాడులకు గురవుతున్న కార్యకర్తలకు సంఘీభావంగా నిలవాలని పార్టీ యూనిట్లు, శ్రేణులకు పిలుపునిచ్చింది.

ఉప ఎన్నికల ఫలితాలు

యూపీ, బీహార్‌లలో జరిగిన లోక్‌సభ ఉప ఎన్నికల్లో బీజేపీ ఓటమి పాలు కావటం ఒక సానుకూల పరిణామమని పొలిట్‌బ్యూరో అభివర్ణించింది. యూపీలోని గోరఖ్‌పూర్, ఫూల్పూర్, బీహార్‌లోని అరారియా స్థానాలకు జరిగిన ఈ ఉప ఎన్నికలో సమాజ్‌వాది, ఆర్జేడీ అభ్యర్థులకు వామపక్షాలు మద్దతు ప్రకటించాయన్న పొలిట్‌బ్యూరో, బీజేపీని తిరస్కరించిన ఓటర్లకు అభినందనలు తెలియచేసింది. బీహార్‌లోని జెహానాబాద్ అసెంబ్లీ స్థానంలో సీపీఐఎంఎల్ అభ్యర్థికి సీపీఐ(ఎం) మద్దతునిచ్చినట్టు కూడా పొలిట్‌బ్యూరో తెలిపింది.

ఉన్నత విద్యపై దాడులు

బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ఉన్నత విద్యా సంస్థలు ముఖ్యంగా సెంట్రల్ యూనివర్సిటీలపై దాడులు పెరిగిపోయాయని పొలిట్‌బ్యూరో ఆందోళన వ్యక్తం చేసింది. ఉన్నత విద్యారంగంపై జరుగుతున్న ఈ దాడులన్నీ భారతీయ చరిత్రను హిందూ పుక్కిట పురాణాలతో నింపటంతో పాటు భారతీయ తత్వశాస్త్ర అధ్యయనాన్ని హిందూ వేదాంత శాస్త్రంగా మార్చే లక్ష్యంతోనే జరుగుత ఎన్నాయని విమర్శించింది. ఢిల్లీలోని జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ)లో వున్న ఆరెస్సెస్ అనుకూల వైస్ ఛాన్స్‌లర్ విద్యార్థుల ప్రజాతంత్ర హక్కులను అణచివేసేందుకు, వారి కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపేందుకు ప్రయత్నిస్తుండటం ప్రజాస్వామ్య వ్యతిరేకమని విమర్శించింది. యూనివర్సిటీ పాలనా యంత్రాంగం కొంతమంది డీన్‌లు, విభాగాది .పతులను తొలగించిందని, ఆరెస్సెస్‌కు చెందిన విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో జేఎన్‌యూ విద్యార్థుల ఉద్యమంపై దాడులు జరుగుతుండగా, ప్రగతిశీల బోధనా సిబ్బంది స్థానంలో హిందూ మత సిద్ధాంతాలను ప్రచారం చేసే వారిని నియమించారని పొలిట్ బ్యూరో విమర్శించింది. కొత్తగా నియమకాలు చేపట్టే పోస్టులకు సంబంధించి రిజర్వేషన్ రోస్టర్లలో న్యాయవ్యవస్థ సూచన ప్రకారం మార్పులు చేయాలంటూ యూజీసీ తాజాగా నోటిఫికేషన్ జారీ చేసిందని, ఇది రిజర్వేషన్ కేటగిరి నియామకాలకు తీవ్ర విఘాతం కలిగిస్తుందని తెలిపింది. దీనిపై రివ్యూ పిటిషన్ దాఖలు చేస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ ఇప్పటి వరకూ ఆ పని చేయలేదని పేర్కొంది. యూజీసీ జారీ చేసిన ఈ నోటిఫికేషన్‌ను నిలిపివేసి రిజర్వేషన్ పోస్టుల భర్తీ ప్రక్రియ సత్వరం చేపట్టాలని సూచించింది.

పార్టీ వ్యవస్థాగత నివేదిక

ఏప్రిల్ 18 నుంచి 22 వరకూ హైదరాబాద్‌లో జరగనున్న పార్టీ 22వ మహాసభలలో సమర్పించే పార్టీ వ్యవస్థాగత నివేదిక ముసాయిదాపై పొలిట్‌బ్యూరో సమగ్రంగా చర్చించింది. ఈ నెల 28, 29, 30 తేదీలలో జరిగే కేంద్ర కమిటీ సమావేశాలలో దీనిపై చర్చించి ఆమోదించిన అనంతరం మహాసభలలో ప్రవేశపెడతామని పొలిట్‌బ్యూరో తన ప్రకటనలో వివరించింది.

సెన్సెక్స్ ▼ 59	నిఫ్టీ ▼ 19	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)
33,777	10,444	64.11	రూ. 29,304	రూ. 40,200

శుక్రవారంమార్కెట్లు ముగిసే సమయానికి..



అసమానతలే అసలు సమస్య

- భారత్‌లో సంపద పంపిణి జరగట్లే..
- వృద్ధి సాధిస్తున్నా.. అందుకే ఇంకా పేదరికం
- అవినీతి ఆనవాళ్లు కొనసాగుతున్నాయి
- సేవల దన్నుతో వృద్ధి ఇండియా ప్రత్యేకత:

'రైజింగ్ ఇండియా' సదస్సులో నోబెల్ విజేత క్రూగ్‌మెన్



న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ అద్భుత పనితీరును కనబరుస్తూ వేగంగా ముందుకు సాగుతున్నప్పటికీ.. దేశంలో పెరుగుతోన్న ఆర్థిక అసమానతలు ఇంకా ఒక పెద్ద సమస్యగానే మిగిలిపోతోందని ప్రముఖ ఆర్థికవేత్త, నోబెల్ బహుమతి విజేత పాల్ క్రూగ్‌మెన్ అన్నారు. న్యూస్18 సంస్థ ఏర్పాటు చేసిన రైజింగ్ ఇండియా' సమిట్‌లో ఆయన మాట్లాడుతూ గడిచిన 30 ఏండ్లలో భారత ఆర్థిక వ్యవస్థ మేటిగా రాణిస్తూ ఎంతో పురోగమించిందని ఆయన వివరించారు. బ్రిటన్ 150 ఏండ్లలో సాధించినంత ప్రగతిని.. భారత్ గడిచిన 30 ఏండ్లలో సాధించి చూపిందని ఆయన అన్నారు. భారత్‌లో ఆర్థిక పరివర్తన చాలా వేగంగా జరుగుతూ వస్తోందని అయినా.. ఇక్కడ పెదరికం తాడవిస్తుండడం శోచనీయమని ఆయన వివరించారు. ఇందుకు ప్రధాన కారణంగా దేశంలో ఘననీయంగా సంపద సృష్టి జరగుతున్నా.. ఆది సమాజంలోని అన్ని వర్గాల వారికి సమానంగా పంపిణీ జరగకపోవడమే ఇందుకు కారణమని ఆయన విశ్లేషించారు.

అవినీతి సమస్యగానే ఉంది...

భారత్‌లో ఆధికారిక అడ్డంకులు కాస్త తగ్గి ఆర్థిక వ్యవస్థ దూసుకుపోతున్నప్పటికీ.. అవి పూర్తిగా సమిసిపోలేదని ఆయన అన్నారు. న్యూస్18 సంస్థ ఏర్పాటు చేసిన రైజింగ్ ఇండియా' సమిట్‌లో ఆయన మాట్లాడుతూ భారత్‌లో వినిమయ శక్తి అంతకంతకు పెరుగుతోందని.. ఫలితంగా ఇండియా ఆర్థిక వ్యవస్థ విస్తరిస్తూ పోతోందని అన్నారు. ఇప్పటికే భారత జపాన్ ఆర్థిక వ్యవస్థను దాటేసి అమెరికా, చైనా సరసనన నిలిచిందని పేర్కొన్నారు. ఐరోపా దేశాల్లోని ఆర్థిక వ్యవస్థల కంటే భారత్ పెద్ద ఆర్థిక శక్తిగా ఎదిగిందని ఆయన అన్నారు. సరైన సమయంలో భారత్‌లో సంస్కరణలు చేపట్టడం, పరిస్థితులకు అనుగుణంగా భారత్ అవకాశాలను చేజిక్కించుకోవడం వల్లే భారత్ నేడు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల సరసన చేరిందని ఆయన వివరించారు. భారత్‌లో అవినీతి ఇంకా సమస్యగానే ఉందని ఆయన వివరించారు.

మౌలిక సమస్య అలాగే ఉంది..

భారత్‌లో వ్యాపారానుకూల వాతావరణం తీసుకు రావడంతో ప్రపంచ వ్యాప్తంగా కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని పాల్ అన్నారు. సేవల ప్రపంచీకరణ నుంచి లబ్దిపొందే విషయంలో భారత్ ముందంజలో ఉందని ఆయన వివరించారు. సేవల రంగం దన్నుతో ఆర్థిక వ్యవస్థ ఇంత మెరుగైన పనితీరును కనబరచడం ప్రపంచంలో ఎక్కడా అగుపించలేదని ఆయన తెలిపారు. గ్లోబలైజేషన్ తరువాత క్రమంలో కూడా భారత్ ఇదే దూకుడుతూ ముందుకు సాగే అవకాశం ఉందని అన్నారు.

ఉద్యోగకల్పన లేకుంటే అంతా ఉత్తదే..

భారత ఆర్థిక వ్యవస్థ మిగతా ప్రపంచ దేశాలకంటే మేటిగా రాణిస్తూ ముందుకు సాగుతున్నప్పటికీ దేశంలో తగిన ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించే విషయంలో అశ్రద్ధ తగదని పాల్‌క్రూగ్‌మెన్ హెచ్చరించారు. ఎంతో మేటి వృద్ధిని అంచనా వేస్తున్నప్పటికీ తగిన ఉద్యోగ, ఉపాధికల్పన లేకుంటే స్థిరమైన వృద్ధి సాధించడం కష్టమేనని ఆయన అన్నారు. ఉద్యోగ కల్పన లేనిది ఎంత వృద్ధి సాధించినా అది ఎక్కువ కాలం నిలవజాలదని ఆయన విశ్లేషించారు. కావున విధాన నిర్ణేతలు, పాలకులు ఈ దిశగా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.

హలో.. బిల్లులు తగ్గకపోవచ్చు!



ముంబయి: దేశీయ టెలికాం మార్కెట్‌లోకి రిలయన్స్ జియో ఎంట్రీ తరువాత మొబైల్ ఫోన్ బిల్లుల భారం గణనీయంగా తగ్గిన విషయం తెలిసిందే. ముఖ్యంగా గత ఆరు నెలల్లో సగటు నెలవారీ మొబైల్ బిల్లులు సగటున 30నుంచి 40శాతం మేర దిగివచ్చినట్టుగా తాజా నివేదికల ద్వారా తెలుస్తోంది. అయితే ఇకపై అలా ఉండబోదట.. భవిష్యత్‌లో ఫోన్ బిల్లులు మరింత తగ్గే అవకాశాలు కన్పించడం లేదని కౌంటర్‌పాయింట్ టెక్నాలజీ మార్కెట్ రీసర్చ్ సంస్థ తన అధ్యయనంలో వెల్లడించింది. జియో మార్కెట్లోకి అడుగుపెట్టడంతో ఎయిర్‌టెల్, ఐడియా సహా పలు టెలికాం సంస్థలు టారిఫ్‌లను తగ్గించాయి. దీంతో సామాన్య వినియోగదారుడికి ధరలు అందుబాటులోకి వచ్చాయి. కస్టమర్లను ఆకట్టుకునేందుకు టెలికాం సంస్థలు తక్కువ ధరలోనే డేటా ఆఫర్లను అందిస్తున్నాయి. అయితే దీని వల్ల టెలికాం సంస్థల ఆదాయానికి భారీగా గండిపడినట్లు తెలుస్తోంది. 2016 జూన్ నుంచి 2017 డిసెంబరు మధ్య టెలికాం కంపెనీలు దాదాపు 9.5 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని కోల్పోయాయని ఇటీవల నివేదికలో తేలింది. ఈ నేపథ్యంలో భవిష్యత్‌లో ఫోన్ బిల్లులు మరింత తగ్గే అవకాశాలు కన్పించడం లేదని కౌంటర్‌పాయింట్ టెక్నాలజీ మార్కెట్ రీసర్చ్ వెల్లడించింది. భవిష్యత్‌లో తమ టారిఫ్‌లను మరింతగా తగ్గించకూడదని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అయితే వినియోగదారులు చేజారకుండా ఆయా సంస్థలు ఉన్న టారిఫ్‌లలోనే ఎక్కువ డేటా, మరిన్ని ఉచిత సదుపాయాలను వినియోగదారులకు అందించే అవకాశాలున్నాయని సమాచారం.

'లక్ష'ణంగా మారుతీ స్విఫ్ట్ బుకింగ్‌లు



ముంబయి: దేశీయ దిగ్గజ ఆటోమొబైల్ సంస్థ మారుతీ సుజుకీ ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ స్విఫ్ట్ అరుదైన రికార్డును సొంతం చేసుకోనుంది. అతి తక్కువ సమయంలోనే లక్ష బుకింగ్‌ల మైలురాయిని చేరుకున్న కారుగా కొత్త స్విఫ్ట్ సరికొత్త రికార్డును సొంతం చేసుకోనుంది. మూడో జనరేషన్ స్విఫ్ట్ బుకింగ్‌లను జనవరి 18న కంపెనీ ప్రారంభించింది. శుక్రవారం నాటికి దాదాపు 90వేల బుకింగ్‌లు వచ్చినట్లు మారుతీ సుజుకీ తెలిపింది. మరో వారంలో లక్ష బుకింగ్‌ల మైలురాయిని చేరుకుంటామని తెలిపింది. అలా జరిగితే కేవలం తక్కువ సమయంలో ఈ ఘనత సాధించిన తొలి కారుగా స్విఫ్ట్ రికార్డును దక్కించుకోనుంది. గతంలోనూ ఇతర కంపెనీల కార్లు లక్ష బుకింగ్‌ల మైలురాయిని చేరుకున్నాయి. అయితే అందుకోసం అవి కాస్త ఎక్కువ సమయం తీసుకున్నాయి. రెనో క్విడ్ ఆరు నెలల్లో, హ్యుందాయ్ క్రెటా 8, మారుతి డిజైర్, వితారా బ్రెజా నాలుగు నెలల్లో ఈ ఘనత సాధించాయి.

ఆడిటర్ల బాధ్యత మరింత పెరుగుతోంది..



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: దేశ ఆర్థిక వ్యవస్థ విస్తరిస్తున్న వేళ ఆడిటర్లపై బాధ్యత అంతకంతకు పెరుగుతూ వస్తోందని 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెట్స్ ఆఫ్ ఇండియా' (ఐసీఏఐ) మాజీ అధ్యక్షుడు ఎం.దేవరాజ రెడ్డి అన్నారు. ఐసీఏఐ ఎస్ఐఆర్‌సీ హైదరాబాద్ శాఖ హైదరాబాద్‌లో శనివారం బ్యాంక్ ఆడిట్‌పై ఏర్పాటు చేసిన సదస్సును ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ఎస్ఐఆర్‌సీ హైదరాబాద్ శాఖ చైర్మెన్ మండవ సునిల్ కుమార్ మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంతో పాటు ఆర్థిక వ్యవస్థలో వేగంగా వస్తున్న మార్పులపై చార్టర్డ్ అకౌంటెట్లకు అవగాహన కల్పించి.. వారు మెరుగైన సమాజ నిర్మాణంలో పాలుపంచుకొనేలా చేయాలనే ఉద్దేశంతోనే బ్యాంక్ ఆడిట్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టుగా తెలిపారు. బ్యాంక్ ఆడిట్‌పై విషయ పరిజ్ఞానాన్ని పెంచుకొనేందుకు గాను తెలుగు రాష్ట్రాల నుంచి 1400 మందికిపైగా సీఏలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంల మూడు సెషన్లలో జరిగింది. కార్యక్రమంలో భాగంగా ఎస్ఐఆర్‌సీ చైర్మెన్ అడుసుమిల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శి చిన మస్తాన్‌లను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐఆర్‌సీ సభ్యులతో పాటుగా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, బ్యాంకింగ్ రంగ నిపుణులు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐఆర్‌సీ హైదరాబాద్ శాఖ కార్యదర్శి చదలవాడ వెంకట్‌రామ్, ఉపాధ్యక్షుడు భాను నారాయణరావు, మేనేజింగ్ కమిటీ సభ్యులు నరేష్ చంద్ర గెల్లీలు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) జాతీయ మహాసభలపై ప్రచారం



నవతెలంగాణ-యంత్రాంగం

ఏప్రిల్ 18నుంచి 22వరకు హైదరాబాద్‌లో జరగనున్న సీపీఐ(ఎం) జాతీయ మహాసభల విజయవంతం కోరుతూ సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం సత్తుపల్లి పట్టణంలో ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని రహదారుల వెంబడి గోడలపై వాల్ రైటింగ్ కార్యక్రమాలు చేపట్టారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం ఐనాపూర్‌లో కార్యకర్తలకు రెడ్‌షర్ట్ వాలంటీర్ల శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, కార్యదర్శి వర్గసభ్యురాలు కళావతి పాల్గొన్నారు.

రాలిపోయిన విజ్ఞానతార హాకింగ్

- జేవీవీ సంతాపసభలో వక్తలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేటితరం ఐన్‌స్టీన్, విజ్ఞాన తార స్టీఫెన్ హాకింగ్ రాలిపోయారని జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) తెలంగాణ పలువురు వక్తలు అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని నిజాం కాలేజీలో స్టీఫెన్ హాకింగ్ సంతాప సభ జరిగింది. స్టీఫెన్ హాకింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ హేతువాది బాబుగోగినేని మాట్లాడుతూ స్టీఫెన్ హాకింగ్‌కు 21 ఏండ్ల వయసులోనే మోటార్‌న్యూరాన్ వ్యాధి వచ్చిందన్నారు. ఆ వ్యాధి ఆయన శరీరాన్ని కబళించి నిర్వీర్యం చేసిందని చెప్పారు. ఆ వ్యాధిని పరీక్షించిన డాక్టర్లు ఎంత కాలం బతకడని అన్నారని గుర్తు చేశారు. మృత్యువును జయించడమే కాకుండా విశ్వం, ఖగోళ పరిణామాలపై పరిశోధన చేసి ప్రఖ్యాత సిద్ధాంతాలతో వైజ్ఞానిక ప్రపంచాన్ని జయించారని అన్నారు. సీసీఎంబీ మాజీ డైరెక్టర్ సీహెచ్ మోహన్‌రావు మాట్లాడుతూ స్టీఫెన్ హాకింగ్ మృతి సైన్స్‌కు, శాస్త్ర పరిశోధనలకే కాకుండా ప్రజాసైన్స్ ఉద్యమ సంస్థలకు తీరనిలోటని అన్నారు. హాకింగ్ జీవితమే అందరికీ ఓ సందేశమని చెప్పారు. అధ్యక్షత వహించిన జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం ఆదినారాయణ మాట్లాడుతూ హాకింగ్ వైకల్యాన్ని జయించి కృష్ణబిలాలపై, విశ్వ ఆవిర్భాలపై విస్తృతంగా పరిశోధనలు చేశారని చెప్పారు. స్థలం, కాలం వేర్వేరు కాదని, స్థలకాలాల ఏకత్వ సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చారని అన్నారు. విశ్వం పట్ల నూతన ఆలోచనలకు పునాదులు వేసి మహాశాస్త్రవేత్త అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రఖ్యాత శాస్త్రవేత్త నరహరిశాస్త్రి, పర్యావరణ శాస్త్రవేత్త బాబురావు, జేవీవీ శాస్త్ర ప్రచార కన్వీనర్ కోయ వెంకటేశ్వరరావు, నిజాం కాలేజీ ప్రొఫెసర్ రెహమాన్, జేవీవీ నాయకులు బీఎన్ రెడ్డి, కట్టా సత్యప్రసాద్, రాజా, వరప్రసాద్, శ్రీనివాస్, మోహన్ పాల్గొన్నారు.

అక్రమాస్తులు 3.57 కోట్లు

నాంపల్లి కోర్టు ప్రిసైడింగ్ అధికారిపై ఏసీబీ దాడుల్లో వెలుగులోకి..

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

అవినీతి, అక్రమాలకు పాల్పడి నాంపల్లి లేబర్ కోర్టుకు చెందిన ఒక ప్రిసైడింగ్ అధికారి రూ. 3.57 కోట్ల విలువైన ఆస్తులను కూడబెట్టినట్టు అవినీతి నిరోధక శాఖ జరిపిన ఆకస్మిక దాడుల్లో వెల్లడైంది. ఏసీబీ డీజీ పూర్ణచంద్రరావు శనివారం తెలిపిన వివరాల ప్రకారం నాంపల్లి లేబర్ కోర్టు 2కు చెందిన ప్రిసైడింగ్ అధికారి మల్లంపల్లి గాంధీ అవినీతికి పాల్పడి భారీ మొత్తంలో అక్రమాస్తులను కూడ బెట్టినట్టు హైకోర్టు దృష్టికి వచ్చింది. ఈ మేరకు హైకోర్టు ఇచ్చిన ఆదేశాలతో ఏసీబీ అధికారులు గాంధీకి చెందిన హైదరాబాద్, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని ఆస్తులపై ఏక కాలంలో దాడులను నిర్వహించారు. పలు చోట్ల అపార్ట్‌మెంట్‌లలో ప్లాట్‌లు, వ్యవసాయ భూములతో పాటు లక్షల విలువైన బంగారు, వెండి నగలను కలిగి ఉన్నట్టు తేలింది.

సామాజిక న్యాయం ఎజెండాగా

రాజ్యాధికారమే లక్ష్యం

- కాంగ్రెస్, టీడీపీ విధానాలే టీఆర్ఎస్ కొనసాగిస్తున్నది
- కేటాయింపులతోనే సరిపెడుతున్న సర్కారు
- తెలంగాణలోనూ ప్రజల ఆకాంక్షలు నెరవేరడం లేదు
- బడ్జెట్‌ను సవరించి బీసీ,మైనార్టీ సబ్‌ప్లాన్ తేవాలి :

టీమాస్, మేధావుల ఫోరం రౌండ్‌టేబుల్‌లో వక్తలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో సామాజిక న్యాయం ఎజెండాగా రాజ్యాధికారమే లక్ష్యంతో ఐక్యంగా ముందుకు సాగాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. కాంగ్రెస్, టీడీపీ విధానాలనే టీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగిస్తోందని విమర్శించారు. నిజాం పాలనను అ ంతమొందించినా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను విభజించినా, తెలంగాణ స్వరాష్ట్రంలోనూ ప్రజల ఆకాంక్షలు నెరవేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'సామాజిక న్యాయం- రాష్ట్ర బడ్జెట్'అనే అంశంపై తెలంగాణ సామాజిక ప్రజా సంఘాల ఐక్యవేదిక (టీమాస్), తెలంగాణ మేధావుల ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. బీసీ సబ్‌ప్లాన్ సాధన కమిటీ చైర్మెన్ ప్రొఫెసర్ మురళీమనోహర్ మాట్లాడుతూ...తెలంగాణ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వేలో 1.01 కోట్ల కుటుంబాలు ఉన్నాయని తేలిందని అన్నారు. దీంట్లో 58శాతం మందికి భూములు లేవని చెప్పారు. నెలసరి జీతం లేనివారు 91శాతం ఉన్నారని వివరించారు. గ్రామీణ ప్రాంతాలు 41శాతం ఉన్నాయనీ, 25 ఎండ్లున్న వారిలో 24శాతం మంది చదువుకోలేదని చెప్పారు. అక్షరాస్యుల్లో 20శాతం మంది పదో తరగతిలోనే డ్రాప్‌అవుట్స్‌గా మారుతున్నారని చెప్పారు. ఆహారంపై ఖర్చు చేసేవారు గ్రామీణ ప్రాంతాల్లో 16శాతం, పట్టణ ప్రాంతాల్లో 32శాతం ఉన్నారని తెలిపారు. 24.90 కుటుంబాలకు సొంత ఇండ్లు ఉన్నాయనీ, 45.02 శాతం మంది ఒకే గదిలో నివాసముంటున్నారని చెప్పారు. 41.21లక్షల కుటుంబాలకు మరుగుదొడ్లు లేవని, 14.49లక్షల కుటుంబాలకు విద్యుత్ సౌకర్యం లేదన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐదు బడ్జెట్‌లలో సామాజిక న్యాయం ప్రతిబింబించలేదని చెప్పారు. టీఆర్ఎస్ ఎజెండాలోనే సామాజిక న్యాయం లేదన్నారు. వారి ప్రాధాన్యతలు వేరని ఎద్దేవా చేశారు. చట్టసభల్లో బీసీలు జనాభా దామాషా ప్రకారం లేరని అన్నారు. 52 శాతం బీసీ జనాభా ఉంటే, ఎమ్మెల్యేలు 14.9 శాతం, ఎంపీలు 13 శాతం (లోక్‌సభ), 8 శాతం (రాజ్యసభ), ఎమ్మెల్సీలు 10.6 శాతం, రాష్ట్ర మంత్రులు 15.2 శాతం, కేంద్ర మంత్రివర్గంలో 7 శాతం మాత్రమే ఉన్నారని గణాంకాలతో సహా వివరించారు. అగ్రకులాల వారు చట్టసభల్లో 66 శాతం నుంచి 82 శాతం వరకు ఉన్నారని అన్నారు. రాజకీయ పార్టీలు బీసీలకు 17 శాతం నుంచి 30 శాతం వరకే టికెట్లు కేటాయిస్తున్నాయని చెప్పారు. అందులోనూ గెలిచే వారు తక్కువ అని గుర్తు చేశారు. 112 బీసీ కులాల్లో 78 కులాలు చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించడం లేదన్నారు. కాంగ్రెస్, టీడీపీ, టీఆర్ఎస్ ద్వారా సామాజిక న్యాయం సాధ్యం కాదని చెప్పారు. ఉద్యమాలతోపాటు ఎన్నికల్లో పాల్గొని అధికారం ద్వారా సమస్యలు పరిష్కరించాలని సూచించారు. నవతెలంగాణ సంపాదకులు ఎస్ వీరయ్య మాట్లాడుతూ... సంక్షేమం పేరుతో అమలు చేసే పథకాలు ఓట్ల కోసమేనని అన్నారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీల జీవితాలు బాగుపడేలా నిజమైన పథకాలు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు, వైఎస్, కేసీఆర్ అధికారంలో ఎవరున్నా ఓట్లను దృష్టిలో ఉంచుకొని పథకాలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. భూ పంపిణీ చేపడితే పథకాలు అమలు చేసే అవసరం ఉండబోదన్నారు. కేజీ టు పీజీ, డబుల్‌బెడ్‌రూం ఇండ్లు, మూడెకరాల భూమి వంటి వాగ్దానాలు కాగితాలకే పరిమితం చేసి ప్రజలను ఎంత కాలం మభ్యపెడతావని కేసీఆర్‌ను సూటిగా ప్రశ్నించారు. జనప్రవాహం కదిలితే టీఆర్ఎస్ ప్రభుత్వ పునాది కదలడం ఖాయమని అన్నారు. బడుగు, బలహీనవర్గాల ప్రజాప్రతినిధులతో చర్చించి బడ్జెట్ కేటాయింపులను సవరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజల తిరుగుబాటును చూడాల్సి ఉంటుందని హెచ్చరించారు. అధ్యక్షత వహించిన తెలంగాణ మేధావుల ఫోరం చైర్మెన్ ఇనుకొండ తిరుమలి మాట్లాడుతూ హక్కులు, బడ్జెట్‌లో వాటా కోసం ఎన్నిరోజులు, ఎన్నేండ్లు ఉద్యమాలకే పరిమితమవుతామని అన్నారు. రాజకీయ శక్తిగా ఎదగాలని చెప్పారు. అప్పుడే అభివృద్ధి ఫలాలు అందరికీ అందుతాయన్నారు.

టీమాస్ కన్వీనర్ జాన్‌వెస్లీ మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సామాజిక అసమానతలను నిర్మూలించే దిశగా కేటాయింపుల్లేవని విమర్శించారు. ఎస్సీ,ఎస్టీ అభివృద్ధి నిధి చట్టంలో లోపాలు సవరించాలని డిమాండ్ చేశారు. బీసీ, మైనార్టీ అభివృద్ధి నిధి చట్టం తేవాలని కోరారు. డీబీఎఫ్ నేత శంకర్ మాట్లాడుతూ రాజకీయ ప్రత్యామ్నాయంతోనే సామాజిక న్యాయం సాధ్యమని అన్నారు. ఈ బడ్జెట్‌లో దళితులకు నిధులు 16.6 శాతం నుంచి 15.2 శాతానికి తగ్గాయని వివరించారు. రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శులు టి సాగర్, ఆర్ వెంకట్రాములు మాట్లాడుతూ... 14 లక్షల మంది కౌలురైతులు, 4 లక్షల ఎకరాల్లో పనిచేస్తున్న పోడు రైతులకు పంట పెట్టుబడి పథకం వర్తించబోదని అన్నారు. భూ యజమానులకే వర్తిస్తుందన్నారు. పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఈ బడ్జెట్‌లో టీఆర్ఎస్ ప్రభుత్వం సామాజిక వివక్ష చూపిందన్నారు. సంచార జాతుల సంఘం నాయకులు వెంకట్ నారాయణ, నరేందర్ మాట్లాడుతూ సంచార జాతులకు ఇల్లు, ఇంటినెంబర్ లేక కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదన్నారు. కేవీపీఎస్, గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శులు టి స్కైలాబ్‌బాబు, ఎం ధర్మానాయక్ మాట్లాడుతూ...వ్యక్తికి పదవి ఇస్తే సామాజిక న్యాయం కాదన్నారు. సంపదలో అందరికీ వాటా ఉండాలని చెప్పారు. తెలంగాణలోనూ దళితులు, గిరిజనుల జీవన ప్రమాణాల్లో మార్పు లేదన్నారు. ఐద్వా సీనియర్ నాయకురాలు కెఎన్ ఆశాలత మాట్లాడుతూ మహిళా సంక్షేమాన్ని ఈ ప్రభుత్వం విస్మరించిందని చెప్పారు. బీసీ సంఘం నాయకులు ఎఎల్ మల్లయ్య మాట్లాడుతూ... రాజకీయ పార్టీ ఆవిర్భవించాలని సూచించారు. గుర్తింపు లేని కులాల ప్రతినిధి రాంప్రసాద్... మాట్లాడుతూ మనిషి పుడితే ఏదో ఓ కులం ఉంటుందని, కొందరికి కులం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కుల ధ్రువీకరణ పత్రం లేక విద్యా, ఉద్యోగావకాశాలు కోల్పోతున్నామని అన్నారు. ఎన్‌పీఆర్‌డీ నేత గోరెంకల నర్సింహ్మా... మాట్లాడుతూ 25 లక్షల మంది వికలాంగుల సంక్షేమానికి రూ.11.73 కోట్లు ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. తెలంగాణ లోక్‌సత్తా నాయకులు మన్నారం నాగరాజు మాట్లాడుతూ... ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీలు ఐక్యంగా బీఎల్ఎఫ్‌నకు అండగా ఉండాలన్నారు. ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్, ఎంబీటీ నాయకులు షహనాబ్ అలీఖాన్ మాట్లాడుతూ... ఇది మోసపూరిత బడ్జెట్ అని అన్నారు. మైనార్టీ సబ్‌ప్లాన్ తేవాలని డిమాండ్ చేశారు. రజక సంఘాల జేఏసీ నేత సత్తయ్య మాట్లాడుతూ సామాజిక తరగతుల అనైక్యత పాలకులకు బలంగా మారిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంవి రమణ (వృత్తిదారుల సంఘం), ఆర్ శ్రీరాంనాయక్ (టీమాస్), కిల్లెగోపాల్ (బీసీ సబ్‌ప్లాన్ సాధన కమిటీ), పి లక్ష్మయ్య (తల్లిదండ్రుల సంఘం), జి నరేష్ (ఎంబీసీ సంఘం), కోట రమేష్ (ఎస్ఎఫ్ఐ), శోభన్ నాయక్ (టీఎస్ఎఫ్), రవీందర్ (జీఎంపీఎస్) తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు ఎత్తిపోతల పనులు వేగవంతం

- ఆసియాలోనే అతి పెద్ద పంప్‌హౌస్‌ల నిర్మాణం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు వేగం పుంజుకున్నాయి. భూసేకరణ సమస్యతో పాటూ న్యాయ వివాదాల కారణంగా ఏడాదిన్నర కాలం నత్తనడక నడిచాయి. కొన్ని అవరోధాలు తొలగిపోవటంతో అన్ని ప్యాకేజీల్లో పనులు ఏకకాలంలో చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. నీటిపారుదల శాఖ, మీడియా అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం పాలమూరు, కల్వకుర్తి ఎత్తిపోతల పనులను క్షేత్రస్థాయిలో మీడియా ప్రతినిధులు పరిశీలించారు. పూర్వపు పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లోని 12.30 లక్షల ఎకరాలకు తాగు, సాగునీరందించే పాలమూరు ప్రాజెక్టులో ఆరు రిజర్వాయర్లు, ఐదు పంప్‌హౌస్‌లతో పాటూ టన్నెల్, కాల్వల పనులు ఆశించిన రీతిలో కొనసాగుతున్నాయని నీటిపారుదల వర్గాలు తెలిపాయి. పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న ఆరు పంప్‌హౌస్‌లలో ఐదు పంప్‌హౌస్‌లకు 145 మెగావాట్ల సామర్థ్యం కలిగిన పంప్‌లను అమర్చనున్నారు. భారీ సామర్థ్యం కలిగిన ఈ పంప్‌లను బీహెచ్‌ఈఎల్‌తూ పాటూ ఆస్ట్రియా దేశానికి చెందిన కంపెనీలు సరఫరా చేయనున్నాయి. ఆసియా ఖండంలోనే ఈ పంప్‌లు పెద్దవని అధికారులు చెప్పారు.

రంగారెడ్డి జిల్లాలోని కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ మినహా మిగిలిన ఐదు రిజర్వాయర్ల పనులు జరుగుతున్నాయి. ఏదుల రిజర్వాయర్ పనులు దాదాపు పూర్తి కావచ్చినట్టు అధికారులు తెలిపారు. శ్రీశైలం ఫోర్‌షోర్ నుంచి నీటిని తీసుకునే మొదటి ప్యాకేజీ పనులు కూడా ప్రారంబమయ్యాయి. నార్లాపూర్, ఏదుల రిజర్వాయర్ల పనులను, ఏదుల వద్ద నిర్మించే భూగర్భ పంప్‌హౌస్, టన్నెల్, సర్జిపూల్ పనులను మీడియా బృందం పరిశీలించింది. పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని 18 ప్యాకేజీలుగా విభజించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేశారు. ప్రాథమిక అంచనాల ప్రకారం ప్రాజెక్టు వ్యయం రూ. 35,200 కోట్లు కాగా ఈ మేరకు 2015 లో పాలనాపరమైన అనుమతులను జారీ చేశారు. తాజా లెక్కల ప్రకారం ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 40,000 కోట్లకు పెరుగుతుంది. ఎత్తిపోతల్లో భాగంగా నిర్మిస్తున్న నార్లాపూర్, ఏదుల, వట్టెం, కరివెన, ఉదండాపూర్, లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్లు నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన 27,248 ఎకరాల భూమిని సేకరిస్తున్నట్టు అధికారులు తెలిపారు. వీటిలో 21,773 ఎకరాలు రైతులది కాగా 5,475 ఎకరాలు ప్రభుత్వ భూమి, 508 ఎకరాల అటవీ భూమి కావటం విశేషం. వివిధ ప్యాకేజీల్లో పనులు పూర్తి చేయటానికి ముందుగా 30 నెలల గడువు ఇచ్చినప్పటికీ ఈ గడువు కన్నా ముందే 2019 డిసెంబర్ నాటికి పనులన్నీ పూర్తి చేస్తామని ప్రాజెక్టు సూపరింటెండింగ్ ఇంజినీర్ రమేశ్ తెలిపారు. ఈ ప్రాజెక్టుకు మొదటి దశ అటవీ అనుమతులు లభించాయి. త్వరలో మొదటి దశ పర్యావరణ అనుమతులు కూడా వస్తాయని అధికారులు భావిస్తున్నారు.

కేసులతో అవరోధం... మంత్రి జూపల్లి

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై హైకోర్టులోనూ, ఎన్జీటీలోనూ కాంగ్రెస్ నేతలు కేసులు వేసినందువల్ల పనుల్లో కొంత జాప్యం జరిగిందని రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మీడియాకు తెలిపారు. వీటిని అధిగమించి గడువు కన్నా ముందే పనులు పూర్తి చేయటానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ హయాంలో పాలమూరు ప్రాజెక్టులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆయన ఆరోపించారు. వివిధ ప్యాకేజీల్లో జరుగుతున్న పనుల పట్ల మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ హర్షం వ్యక్తం చేశారు.

కల్వకుర్తి పనులు 90 శాతం పూర్తి

కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని కూడా మీడియా ప్రతినిధులు చూశారు. ఎల్లూరు సమీపంలో నిర్మించిన మొదటి దశ పంప్‌హౌస్‌లోని మూడు మోటర్ల ద్వారా నీటిని కాల్వలకు వదలుతున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 4.24 లక్షల ఎకరాలకు నీరందించాలని లక్ష్యంగా పెట్టుకోగా ఖరీఫ్, యాసంగిలో చెరువులు నింపి 2.75 లక్షల ఎకరాలకు సాగునీరందించామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, లచ్చంపేట, జడ్చర్ల, కల్వకుర్తి నియోజక వర్గాల్లోని 27 మండలాలకు నీరందుతుందని అధికారులు తెలపారు. నార్లాపూర్, డిండి పథకంతో కల్వకుర్తి ఆయకట్టు దెబ్బతింటుందని జరుగుతున్న ప్రచారాన్ని మంత్రి ఖండించారు. సవరించిన అంచనాల ప్రకారం కల్వకుర్తి ఎత్తిపోతల అంచనా వ్యయం రూ. 4,806 కోట్లు కాగా దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. త్వరలో డిస్ట్రిబ్యూటరీ పనులను కూడా పూర్తి చేస్తామన్నారు.

నీతో ఉంటె చాలు...




"ఏం చేయాలో అర్థం కావటం లేదు. తినకపోతే చచ్చిపోతావ్ అని ఆకలి బెదిరిస్తున్నా పట్టించుకోకుండా దాన్ని మర్చిపోయిన క్షణం ఇది. అయినా ఏం చేయను మరి.." నిజంగా ఒక పర్సన్ ప్రేమలో ఉంటే ఇలాంటి టైంలో ఏం అనుకుంటారు.. 'నీతో ఉంటే చాలు' అని తన ప్రేయసిని లేదా ప్రేమికున్ని తల్చుకుంటూ ఉంటారు కదా ? అవును ఒంటరి తనాన్ని జయించడానికి, బాధను మర్చిపోవడానికి, ఆనందాన్ని ఆశ్వాదించడానికి, హర్ట్ చేయడానికి, ఆడుకోవడానికి, కొట్లాడానికి, నవ్వించడానికి, ఊసులు చెప్పడానిక ఒకరు ఉండాలి కదా.. అలాంటి తోడుతో కలిసి కాఫీ తాగేటపుడో... కలిసి ఆఫీస్ మెట్లు దిగేటప్పుడో, ముచ్చట్లు చెప్పుకుంటున్నప్పుడో ఆ ఆనందం, అనుభూతే వేరు కదా. చేతిలో చేయ్యేసి నడిస్తే ఆ ఫీలింగే వేరు కదా.. ఇలాంటి టైంలోనే మనసు తేలికై శరీరంలో అనేక రసాయనిక చర్యలు జరిగుతాయని ఎన్నో అధ్యాయనాలు చెప్తున్నాయి. ఇటీవల యూనివర్సిటీ ఆఫ్ కలోరడో బైల్డర్, యూనివర్సిటీ ఆప్ హైఫా శాస్త్రవేత్తలు జరిపిన ఆధ్యాయనంలో కూడా ఇదే తేలింది. ఇద్దరు ప్రేమికులు కలిసి ఇలాంటి ఆనంద క్షణాల్లో ఉన్నప్పుడు మెదడులో తరంగాలు సమానంగా జరుగుతాయనీ, బాధ తీవ్రత తగ్గుతుందనీ తేల్చారు. ఇంకా చేతిలో చేయేసి నడవటం వల్ల దూరం అవుతున్న మానవ స్వర్శకు ఉన్న శక్తి సామర్థ్యం పెరుగుతుందనీ, ఇద్దరి భావావేశాలు సమానంగా ఉంటాయని గోల్డ్ స్టీన్ అనే శాస్త్రవేత్త వివరించారు. బాధలో ఉన్నప్పుడు, ఒత్తిడిని తట్టుకోవడానికి, ఆనందాన్ని పంచుకోవడానికి ముందు తమ భాగస్వామితో మాట్లాడటానికి ఇష్టపడుతున్నారని గోల్డ్ స్టీన్ బృందం గుర్తించింది.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3వ వార్షికోత్సవం

జోష్ నవతెలంగాణ
హ్యాపీ వీకెండ్



బషీర్ అలీ... మన హైదరాబాద్‌కు చెందిన కుర్రాడే... మూడునెలల కిందట ఇతను ఎవరికీ తెలియదు. కానీ ఇప్పుడు ఇండియా మొత్తానికి ఈ కుర్రాడు స్టార్ అయ్యాడు. యూట్యూబ్ స్టార్‌గా మొదలైనా ఇతని జీవితం ఇప్పుడు మోస్ట్ డిసైరబుల్ మ్యాన్ ఆఫ్ 2017గా పేరు సాధించాడు. ఇంతకీ ఈ 22 ఏండ్ల కుర్రాడు ఏం చేశాడు? ఎలా స్టార్ అయ్యాడు? అందరికన్నా బషీర్ ఎలా డిఫ్రెంట్.. లెట్స్ రీడ్ ది స్టోరీ ..

బషీర్ అలీ...

బిల్‌కుల్ అలాగ్ హై

బషీర్ అలీ (బాబ్) సదాసీదా కుర్రాడు కాదు. హైదరాబాద్‌లోని ఏసీ గార్డ్స్ ప్రాంతానికి చెందిన ఫిట్‌నెస్ మోడల్. చిన్నప్పటి నుంచే ఫ్యాషన్ రంగంపై ఆసక్తి పెంచకున్నాడు. ఈ క్రమంలోనే ఇండియాలో ప్రసారమవుతున్న MTV Roadies Rising, Splitsvilla 10 Reality Show లకు నామినేట్ అయ్యాడు. అప్పుడే అతను ఇండియాకు పరిచయం అయ్యాడు. Splitsvilla 10 సీజన్ విన్నర్‌గా గెలిచి హైదరాబాద్ మోస్ట్ డిసైరబుల్ మెన్‌గా పేరు సాధించాడు.

బషీర్ ఎంట్రీ

చిన్నప్పటి నుంచి Roadies Rising, Splitsvilla ఎపిసోడ్స్‌ను ఫాలో అవుతున్న బషీర్ 2017లో Roadies Rising Stunt Reality Show లో పాల్గొన్నాడు. 20మంది కాంపిటీషనర్లతో పోటీ పడి ఎపిసోడ్ రన్నరప్‌గా నిలిచాడు. అయినా అక్కడితో ఆగలేదు. Splitsvilla 10 ఎపిసోడ్‌లో ఎంటర్ ఆయ్యాడు. ఈ షోలో నైనా సింగ్‌తో పాల్గొని ఎపిసోడ్ విన్నర్‌గా నిలిచి యూత్‌కు దగ్గరయ్యాడు.

జర్నీ ఆఫ్ బషీర్

యూసుఫ్‌గూడాలోని సెయింట్ మేరీ కాలేజీలో బషీర్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు.. చిన్నప్పటి నుంచి బాడీ ఫిట్‌నెస్ మోడలింగ్ ను ప్రొఫెషన్‌గా ఎంచుకున్నాడు. ఈ క్రమంలోనే Habibiz అనే యూట్యూబ్ ఛానల్‌ను ప్రారం భించి తన టాలెంట్‌కు వేదిక చేసుకున్నాడు. ట్రెండింగ్ ఫ్యాషన్‌ను ఎక్కువ ఫాలో అయ్యేవాడు. కానీ అందరిలా కాకుండా డిఫ్రెంట్‌గా ఉండాల నుకునేవాడు. యూత్ చెక్స్ ఫ్యాషన్ ఫాలో అయితే బషీర్ స్ట్రిప్స్ వేసుకునేవాడు. అందరూ స్ట్రిప్స్ వేసుకుంటే ఇతను మాత్రం ఒక్కో సారి ప్లెయిన్ షార్ట్స్ వేసుకుని డిఫ్రెంట్‌గా ఉండాల నుకునేవాడు. మొదటి నుంచే బషీర్ Roadies Rising షోను ఫాలో అయ్యే వాడు. 2017లో ఆడిషన్స్‌కి బయల్దేరి అక్కడి ప్రిన్సెస్ గ్యాంగ్‌లో జాయిన్ అయ్యాడు. ఆడిషన్స్ తర్వాత ఇంకా ఫిట్‌నెస్ పెంచాలనీ కెప్టెన్ చెప్పడం టో ఇంకా గ్రోఆప్ అవ్వడానికి కృషి చేశాడు. రోజూ ఆరు కిలోమీటర్ల పరుగు తీస్తూ కండలు పెంచాడు. Roadies Rising లో 20 మంది కంటెస్టెంట్స్‌తో పోటీ పడి రన్నరప్‌గా నిలిచాడు. అనంతరం Splitsvilla లో ఎంట్రీ ఇచ్చాడు. తన అద్భుతమైన బాడీ పర్సనాలిటీతో షో చేసి ఎపిసోడ్ విన్నర్‌గా నిలిచి పాలపులర్ అయ్యాడు. అప్పటికే బషీర్‌కి ఫ్యాన్ ఫాలోయింగ్ పెరిగింది. ఢిల్లీ, బెంగళూర్, ముంబయ్ నుంచి ఫ్యాన్స్ ఉన్నారనీ, తన పేరును టాటూగా వేసుకున్నారనీ, ఆ ఫోటోస్ తనకు పంపుతుంటారని బషీర్ చెప్తున్నాడు.



లవ్ స్టోరీ ఉందా ?

బషీర్‌కు లవ్ స్టోరీ ఉంది. 17 ఏండ్ల వయస్సులోనే ఓ అమ్మాయితో ప్రేమలో పడ్డాడు. ఆ అమ్మాయిది రిచ్ ఫ్యామిలీ. కానీ బషీర్‌కు అప్పుడు ఎలాంటి గుర్తింపు లేదు. ఎప్పుడూ ఫ్యాషన్ డిజైనింగ్ గురించే మాట్లాడేవాడు. ఆ అమ్మాయి ఫైనాన్షియల్ బ్యాక్‌గ్రౌండ్ ఇద్దరి ప్రేమ మీద తీవ్ర ప్రభావాన్ని చూపాయి. 2016లో వాళ్లిద్దరూ బ్రేకప్‌అయ్యారు. ఇప్పుడు ఆ అమ్మాయికి వేరే అబ్బాయితో పెండ్లి అయింది. ఏది ఏమైనా బషీర్ ఇప్పుడు సంతోషంగానే ఉన్నాడు. 22 ఏండ్ల కుర్రాడు బషీర్ ఇప్పుడు ఒక తోడు కోసం ఎదురుచూస్తున్నాడు. ఒక్కో సారి బషీర్ ఒంటరి జీవితాన్ని గడుపుతున్నాడు. దీని నుంచి బయటపడటానికి, తన లైఫ్‌ను షేర్ చేసుకోవడానికి ఓ భాగస్వామిని కోరుకుంటున్నాడు.

24 ఏండ్లు వచ్చే సరికి బషీర్ ఇంకా పూర్తిగా మారిపోవాలనుకుంటున్నాడు. పర్సనాలిటీ, స్టార్ డమ్, ఇంకా మంచి పేరు సాధించాలని కోరుకుంటున్నాడు. ఇప్పుడు బషీర్ బరువు 65 కేజీలు ఇంకా దాన్ని 80కి పెంచుకోవాలని జిమ్ చేస్తున్నాడు. మొత్తనికైతే బషీర్ స్టార్ పర్సనాలిటీని కోరుకుంటు న్నాడు. చిన్న వయసులోనే ఇంత స్టార్‌డమ్ సాధించిన మన హైదరాబాద్ కుర్రాడు మరింత సక్సెస్ అవ్వాలని మనమూ కోరుకుందాం.. ఆల్ ద బెస్ట్ బషీర్..

గమ్యం నీవే!

ఎదురుచూస్తూనే ఉంటా
నీ చూపుల చివరి అంచులైనా
నా మీద పడకపోతాయా అని!

వింటూనే ఉంటా
నీ పెదవుల్లో చివరిమాటైనా
నా గురించి పలకకపోదా అని!

నడుస్తూనే ఉంటా
నీ అడుగులో చివరి అడుగైనా
నా అడుగులో పడకపోదా అని!

కంటూనే ఉంటా
కలలో కనబడే నీ రూపం
ఎప్పటికైనా ఎదురవకపోదా అని!

రాస్తూనే ఉంటా
నా ప్రతి రాతను చూసైనా
నీ హ దయం కరగకపోదా అని!

కాలాలు దాటిపోయినా
కావ్యాలు నిండిపోయినా
గమనం నీవైపే, గమ్యం నీవే!



– పుట్టి గిరిధర్
9491493170

మీరూ రాయొచ్చు

హాయ్ ఫ్రెండ్స్. ఈ పేజీకి మీరేదైనా రాయాలనుకుంటున్నారా.. అయితే ఆలస్యం దేనికి? కలం పట్టండి. ముఖ్యమైన ఈవెంట్స్, సక్సెస్ స్టోరీలు. కవితలు,జోకులు ఇలా యూత్‌కు సంబంధించి సమాచారం ఏదైనా సరే మాకు పంపండి.

మా అడ్రస్ : జోష్ పేజీ, నవ తెలంగాణ తెలుగు దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ఫ్లాట్ నం. 21/1, ఆజమాబాద్, ఆర్.టి.సి కల్యాణ మండపం వీధి, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ – 500020.
వాట్సాప్: 07660066469
e-mail :
navatelangana.josh@gmail.com

ఆమె దర్శనం కాకపోయినప్పుడల్లా

మనస్సు..మనస్సు



నా చుట్టూ అంతా శూన్యవిహారమే
ఆమె అందం ముందు చంద్రుడు దిగదుడుపే

ఆమె ఆలోచనలో పడిపోయినప్పుడల్లా
నన్ను నేను మరచిపోతూనే ఉంటాను
ప్రేమంటే ఎంత శోధించినా కనిపించని వెలుగు

ఆమెను విడిచి ఉండలేకపోయినప్పుడల్లా
నేను జ్ఞాపకాల్లో మునిగిపోతూనే ఉంటాను
ఆమె నా గుండెగదిలో వెలిగే దేవత

ఆమె చూపులబాణాలను విసిరినప్పుడల్లా
నా సున్నిత హ దయం తట్టుకోలేకపోయేది
ఆమె చూపులు విరిసే మన్మథబాణాలు

ఆమె రాక కోసం ఎదురుచూసినప్పుడల్లా
మనస్సు ఉవ్విళ్లూరుతుంటూనే ఉంటుంది
ఆమె రాకనే నాకు నిత్య వసంతోదయం

– డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్
9032844017




ఓయ్..!


నిద్రపోవాలనే అనిపిస్తుంది.
కలగా నువ్వు వస్తావని
నిశ్శబ్దంలోకి వెల్లాలనే అనిపిస్తుంది
నీ మాటలు వినబడతాయని
ఒంటరిగా తిరగాలనిపిస్తోంది
నీ ఊసులు గుసగుసలాడుతాయని

ఫన్.కాం

పెండ్లి చూపులు

ఓ ఇంట్లో పెండ్లి చూపులు జరుగుతున్నాయి
అమ్మాయి తండ్రి : మా అమ్మాయి ఇంకా చదువుకుంటాను అంటోంది.
పెండ్లి కొడుకు : పర్వాలేదు, చదువుకోమనండి. మేం ఓ గంట తర్వాత వస్తాం.






టైటానిక్

టీచర్ : ఏరా చంటీ టైటానిక్ తెలుసా నీకు ?
చంటీ : తెలుసు టీచర్
టీచర్ : అది ఎలా మునిగిందో చెప్పు ?
చంటీ : బుడుక్ బుడుక్ మని మునిగింది టీచర్ ?

ఎవరో చెప్పండి?

భార్య: ఏమండి నేను మీ కోసం వ్రతాలు, పూజలు చేయటం లేదు కదా అయినా మీరు ఎలా బాగుంటున్నారు.
భర్త: అంతా నా మంచితనమే పిచ్చిదానా..
భార్య: అదేం లేదు.. మీ కోసం ఇంకెవరో వ్రతాలు, పూజలు చేస్తున్నారు.. ఎవరో చెప్పండి?





కారంపొడి వ్యాపారం

భార్య: ఏమండి .. పక్కింటాయన వాళ్ల ఆవిడని పువ్వుల్లో పెట్టి చూసుకుంటాడటా తెలుసా ?
భర్త : ఆయనది పూల వ్యాపారమే... నాది కారంపొడి వ్యాపారం.. తీసుకురమ్మంటావా ?

ఉగాది

పుడమిపై
కదిలే మామిడి మొక్కై
వెలసినందుకు
ఆశల ఆకులుతొడిగి
పన్నెండు మాసాలచుట్టూ
పరుగులు తీసి
కోరికల కొమ్మలకు
అనుభవాలపూలతో నిండి
తోరణమాలైన తోబుట్టువులతో
పచ్చని ప్రేమను పంచుతూ
నిత్య జీవన కోకిలపాటై
శ్రమతో నిండిన విజయపుబాటై
మదిలోని అరిషడ్ వర్గాలను
చిత్తశుద్ధితో దంచి
షడ్రుచులగా మార్చుకుని
సాగిపోవడమే నిత్య సంతోషాల ఉగాది

– అభిరామ్
9704153642



తనొస్తుంది

ఆకు రాలిన మోడు
చిగురించే వసంతంలా
బీడు వారిన నేలను
తడిపే వాన చినుకులా
తనొస్తుంది

తనతో పాటు
అందమైన నవ్వుల్నీ
కలల్ని జ్ఞాపకాల్ని వెంటేసుకోని
తనుండేది కాసేపైనా
నవ్వుల్నీ చిందించి
కలల్ని పంచి
జ్ఞాపకాల్ని మిగిల్ని వెళుతుంది

తనలాగే
తన పేరులాగే

- అల
8143916151





శ్రీలంక 70 ఏండ్ల స్వాతంత్ర్య వేడుకల ముక్కోణపు టీ20 టోర్నీ కప్పు కోసం భారత్, బంగ్లాదేశ్ నేడు అమీతుమీకి సిద్ధమయ్యాయి. లంకతో భావోద్వేగ విజయం సాధించిన ఊపుమీదున్న బంగ్లాదేశ్ సీనియర్ల అండతో కప్పుపై కన్నేసింది. రోహిత్ సారథ్యంలో కుర్రాళ్లు కప్పు కొట్టాలనే కసితో కనిపిస్తున్న వేళ.. ముక్కోణపు టైటిల్ పోరులో టీమ్ ఇండియా ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది.

కుర్రాళ్లు కప్పు కొడతారా?

బంగ్లాదేశ్‌తో ముక్కోణపు ఫైనల్ నేడే

- జోరుమీదున్న రోహిత్‌సేన
- భావోద్వేగ జోరులో బంగ్లా ఆటగాళ్లు
- సాయంత్రం 7 నుంచి డి స్పోర్ట్స్‌లో..

నవతెలంగాణ-కొలంబో

బంగ్లాదేశ్‌తో పోరు అంటే ఏకపక్షమే అనుకునే స్థితి నుంచి ఉత్కంఠ సమరమనే స్థాయికి చేరుకున్నది. ఇటీవల బంగ్లాదేశ్ వరుసగా పెద్ద జట్లపై విజయాలు సాధిస్తుండటం, ప్రత్యేకించి పొరుగు దేశాలతో తలపడుతున్న సందర్భంలో విపరీత భావోద్వేగాలతో బరిలోకి దిగుతుండటం.. కొత్తగా కనిపిస్తోన్న మార్పులు. సీనియర్ ఆటగాళ్లు కెప్టెన్ కోహ్లి, మాజీ సారథి ధోని గైర్హాజరీలో కుర్రాళ్లు లీగ్ దశలో మూడు విజయాలు సాధించారు. బంగ్లాదేశ్‌ను రెండుసార్లు ఓడించారు. అయినా, ఆతిథ్య శ్రీలంకపై ఛేదనలో రెండుసార్లు పైచేయి సాధించిన షకిబ్ సేన అంతిమ పోరుకు చేరుకున్నది. టీ20 మ్యాచుల్లో ఒత్తిడిని జయించే జట్టునే విజయం వరిస్తుంది. బంగ్లాదేశ్ ఈ విషయంలో ఎంతో మెరుగైంది. కానీ టీమ్ ఇండియాను దాటి కప్పును అందుకునేనా? భారత కుర్రాళ్లు ద్వీపదేశం నుంచి ట్రోఫీతో తిరిగొస్తారా? ఆసక్తికరం.

పటిష్ఠంగా టీమ్ ఇండియా : సీనియర్లు లేకపోయినా భారత శిబిరం బలోపేతంగా కనిపిస్తోంది. కెప్టెన్ రోహిత్ శర్మ ఫామ్ అందుకోవటం, డ్యాషింగ్ ఓపెనర్ శిఖర్ ధావన్ సూపర్ ఫామ్ కొనసాగించటం భారత్‌కు బలం. మిడిల్ ఆర్డర్‌లో సురేశ్ రైనా, దినేశ్ కార్తీక్, మనీశ్ పాండేలు జోరుమీదున్నారు. కానీ లోయర్ ఆర్డర్‌లో యువ ఆల్‌రౌండర్లు వాషింగ్టన్ సుందర్, విజయ్ శంకర్‌లు ఒత్తిడిలో ఏ మేరకు రాణిస్తారనేది ప్రశ్నార్థకం. యుజ్వేంద్ర చాహల్ మంచి అనుభవమే గడించినా.. ఇటీవల ఒత్తిడికి లోనవుతూ ధారాళంగా పరుగులు ఇచ్చుకుంటున్నాడు. బంతితో విశేషంగా ఆకట్టుకుంటున్న వాషింగ్టన్ సుందర్ నేటి మ్యాచ్‌లోనూ కీలకం కానున్నాడు. అవకాశం వస్తే ఆల్‌రౌండర్‌గా నిరూపించుకునేందుకు సుందర్ ఎదురుచూస్తున్నాడు.

భావోద్వేగ బంగ్లాదేశ్ : ముష్ఫీకర్ రహీం, మహ్మదుల్లా మెరుపులతో బంగ్లాదేశ్ బ్యాటింగ్ లైనప్ బలంగా తయారైంది. శ్రీలంకపై తొలుత 200 పైచిలుకు ఛేదనలో, తాజాగా ఆఖరి లీగ్ మ్యాచ్ ఛేదనలోనూ వీరిద్దరు బంగ్లా ఇన్నింగ్స్‌కు వెన్నెముకలా నిలబడ్డారు. తమీమ్ ఇక్బాల్, లిటన్ దాస్‌లు ఫర్వాలేదనిపిస్తున్నారు. కానీ సౌమ్య సర్కార్, షబ్బీర్ రెహమాన్‌లపై పరుగులు చేయాల్సిన ఒత్తిడి పెరుగుతోంది. కెప్టెన్ షకిబ్ అల్ హసన్ ఎప్పుడూ ప్రమాదకర ఆటగాడే. బంతితో ముస్తాఫిజుర్ రెహమాన్ ప్రధాన పేసరే కానీ రూబెల్ హొసెన్ ప్రమాదకరంగా కనిపిస్తున్నాడు. ఆఫ్‌స్పిన్నర్ మెహది హసన్ నుంచి బంగ్లా మెరుగైన ప్రదర్శన ఆశిస్తోంది.

వర్షం ముప్పు : తుది పోరుకు కొలంబోలో బ్యాటింగ్ పిచ్ సిద్ధమైంది. వికెట్ స్వభావం దృష్ట్యా బౌలర్లకు సైతం సహకరించనున్నది. అయినా, భారీ స్కోరుకు అవకాశాలు మెండుగా ఉన్నాయని చెప్పవచ్చు. సాయంత్రం చిరు జల్లులు కురిసే అవకాశం కనిపిస్తోంది. మ్యాచ్‌కు వచ్చిన ప్రమాదమేమీ లేకపోయినా.. వర్షం తీవ్రత పెరిగితే ఆటకు ఆటంకం కలిగే ప్రమాదం లేకపోలేదు.



- రేసులో రాజ్‌కోట్ సైతం
- ఆసీస్ మ్యాచులకు హైదరాబాద్, వైజాగ్ ఆతిథ్యం

హైదరాబాద్‌లో భారత్ గులాబీ టెస్టు!

నవతెలంగాణ-ముంబయి

టీమ్ ఇండియా తొలి గులాబీ టెస్టుకు హైదరాబాద్ వేదిక కానున్నది. అక్టోబర్‌లో వెస్టిండీస్ జట్టు భారత పర్యటనకు రానున్నది. ఈ పర్యటనలో కరీబియన్లతో టీమ్ ఇండియా తన తొలి డేనైట్ టెస్టు ఆడనున్నది. దీనికి హైదరాబాద్, రాజ్‌కోట్‌లను వేదికలుగా బీసీసీఐ భవిష్య కార్యాచరణ కమిటీ ఎంచుకున్నది. ఈ మేరకు బీసీసీఐ వర్గాల సమాచారం. ' బీసీసీఐ టోర్నీల కమిటీ హైదరాబాద్, రాజ్‌కోట్‌లను వేదికలుగా ఎంచుకున్నది. పాలకుల కమిటీ అనుమతి లభిస్తే హైదరాబాద్ లేదా రాజ్‌కోట్‌లో భారత తొలి డేనైట్ టెస్టు జరుగుతుంది' అని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. డే నైట్ టెస్టు నిర్వహణపై బీసీసీఐ ఆఫీస్ బేరర్ల నిర్ణయంతో తొలుత పాలకుల కమిటీ ఏకీభవించని సంగతి తెలిసిందే. ముంబయిలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో సమావేశమైన భవిష్య టోర్నీల కమిటీ స్వదేశంలో నిర్వహించనున్న పలు మ్యాచులకు వేదికలను నిర్ణయించింది. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో గులాబీ బంతి టెస్టుతో పాటు ఆస్ట్రేలియాతో ఓ వన్డే మ్యాచ్ హైదరాబాద్‌లో జరుగుతుంది. ఆస్ట్రేలియాతో ఓ టీ20 పోరు విశాఖపట్నంలో నిర్వహించనున్నారు. పాలకుల కమిటీ ఆమోదం లభించిన తర్వాత పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేయనున్నారు. ఈ సమావేశానికి సాంకేతిక కమిటీ చైర్మెన్ హోదాలో బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ సైతం హాజరు కాగా, బోర్డు సీఈవో రాహుల్ జోహ్రీ, అధ్యక్షుడు సికె ఖన్నాలు ఇతర కారణాల రీత్యా హాజరు కాలేకపోయారు.

ఈ ఏడాది ఐపీఎల్ ముగిసిన తర్వాత స్వదేశంలో టీమ్ ఇండియా మూడు టెస్టులు ఆడాల్సి ఉన్నది. వాటిలో జులైలో అఫ్ఘనిస్థాన్‌తో చారిత్రక టెస్టు ఒకటి. మిగతా రెండు వెస్టిండీస్‌తో ఆడాల్సి ఉంది. వీటిలో ఒకటి డేనైట్ టెస్టు. దీపావళి ముగిసిన అనంతరం అక్టోబర్‌లో విండీస్‌తో టెస్టు సిరీస్ ఉండనున్నది. నవంబర్ ఆరంభంలో కరీబియన్లతో ఐదు వన్డేల సిరీస్ ఉంటుంది. ఈ మ్యాచులకు ముంబయి, గౌహతి, కోచి, ఇండోర్, పుణెలు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. మూడు టీ20 మ్యాచులకు కోల్‌కత, చెన్నై, కాన్పూర్‌లు వేదిక కానున్నాయి. నవంబర్ తర్వాత కోహ్లిసేన ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనున్నది. అక్కడ రెండు నెలల సుదీర్ఘ పర్యటన చేయనున్నది. వచ్చే ఏడాది ఆరంభంలో (ఫిబ్రవరి-మార్చి)లో ఆస్ట్రేలియా తిరిగి భారత్‌కు రానున్నది. అప్పుడు ఐదు వన్డేలు, రెండు టీ20 ఆడుతుంది. ఐదు వన్డేలకు మొహాలీ, హైదరాబాద్, నాగ్‌పూర్, ఢిల్లీ, రాంచీలు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. హైదరాబాద్‌లో జరిగే రెండో వన్డే ఫిబ్రవరి 27న ఉంటుంది. రెండు టీ20లు బెంగళూర్, విశాఖపట్నంలో జరుగుతాయి. మార్చి 13 విశాఖ తీరంలో రెండో టీ20తో ఆస్ట్రేలియా పర్యటన ముగియనున్నది.

అందుకే.. ముందుగా : సాధారణంగా బీసీసీఐ సిరీస్‌కు ముందు మాత్రమే షెడ్యూల్ విడుదల చేస్తుంది. కానీ ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ వంటి క్రికెట్ బోర్డులు 3-4 నెలల ముందే షెడ్యూల్ ఇస్తున్నారు. దీంతో టికెట్లు కొనుగోలు చేసేందుకు, మ్యాచ్‌కు సన్నద్ధం అయ్యేందుకు అభిమానులకు వీలు పడుతుంది. విదేశీ అభిమానులకు సైతం ఇది ఉపయుక్తంగా ఉంటుంది. అందుకే ఈ సీజన్ నుంచి బీసీసీఐ సైతం అదే తరహాలో ముందుగానే పూర్తి షెడ్యూల్ విడుదల చేయాలని నిర్ణయించింది. రాష్ట్ర సంఘాలకు సైతం దేశవాళీ ప్రణాళికలు సర్దుబాటు చేసుకునే వెసులుబాటు కల్పించినట్టు అవుతుంది. ఇక డిసెంబర్ సమయంలో ఢిల్లీలో కాలుష్యం తీవ్రతను దృష్టిలో ఉంచుకుని.. వెస్టిండీస్‌తో సిరీస్‌కు ఆ వేదికను ఎంచుకోలేదు. ఆస్ట్రేలియాతో సిరీస్ సందర్భంగా మార్చిలోనే కోట్లాలో క్రికెట్ పోరును ఎంచుకున్నారు.

బంగ్లా అతి చేష్టలు

- డ్రెస్సింగ్ రూమ్ అద్దాలు బద్దలు
- షకిబ్, నురుల్ మ్యాచ్ ఫీజులో కోత



పగిలిన బంగ్లా డ్రెస్సింగ్‌రూమ్ అద్దాలు

కొలంబో : ఇటీవల మైదానంలో బంగ్లాదేశ్ ఆటగాళ్ల ప్రవర్తనలో విచిత్రమైన మార్పు వచ్చింది. పొరుగు దేశాలతో ఆడుతున్నప్పుడు ఆ దేశ ఆటగాళ్లు విపరీత భావోద్వేగాలకు లోనవుతున్నారు. భారత్‌తో మ్యాచ్‌ల్లోనూ ఇది స్పష్టంగా కనిపిస్తోంది. తాజాగా శ్రీలంకతో టీ20 మ్యాచ్‌లో అది శృతిమించింది. కెప్టెన్ షకిబ్ అల్ హసన్ అంపైర్ నిర్ణయం పట్ల అసంతృప్తితో ఆటగాళ్లను బయటకు వచ్చేయమని ఆదేశించగా, అదనపు ఆటగాడు నురుల్ హొసెన్ లంక సారథితో గొడవ పెట్టుకున్నాడు. దీనికి తోడు ఉత్కంఠ విజయానంతరం బంగ్లాదేశ్ డ్రెస్సింగ్‌రూమ్ అద్దాలు పగులగొట్టారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది బంగ్లాదేశ్ ఆటగాడొకరు అద్దాలు బద్దలు కొట్టాడని మ్యాచ్ రిఫరీకి ఫిర్యాదు చేశారు. దీనిపై సీసీటీవీ ఫుటేజీ ఆధారాలు చూసిన తర్వాత చర్యలు తీసుకోనున్నారు. ఇక మైదానంలో వికృత ప్రవర్తనకు బంగ్లా ఆటగాళ్లకు మ్యాచ్ రిఫరీ మ్యాచ్ ఫీజులో కోత విధించారు. అంపైర్ నిర్ణయం పట్ల అసంతృప్తికి షకిబ్‌కు 25 శాతం, లంక సారథితో గొడవకు నురుల్‌కు 25 శాతం మ్యాచ్ ఫీజు కోత విధించారు. ఈ ఘటనలపై బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు పశ్చాత్తాపం వ్యక్తం చేసింది. ' ఏ స్థాయి క్రికెట్‌లోనైనా ఇటువంటి ఘటనలు అంగీకారం కాదు. దురదృష్టశావత్తు జరిగిన ఘటనలకు పశ్చాతాపం వ్యక్తం చేస్తున్నాం. క్రీడా స్ఫూర్తి ప్రదర్శించటంలో బంగ్లా క్రికెటర్ల బాధ్యతలో ఎటువంటి మార్పు లేదు. శుక్రవారం నాటి సంఘటనలు బాధాకారం. ఉత్కంఠ మ్యాచ్‌లో ఒత్తిడితో ఆటగాళ్లు అలా ప్రవర్తించారని అర్థం చేసుకున్నాం. మళ్లీ పునరావృతం కాబోవు' అని బంగ్లా బోర్డు ఓ ప్రకటనలో తెలిపింది.



లంక సారథితో నురుల్ వాదన



ఫ్చ్.. సింధు

- సెమీస్‌లో పోరాడిన ఓడిన తెలుగు తేజం
- 2-1తో యమగూచి ముందంజ
- ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్

నవతెలంగాణ-బర్మింగ్‌హామ్

ఆల్ ఇంగ్లాండ్‌లో భారత ఆశలు ఆవిరయ్యాయి. పతకం తెస్తుందని ఆశలు పెట్టుకున్న పి.వి సింధు పోరాటానికి సెమీఫైనల్లోనే తెరపడింది. రెండో సీడ్ అకానె యమగూచి (జపాన్)తో మూడు గేముల పోరులో హోరాహోరీగా పోరాడిన సింధు 21-19, 19-21, 18-21తో ఓటమిపాలైంది. గంటన్నర పాటు సాగిన సెమీ సమరంలో సింధు ఆరంభంలో ముందంజలో నిలిచినా.. ఆఖర్లో ఆధిక్యం నిలుపుకోలేదు. ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో తొలిసారి సెమీస్‌కు చేరుకున్న సింధు.. మరో అడుగు ముందుకేయలేదు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్ మ్యాచ్‌లో హెచ్.ఎస్ ప్రణయ్ పోరాడి ఓడాడు. చైనా షట్లర్ చేతిలో 2-20, 16-21, 21-23తో మూడు గేముల్లో తలొగ్గాడు. తొలుత ప్రణయ్, తర్వాత సింధు నిష్క్రమణతో బర్మింగ్‌హామ్‌లో భారత పతక వేటకు తెరపడింది. నేడు జరిగే మహిళల సింగిల్స్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ తాయ్ జుయింగ్ (చైనీస్ తైపీ)తో అకానె యమగూచి తలపడనున్నది.

ముందు జోరు, ఆఖర్లో డీలా :

సెమీఫైనల్లో సింధుకు అద్భుత ఆరంభం లభించింది. తొలి గేమ్‌లో 7-2తో ఐదు పాయింట్ల ఆధిక్యంతో జోరు మొదలెట్టిన సింధు.. విరామ సమాయనికి 11-6తో ఆధిక్యం నిలుపుకున్నది. ద్వితీయార్థంలో యమగూచి ప్రతిఘటించింది. 10-17 నుంచి 15-17తో పాయింట్ల అంతరాన్ని తగ్గించింది. యమగూచి వరుస పాయింట్లతో ఉత్కంఠ రేకెత్తినా.. సింధు 20-18తో ముందుకెళ్లింది. 21-19తో తొలి గేమ్ సొంతం చేసుకున్నది. రెండో గేమ్ ఆరంభంలోనూ సింధుకు ఎదురులేదు. కానీ 7-9, 9-11తో విరామ సమయానికి యమగూచికి ఆధిక్యం కోల్పోయింది. సెకండ్ హాఫ్‌లో సింధు పోరాడినా పాయింట్ల అంతరం తగ్గలేదు. 14-17, 17-19, 18-19తో వెనకంజలోనే కొనసాగింది. 21-19తో రెండో గేమ్ నెగ్గిన యమగూచి మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లింది. ఫైనల్స్ బెర్త్‌ను నిర్ణయించే గేమ్‌లో సింధు దూకుడుగా ఆడింది. 7-4, 9-7, 11-7తో దూసుకెళ్లింది. కానీ ద్వితీయార్థంలో సింధు లయ తప్పింది. యమగూచి వరుస పాయింట్లతో దూసుకొచ్చింది. 14-14తో సమవుజ్జీగా నిలిచి రేసును రక్తి కట్టించింది. 16-16, 17-17, 18-18తో ఆధిక్యం చేతులు మారుతూ ఉత్కంఠ రేపిన తరుణంలో సింధు తడబడింది. యమగూచికి వరుసగా మూడు పాయింట్లు కోల్పోయి ఫైనల్స్ బెర్త్‌ను చేజార్చుకున్నది.

గుర్బానీ గర్జన

రెస్టాఫ్ ఇండియాతో విదర్భ ఇరానీ కప్

నాగ్‌పూర్ : విదర్భ పేసర్ రజ్నీశ్ గుర్బానీ (4/46) నిప్పులు చెరగటంతో రెస్టాఫ్ ఇండియా 236/7తో పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. జాఫర్ (286)కు తోడు వాంఖడే (157), సతీశ్ (120) శతకాలతో విదర్భ తొలి ఇన్నింగ్స్‌ను 800/7 వద్ద డిక్లరేషన్ ప్రకటించింది. రెస్టాఫ్ ఇండియా తరఫున ఓపెనర్ పృథ్వీ షా (51), హనుమ విహారి (81 నాటౌట్), జయంత్ యాదవ్ (62 నాటౌట్) ఆకట్టుకున్నారు. గుర్బానీ దెబ్బకు సమ్రత్ (0), కరుణ్ నాయర్ (21), భరత్ (0), అశ్విన్ (8) స్వల్ప స్కోరుకే నిష్క్రమించారు. విజయ్ హజారే టోర్నీ హీరో మయాంక్ అగర్వాల్ (11) విఫలమయ్యాడు. ప్రస్తుతం రెస్టాఫ్ ఇండియా మరో 564 పరుగుల వెనుకంజలో కొనసాగుతోంది. ఇరానీ కప్ మ్యాచ్‌లో నేడు ఆఖరి రోజు ఆట. ఐదు రోజుల్లో ఫలితం తేలకుంటే తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో విజేతను తేలుస్తారు.

ఐఎస్ఎల్ విజేత చెన్నయిన్



బెంగళూర్ : చెన్నయిన్ ఎఫ్‌సీ రెండోసారి ఐఎస్ఎల్ విజేతగా అవతరించింది. బెంగళూర్‌తో జరిగిన టైటిల్ పోరులో 3-2తో గెలుపొందిన చెన్నయిన్ ట్రోఫీని సొంతం చేసుకున్నది. అరంగేట్రంలోనే టైటిల్‌పై కన్నేసిన బెంగళూర్ ఎఫ్‌సీకి ఫైనల్లో నిరాశే ఎదురైంది. సునీల్ ఛెత్రీ ఆరో నిమిషం గోల్‌తో బెంగళూర్‌ను ఆధిక్యంలో నిలిపాడు. కానీ 17, 45వ నిమిషాల్లో గోల్స్‌తో మలిసన్ చెన్నయిన్‌ను ముందంజలో నిలిపాడు. రాఫెల్ 67వ నిమిషంలో మరో గోల్‌తో మెరిశాడు. బెంగళూర్ తరఫున మికూ మరో గోల్ కొట్టినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.